అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

శుక్రవారం 2-08-2024

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 10 | సంచిక : 164 | Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar | 12 పేజీలు | వెల : 6.50

వర్గీకరణకు ఓకే

ఆ అధికారం రాష్ట్రాలదే ... సుప్రీం చారిత్రాత్మక తీర్పు

ఎస్సీ, ఎస్టీల ఉప వర్గీకరణపై సుప్రీంకోర్టు గురువారం చారిత్రక తీర్పు వెలువరించింది. ప్రభుత్వ ఉద్యోగాలు, విద్యా సంస్థల్లో ప్రవేశాల కోసం షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల రిజర్వేషన్ కోటాను ఉప కులాల వారీగా వర్గీకరించేందుకు రాష్ట్రాలకు అధికారం ఉన్నదని స్పష్టం చేసింది. సమాజంలోని అణగారిన కులాల అభ్యున్నతి కోసం రాష్ట్రాలు ఉప వర్గీకరణ జరపవచ్చునని తేల్చి చెప్పింది.

6-1 తేడాతో ధర్మాసనం తీర్పు

2004 నాటి తీర్పు చెల్లదని రూలింగ్

న్యూఢిల్లీ : ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ నేతృత్వంలో ఏడుగురు సభ్యులతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనంలో బేలా త్రివేదీ మినహా మిగిలిన న్యాయ మూర్తులందరూ ఉప వర్గీకరణకు అనుకూలంగా తీర్పు ఇచ్చారు. ఎస్సీ, ఎస్టీల ఉప వర్గీకరణపై 2004లో ఈవీ చిన్నయ్య వర్సెస్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కేసులో ఇదే న్యాయ స్థానం ఇచ్చిన తీర్పు చెల్లదని రూలింగ్ ఇచ్చింది. ఎస్సీ, ఎస్టీలను ఉప కులాలుగా వర్గీకరించి, ఆయా వర్గాల్లో బాగా వెనుకబడిన కులాల వారికి రిజర్వేషన్ కోటా కల్పించేం దుకు ఈ తీర్పు ఉపయోగపడుతుంది. జస్టిస్ చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనంలో జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ బేలా ఎం త్రివేదీ, జస్టిస్ పంకజ్ మిట్టల్, జస్టిస్ మనోజ్ మిశ్రా, జస్టిస్ సతీష్ చంద్ర సభ్యులుగా ఉన్నారు. ఈ కేసులో వీరు వేర్వేరుగా ఆరు తీర్పులు వెలువరించారు. జస్టిస్ మిశ్రాకు, తనకు కలిపి జస్టిస్ చంద్రచూడ్ తీర్పు రాశారు. మిగిలిన నలుగురు వేర్వేరుగా తీర్పులు ఇచ్చారు. అయితే బేలా త్రివేదీ మినహా మిగిలిన వారందరూ ఏకాభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. రిజర్వేషన్లలో ఉప వర్గీకరణ సాధ్యంకాదని జస్టిస్ బేలా త్రివేదీ అభిప్రాయపడ్డారు. రాజ్యాంగంలోని 341వ అధికరణ ప్రకారం నోటిఫై చేసిన ఎస్సీ జాబితాను మార్చే అధికారం రాష్ట్రాలకు లేదని ఆమె తెలిపారు. రిజర్వేషన్లకు సంబంధించి రాష్ట్రాలు సదుద్దేశంతో చర్యలు తీసుకుంటున్నప్పటికీ ఆర్టికల్ 142 ప్రకారం వాటిని సుప్రీంకోర్టు సమర్థించజాలదని అన్నారు. జస్టిస్ గవాయ్ తన తీర్పులో కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీ, ఎస్టీ క్రీమిలేయర్‌ను గుర్తించి వారిని రిజర్వేషన్ పరిధి నుండి తొలగించాలని ఆయన

...11లో

ప్రస్తుత రిజర్వేషన్లు ఇలా...

కేంద్ర ప్రభుత్వ నిధులతో నడుస్తున్న ఉన్నత విద్యా సంస్థల్లో ప్రస్తుతం 22.5 శాతం సీట్లు ఎస్సీలకు, 7.5 శాతం సీట్లు ఎస్టీలకు రిజర్వ్ చేశారు. ప్రభుత్వోద్యోగాలలో కూడా ఇదే నిబంధనను పాటిస్తున్నారు. పంజాబ్, హర్యానా రాష్ట్రాల్లో మాత్రం ఎస్టీ జనాభా లేదు.



ఇక రాష్ట్ర ప్రభుత్వాలదే బాధ్యత

ఎస్సీల ఉప వర్గీకరణపై సీపీఐ(ఎం)

న్యూఢిల్లీ : షెడ్యూల్డ్ కులాల ఉప వర్గీకరణకు అనుమతిస్తూ 6-1 ఓట్ల తేడాతో సుప్రీం కోర్టు ఏడుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం తీర్పునిచ్చింది. ఎస్సీ కేటగిరీల్లోనే మరిన్ని వెనుకబడిన వర్గాలకు విడివిడిగా కోటాలను ఇచ్చుకోవడానికి అనుమతించింది. ఉప వర్గీకరణకు తగినంతగా ప్రాతినిధ్యం లేకపోవడానికి సంబంధించిన డేటా ప్రాతిపదికన ఈ ఉప వర్గీకరణను రాష్ట్ర ప్రభుత్వం సమర్థించుకోవాల్సి వుంటుందని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో పేర్కొంది. ఈ మేరకు ఒక ప్రకటన జారీ చేసింది. సుప్రీం కోర్టు ఆదేశాల ప్రకారం, ఎస్సీల్లోని వెనుకబడిన వర్గాలకు వారి పరిస్థితులు మెరుగుపరిచేందుకు కావాల్సిన

...11లో

అసెంబ్లీలో గరం..గరం

స్పీకర్ పోడియాన్ని చుట్టుముట్టిన బీఆర్ఎస్ సభ్యులు | సబితకు సీఎం క్షమాపణ చెప్పాలని పట్టు

- నినాదాలు..చప్పట్లతో అక్కడే బైటాయింపు
- సభ వాయిదా పడేవరకూ నిల్చొనే ఉన్న మహిళా సభ్యులు
- వారి వారి స్థానాల్లో కూర్చుంటేనే మైకు ఇస్తానని స్పష్టం చేసిన స్పీకర్
- బీఆర్ఎస్ సభ్యులు సహకరించాలని పలుమార్లు విన్నపం
- సభకు సహకరించాలని సీపీఐ, బీజేపీ, ఎంఐఎం పక్షనేతల హితవు
- వెనక్కి తగ్గకుండా బీఆర్ఎస్ సభ్యుల వాకౌట్





మైకు ఇవ్వలేదని నిరసనలు..ఇస్తే శాపనార్థాలు.. ఇదేం ధోరణి? : సీఎం రేవంత్ రెడ్డి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

సభలో బీఆర్ఎస్ సభ్యుల నిరసనలు.. వారి స్థానాల్లో కూర్చొని సహకరించా లంటూ స్పీకర్ ప్రసాద్‌కుమార్, శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ విన్నపాలు...ఈ పద్ధతి సరిగాదంటూ సీపీఐ, బీజేపీ, ఎంఐఎం సభ్యుల వారింపులు...అయినా 'సీఎం క్షమాపణ చెప్పాల్సిందే..సీఎం డౌన్ డౌన్..వియ్ వాంట్ జస్టిస్' అంటూ బీఆర్ఎస్ సభ్యుల నినాదాలు...'మైక్ అన్నా ఇవ్వండి..సస్పెండ్ అయినా చేయండి' అంటూ అక్బరుద్దీన్ సూచనలు..కుర్చీల్లో కూర్చొంటేనే మైక్

...2లో

ప్రస్తుత నోటిఫికేషన్లలోనూ ఎస్సీ వర్గీకరణ అమలు

అవసరమైతే ప్రత్యేక ఆర్డినెన్స్ తీసుకొస్తాం

ఎస్సీ వర్గీకరణపై మా ప్రభుత్వ కృషి ఫలించింది : సీఎం రేవంత్‌రెడ్డి

10లో



దద్దరిల్లిన పార్లమెంట్

- వ్యవసాయం, విద్యా, రైల్వే రంగాలు కుదేలు
- ఎంఎస్ స్వామినాథన్‌కు భారతరత్న ఇస్తారు.. ఆయన చేసిన సిఫారసులు అమలు చేయరు

పార్లమెంట్ ఉభయ సభల్లో ప్రతిపక్షాలు

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

పార్లమెంట్ దద్దరిల్లింది. ఎన్డీఏ ప్రభుత్వ హయంలో దేశంలోని వ్యవసాయం, విద్యా, రైల్వే రంగాలు కుదేలు అయ్యాయని ప్రతిపక్షాలు విమర్శించాయి. గురువారం లోక్‌సభలో విద్యా, రైల్వే రంగాల బడ్జెట్‌పై చర్చ జరగ్గా, రాజ్యసభలో వ్యవసాయ రంగంపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా ప్రభుత్వ వైఫల్యాలపై ప్రతిపక్షాలు ప్రశ్నించాయి. రాజ్యసభలో సీపీఐ(ఎం) ఎంపీ బికాష్ రంజన్ భట్టాచార్య మాట్లాడుతూ హరిత విప్లవ పితామహుడు

...2లో



నేడే జాబ్ క్యాలెండర్

అసెంబ్లీలో సీఎం ప్రకటన

- ధరణికి 'భూమాత'గా పేరు మార్పు
- గ్రేటర్‌లోకి మున్సిపాల్టీలు, కార్పొరేషన్లు, గ్రామాలు
- శ్రీధర్‌బాబు నేతృత్వంలో సబ్‌కమిటీ
- కొత్త రేషన్‌కార్డుల జారీకి ఓకే
- ఉత్తమ్ పర్యవేక్షణలో ఉపసంఘం

సీఎం రేవంత్ అధ్యక్షతన క్యాబినెట్ భేటీ, కీలక నిర్ణయాలు

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అధ్యక్షతన భేటీ అయిన మంత్రివర్గ సమావేశం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. గురువారం అసెంబ్లీలో మంత్రివర్గం ఆయా సమస్యలు, ప్రతిపాదనలపై గంటన్నరపాటు చర్చించింది. సాయంత్రం నాలుగు గంటలకు ప్రారంభమైన సమావేశం ఐదున్నర గంటలకు ముగిసింది. మంత్రివర్గ సమావేశం ముగిసిన అనంతరం మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్ గౌడ్ క్యాబినెట్ నిర్ణయాలను మీడియాకు చెప్పారు. వివరాలు ఇలా ఉన్నాయి.

1. కేరళలోని వయనాడ్‌లో భారీ వర్షాలతో పాటు కొండచరియలు విరిగిపడి చాలా మంది చనిపోయారు. ఈ విషాదంపై

...10లో

వారసత్వ పన్నుపై చర్చ జరగాలి

అంబానీ కొడుకు పెండ్లిపై ఎందుకింత ఆర్భాటం?

- పత్రికలు శ్రమజీవుల పక్షాన నిలవాలి
- 'నవతెలంగాణ' ఆ లక్ష్యంతో సాగాలి
- నవతెలంగాణ 9వ వార్షికోత్సవంలో సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

వారసత్వ పన్నుపై దేశ ప్రజల మధ్య చర్చ జరగాలని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు అన్నారు. దీనిపై కాంగ్రెస్ నేత శ్యాం పిట్రోడా మాట్లాడితే, దాన్ని ప్రధాని మోడీ ఎన్నికల అస్త్రంగా వాడుకొనే ప్రయత్నం చేశారని చెప్పారు. ప్రజల ఆస్తుల్ని కొల్లగొట్టి లాభాల్లోకి మార్చుకుంటుంటే వారసత్వ పన్ను విధించడంలో తప్పు ఏం లేదని తేల్చిచెప్పారు. 'నవతెలంగాణ' 9వ వార్షికోత్సవం గురువారంనాడిక్కడి మోటూరి హనుమంతరావు భవన్‌లో జరిగింది. దీనికాయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అదానీ కుమారుడి పెండ్లి వేడుకల గురించి ఆరునెలలపాటు మీడియా మొత్తం విస్తృత ప్రచారం కల్పించిందనీ, దేశంలో నిత్యం లక్షల పెండ్లిండ్లు జరుగుతుంటే, ఆ వివాహానికి ఎందుకంతటి ప్రచారం కల్పించాల్సి వచ్చిందని ప్రశ్నించారు. ఈ పెండ్లికి ఎన్ని వేల కోట్లు ఖర్చు చేశారో విదేశీ మీడియా రాసిందనీ, ఇక్కడి ఒక్క పత్రికలోనూ ఆ వివరాలు రాలేదన్నారు. భారతదేశ పెట్టుబడిదారీవర్గం దేశ ఆర్థిక వ్యవస్థకు ఎలా నష్టం చేస్తుందో దీన్నిబట్టి

...12లో



సత్తాచాటిన స్వప్నిల్

వివరాలు 2లో

బొగ్గు బ్లాక్‌ల వేలాన్ని ఆపాలి

శ్రావణపల్లి బ్లాక్‌ను సింగరేణికి కేటాయించాలి

ఓసీపీ-2 సమావేశంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వీరయ్య

వివరాలు 12లో



ఫోర్త్ సిటీగా బేగారి కంచ

● యువతే లక్ష్యంగా స్కిల్ యూనివర్సిటీ ● వృత్తి నైపుణ్యానికే తొలి ప్రాధాన్యం

- న్యూయార్క్ కంటే అద్భుతంగా ముచ్చర్లను తీర్చిదిద్దుతాం
- ప్రపంచ పర్యాటక కేంద్రంగా మహేశ్వరం మారబోతుంది
- భూములు కోల్పోయిన రైతులను ఆదుకుంటాం:యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ శంకుస్థాపనలో సీఎం రేవంత్‌రెడ్డి

నవతెలంగాణ రంగారెడ్డి ప్రాంతీయ ప్రతినిధి

రాష్ట్రంలో ఫోర్త్ సిటీగా బేగరి కంచ మారబోతున్నదని, ముచ్చర్లను న్యూయార్క్ కంటే అద్భుతంగా తీర్చిదిద్దుతామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీలో అడ్మిషన్ వస్తే చాలు.. ఉద్యోగం గ్యారంటీ అని, ఆ బాధ్యత తనదని యువతకు హామీ ఇచ్చారు. నాలుగేండ్లలో మహానగరంగా ముచ్చర్ల మారబోతోందని ధీమా వ్యక్తం చేశారు. రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలంలోని మీర్‌ఖాన్ పేట, బేగరి కంచ రెవెన్యూ పరిధిలో యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీతో పాటు ఈ ప్రాంతంలో భూముల కోల్పోయిన భూ నిర్వాసితుల నివాసాల కోసం టౌన్‌షిప్ నిర్మాణాలకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్ బాబు, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారు.

తెలంగాణ ఉద్యమం మొదలయిందే ఉద్యోగాల కోసం అని, ఉద్యమ కాలంలో కీలక పాత్ర పోషించింది కూడా నిరుద్యోగులేనని సీఎం గుర్తు చేశారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ప్రధాన లక్ష్యం నిరుద్యోగ సమస్య అని, డిగ్రీ, పీజీ పట్టాలు ఉన్నప్పటికీ వృత్తి నైపుణ్యత లేకపోవడంతో ఉద్యోగాలు రావడం లేదన్నారు. రాష్ట్రంలో యువతకు నైపుణ్య శిక్షణనిచ్చి నిరుద్యోగ యువత సమస్యలకు శాశ్వత పరిష్కార మార్గం చూపాలన్న లక్ష్యంతో 57 ఎకరాల్లో రూ. 100 కోట్లతో 'యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ'కి శ్రీకారం చుట్టినట్టు తెలిపారు. నాటి ప్రధాని నెహ్రూ విద్యా, సాగు నీటి ప్రాజెక్టులకు అధిక ప్రాధాన్యత ఇచ్చారని గుర్తు చేశారు. వారు తీసుకున్న నిర్ణయాలతో ఈ రోజు నాగార్జున సాగర్ లాంటి పెద్ద సాగునీటి ప్రాజెక్టులు నెలకొల్పబడ్డాయని, వాటి ద్వారా రైతులకు ఎంతో మేలు జరుగుతుందని తెలిపారు. విద్యార్థుల కోసం యూనివర్సిటీలు నెలకొల్పబడ్డా యన్నారు. హైదరాబాద్‌కు తాగునీటి కోసం గోదావరి, కృష్ణ జలాలను తీసుకొచ్చామని తెలిపారు. ఔటర్ రింగ్ రోడ్డు,

...2లో

దద్దరిల్లిన పార్లమెంట్

(మొదటిపేజీ తరువాయి)

ఎంఎస్ స్వామినాథన్‌కు భారతరత్న ఇస్తారని, కానీ ఆయన వ్యవసాయ రంగంపై ఆయన చేసిన సిఫారసులు విస్మరించారని ధ్వజమెత్తారు. ఆయన సూచనలులు విస్మరించడమంటే, ఆయనను అగౌరవపరచడమేనని అన్నారు. ప్రధాని మోడీ చేసిన కార్పొరేట్ అనుకూల వ్యవసాయ చట్టాలను రైతులు ఎలా తిప్పికొట్టారో ప్రపంచం మొత్తం చేసిందని అన్నారు. రైతుల సమస్యలను, వ్యవసాయ సంక్షోభాన్ని ఈ ప్రభుత్వం పట్టించుకోవటం లేదని విమర్శించారు. అప్పుల బాధతో రైతులు ఆత్మహత్యలు పెరిగాయని, వీటిని నివారించడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలం అయిందని దుయ్యబట్టారు. కార్పొరేట్లకు రుణమాఫీ చేసే ప్రభుత్వం, రైతులకు ఎందుకు రుణమాఫీ చేయటం లేదని ప్రశ్నించారు. కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) చట్టం చేయాలని రైతులు డిమాండ్ చేస్తోన్నారని, కానీ మోడీ సర్కార్ పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. పలుమార్లు పీఎం కిసాన్ గురించి మాట్లాడుతున్నారని, అయితే రెండున్నరేండ్లలో 1.54 కోట్ల మంది రైతులను పీఎం కిసాన్ నుంచి తొలగించారని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం రైతులను మోసం చేస్తోందని కాంగ్రెస్ నేత రణదీప్ సుర్జేవాలా విమర్శించారు. నిర్ణయించిన కనీస మద్దతు ధరకు ప్రభుత్వం పంటను కొనుగోలు చేయడం లేదని ఆరోపించారు.

విద్యా స్వేచ్ఛలో బలహీనత

బీజేపీ ప్రభుత్వ హయంలో విద్యా స్వేచ్ఛ బలహీనపడిందని కాంగ్రెస్ ఎంపీ ఆంటోని విమర్శించారు. లోక్‌సభలో జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ విద్యా రంగాన్ని నిర్వీర్యం చేస్తోందని దుయ్యబట్టారు. "ఈ దేశంలోని విద్యార్థులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేసే స్వేచ్ఛ లేదు. విద్యా స్వేచ్ఛ గణనీయంగా బలహీనపడింది. విద్యా రంగంలో భయానక వాతావరణం ప్రవేశించింది" అని ఆయన విమర్శించారు.

రైల్వే మంత్రి కాదు...రీల్ మంత్రి

గత రెండు నెలల్లో నాలుగు గూడ్స్ రైళ్లు పట్టాలు తప్పాయని, ఈ ప్రమాదాల్లో 14 మంది మరణించినా రైల్వే శాఖ మంత్రి ఎలాంటి నైతిక బాధ్యత వహించలేదని కాంగ్రెస్ ఎంపి గౌరవ్ గొగొయ్ విమర్శించారు. నైతిక బాధ్యత వహించకపోగా రైల్వే మంత్రి అశ్వని వైష్ణవ్ ప్రతిపక్షాల మీద విరుచుకుపడుతున్నారని ఎద్దేవా చేశారు. గత ఏడాది బాలాసోర్‌లో జరిగిన రైలు ప్రమాదంలో ఏకంగా 300 మంది ప్రాణాలు కోల్పోయారని గుర్తుచేశారు. గత ఒకటి రెండు సంవత్సరాలుగా రైలు ప్రమాదాలు పెరుగుతున్నా రైల్వే మంత్రి మాత్రం తనకేమీ పట్టనట్టు రీల్స్ చేయడంలో మునిగిపోయారని విమర్శించారు. ఆయన రైల్వే మంత్రి కాదని రీల్ మినిస్టర్, డిరైల్‌మెంట్ మినిస్టర్ అని ఎద్దేవా చేశారు. దేశంలో వరుసగా జరుగుతున్న రైలు ప్రమాదాలకు బాధ్యత వహిస్తూ రైల్వే మంత్రి తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఏ ఒక్కరూ బాధ్యత తీసుకోకపోవడం బీజేపీ సంప్రదాయంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. రైలు ప్రమాదాలపై మంత్రి అశ్విని వైష్ణవ్ ప్రకటన సంతృప్తికరంగా లేదని, అందుకే ప్రతిపక్ష ఇండియా కూటమి పార్టీలు సభ నుంచి వాకౌట్ చేశాయని కాంగ్రెస్ గౌరవ్ గొగొయ్ పేర్కొన్నారు.

ప్రతిపక్షాలపై రైల్వే మంత్రి దాడి

తమ ప్రభుత్వం హయంలో ఏం చేశారో చెప్పమంటే, దానికి సమాధానం చెప్పకుండా ప్రతిపక్షాలపై రైల్వే మంత్రి అశ్వని వైష్ణవ్ దాడికి దిగారు. 58 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో కేవలం ఒక కిలోమీటర్ ట్రాక్‌కు కూడా వారు ఆటోమేటిక్ ట్రైన్ ప్రొటెక్షన్ (ఏటీపీ) నెలకొల్పలేదని అన్నారు. మమతా బెనర్జీ రైల్వే మంత్రిగా పనిచేసిన సమయంలో రైలు ప్రమాదాలు 0.24 శాతం నుంచి 0.19 శాతానికి తగ్గాయని చెప్పగానే బల్లలు చరిచారని, తాము రైలు ప్రమాదాలను 0.19 శాతం నుంచి 0.3 శాతానికి తగ్గించినా తమను నిందిస్తున్నారని, ఈ రకంగా దేశాన్ని నడపగలమా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియాలో తన ట్రోల్ ఆర్మీతో తప్పుడు విషయాలను ప్రచారం చేస్తోందని ఆరోపించారు. కాంగ్రెస్ తన దుష్ప్రచారంతో రైల్వేల్లో ప్రతిరోజూ ప్రయాణించే రెండు కోట్ల మంది ప్రజల గుండెల్లో గుబులు రేపుతోందని, ప్రయాణీకులను భయపెట్టడమే ఆ పార్టీ ఉద్దేశమా అని కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వనీ వైష్ణవ్ ప్రశ్నించారు. రైళ్లలో మూడింట రెండు వంతుల నాన్ ఏసీ కోచ్‌లు, మూడోవంతు ఏసీ కోచ్‌లు ఉంటాయని, జనరల్ కోచ్‌లకు పెరిగిన డిమాండ్ దృష్ట్యా ప్రతి మెయిల్, ఎక్స్‌ప్రెస్ ట్రైన్‌లో కనీసం నాలుగు జనరల్ కోచ్‌లు ఉండేలా చూస్తామని చెప్పారు. ఇందుకోసం 2,500 జనరల్ కోచ్‌లు త్వరలో సిద్ధమవుతాయని మంత్రి తెలిపారు.

అసెంబ్లీలో గరం..గరం

(మొదటిపేజీ తరువాయి)

ఇలా గురువారమంతా అసెంబ్లీ హాట్‌హాట్‌గా కొనసాగింది. ఇటు స్పీకర్..అటు బీఆర్ఎస్ సభ్యులు ఎంతకీ తగ్గకపోవడంతో ఉద్రిక్తత నెలకొంది. చివరకు బీఆర్ఎస్ సభ్యులు వాకౌట్ చేసి వెళ్లిపోవడానికి దారితీసింది. అయితే, ఆ పార్టీకి చెందిన ముగ్గురు మహిళా సభ్యులు సభ వాయిదా పడేవరకూ నిల్చొనే తమ నిరసన తెలిపారు.

అసెంబ్లీ సమావేశాలు గురువారం ఏడు నిమిషాలు ఆలస్యంగా ప్రారంభమయ్యాయి. బీఆర్ఎస్ సభ్యులు 10:05 గంటల ప్రాంతంలో నల్లరిబ్బన్లు ధరించి సభలో అడుగుపెట్టారు. సభ ప్రారంభం కాగానే యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ బిల్లుపై స్పీకర్ చర్చ ప్రారంభించారు. బీఆర్ఎస్ మహిళా సభ్యులకు సీఎం క్షమాపణ చెప్పాలనీ, తమకు మైకు ఇవ్వాలని బీఆర్ఎస్ సభ్యులు నిలబడి నిరసన తెలిపారు. స్పీకర్ పోడియం వద్దకు 10:11 గంటల ప్రాంతంలో వెళ్లారు. దీంతో స్పీకర్ జోక్యం చేసుకుంటూ 'కేటీఆర్‌కు చెప్పా. సమయం ఇస్తా. దయచేసి బిల్లుకు సహకరించండి. కూర్చోండి' అని సూచించారు. దీంతో తమ స్థానాల్లోకి వెళ్లారు. ఐదారు నిమిషాలు కాగానే మళ్లీ స్పీకర్ పోడియం వద్దకెళ్లి 'సీఎం డౌన్ డౌన్..వియ్ వాంట్ జస్టిస్..సీఎం క్షమాపణ చెప్పాల్సిందే' అంటూ నినాదాలు చేశారు. స్పీకర్ మరోమారు జోక్యం చేసుకుని 'మంత్రి మాట్లాడుతున్నారుగా..రన్నింగ్ కామెంట్లు ఏంటి? నినాదాలేంటి తొందరెందుకు? మాట్లాడెందుకు సమయం ఇస్తాం' అని చెప్పినా బీఆర్ఎస్ సభ్యులు వినలేదు. మంత్రి శ్రీధర్‌బాబు తన ప్రసంగాన్ని అట్లాగే కొనసాగించారు. కొద్దిసేపటి తర్వాత బీఆర్ఎస్ సభ్యులు చప్పట్లు కొడుతూ నినాదాలు చేయడం మొదలుపెట్టారు. దీంతో స్పీకర్ ఒకింత ఆగ్రహానికి గురవుతూ..సభలో నినాదాలేంటి? బిల్లు పాస్ కావడం ఇష్టం లేదా? ఏంటిది? కూర్చోండి? ఇదేం పద్ధతి' అంటూ అసహనం వ్యక్తం చేశారు. అక్కడే నిల్చుకున్న కేటీఆర్ 'సభాపతి మైకు ఇవ్వడం లేదు. మహిళా సభ్యులను అగౌరవపర్చినా పట్టదా?' అంటూ గట్టి అరిచారు. 'మీ సొంత ప్రయోజనాల కోసం ఇలా మాట్లాడొద్దు' అని గట్టిగా మందలించడంతో వారు కాసేపు శాంతించారు.

కొద్దిసేపు కాగానే నినాదాలు మొదలెట్టడంతో 'దయచేసి కూర్చోండి. సభా మర్యాదల్ని కాపాడండి. ఈ విధంగా చేస్తే బాగుండదు. ఇక్కడున్న వారిలో చాలామంది సీనియర్ సభ్యులున్నారు. సభకు ఇది మంచిది కాదు' అని విన్నవించారు. అయినా వారు వినలేదు. 10:30 ప్రాంతంలో సభలోకి సీఎం అడుగుపెట్టారు. దీంతో వారు మరింత గట్టిగా నినాదాలు చేశారు. స్పీకర్ ఒకింత ఆగ్రహానికి గురవుతూ 'ఇది అప్రజాస్వామికం. స్పీకర్‌పై ఒత్తిడి చేయొద్దు. కూర్చుకుంటే మైకు ఇస్తానని ఇప్పటికే పలుమార్లు చెప్పా. ఇలాగే నిలబడితే అస్సలే మైకు ఇవ్వను' అని తేల్చిచెప్పారు. తమతో గొంతు కలపాలని బీఆర్ఎస్ సభ్యులు బీజేపీ సభ్యులను పిలువగా వారు సున్నితంగా తిరస్కరించారు. 'సభను గందరగోళ పర్చడం సరిగాదు. ఇది సరైన పద్ధతి కాదు' అని పాల్వాయి హరీశ్‌బాబు చురకలు అంటించారు. కాసేపటి తర్వాత బీఆర్ఎస్ సభ్యులు కింద కూర్చొని నిరసన తెలపడం మొదలుపెట్టారు. నినాదాలు, చప్పట్ల మధ్య ఇతర సభ్యుల ప్రసంగం 11:30 వరకు కొనసాగింది. ఎంఐఎం పక్ష నేత అక్బరుద్దీన్ ఓవైసీ జోక్యం చేసుకుంటూ 'స్పీకర్ గారూ ఇదేటండి? సభను ఆర్డర్‌లో పెట్టండి? వారికి మైకు అన్నా ఇవ్వండి..లేకుంటే సస్పెండ్ అయినా చేయండి. కాసేపు సభను వాయిదా వేయండి. అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య ఈ పరిస్థితి నెలకొంది కాబట్టి స్పీకర్ తన కార్యాలయానికి పిలిపించుకుని ముగింపు పలకాలి. సభ సజావుగా సాగేటట్టు చూడాలి' అని స్పీకర్‌కు సూచించారు.

వెంటనే స్పీకర్ జోక్యం చేసుకుంటూ 'కూర్చొంటే మైకు ఇస్తానని ఎన్ని సార్లు చెప్పినా వినటం లేదు' అని అన్నారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మాట్లాడుతూ..'సస్పెండ్ అనేది చివరి అస్త్రం' అని వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలో 'సీట్లలో కూర్చుందాం పదండి' అంటూ సబితా ఇంద్రారెడ్డి బీఆర్ఎస్ సభ్యులను తీసుకెళ్లింది. మైకు ఇవ్వగానే స్కిల్స్ యూనివర్సిటీ బిల్లుకు మద్దతు తెలుపుతున్నామనీ, ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పును స్వాగతిస్తున్నామని చెబుతూనే సభ జరుగుతున్న తీరు సరిగా లేదంటూ అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో స్పీకర్ మైక్ కట్ చేశారు. దీనిని నిరసిస్తూ బీఆర్ఎస్ సభ్యులు వాకౌట్ చేసి వెళ్లిపోయారు. ముగ్గురు మహిళా సభ్యులు సభ వాయిదా పడే వరకు అట్లాగే నిలబడి తమ నిరసన తెలిపారు.

జాబ్‌క్యాలెండర్ ప్రకటిస్తాం

- యువతలో నైపుణ్యాలు పెంచేందుకే స్కిల్స్ వర్సిటీ : మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు



నవతెలంగాణ బ్యూరో–హైదరాబాద్

త్వరలోనే అసెంబ్లీలో జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామని ఐటీ, శాసనసభావ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చెప్పారు. ఇచ్చిన హామీ మేరకు రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామన్నారు. అయినా, అందరికీ ఉద్యోగాలు కల్పించడం సాధ్యం కాదనీ, యువత భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని వారిలో నైపుణ్యాలు పెంచడంపై దృష్టి సారించామని తెలిపారు. అందులో భాగంగానే రాష్ట్రంలో ప్రభుత్వ ప్రయివేటు భాగస్వామ్యంతో యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని స్థాపించబోతున్నామని ప్రకటించారు. అందులో 17 రకాల కోర్సులను అందిస్తామని చెప్పారు. ఇప్పటికే శిక్షణ ఇచ్చి ఉద్యోగ కల్పన కల్పించేందుకు పలు సంస్థలు ముందుకొచ్చాయనీ, అందులో ఎస్‌బీఐ లాంటి ప్రభుత్వ రంగ సంస్థలు కూడా ఉన్నాయని వివరించారు. డిగ్రీలు, పీజీలు చేసినా సరైన నైపుణ్యాలు లేక నిరుద్యోగులుగా మిగిలిపోవాల్సిన పరిస్థితి రావడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. పరిశ్రమల్లో పనిచేయడానికి కావాల్సిన నైపుణ్యాలు యువతలో ఉండట్లేదన్నారు. సర్టిఫికెట్లు పొందుతున్నారుగానీ నైపుణ్యాలను పొందటం లేదని తెలిపారు. నైపుణ్యాలు ఎక్కువగా ఉన్నచోటకే ఎక్కువ పరిశ్రమలు వస్తాయన్నారు. రాబోయే కాలంలో విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంచి ఎక్కువ పరిశ్రమలు ఇక్కడకు వచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటికే హర్యానా, ఢిల్లీ, పశ్చిమబెంగాల్, అస్సాం, తదితర రాష్ట్రాల్లో స్కిల్స్ యూనివర్సిటీలున్నాయని చెప్పారు. 17 రకాల కోర్సులను అందించేందుకు ముందుకొచ్చిన సంస్థల వివరాలను చదివి వినిపించారు. తొలి ఏడాది ఆరు కోర్సుల్లో 2 వేల మంది వరకు శిక్షణ ఇస్తామని తెలిపారు. స్కిల్స్ యూనివర్సిటీ ఫ్యాకల్టీలో ప్రొఫెసర్లు, పరిశ్రమల్లో అనుభవం గల నిపుణులతో కూడిన బృందాలుంటాయని తెలిపారు. ప్రోగ్రెసివ్ ఆలోచనతో ముందుకెళ్తున్నప్పుడు ప్రతిపక్షం సహకరించాలనీ, ఇలా పదేపదే అడ్డుతగటం సరిగాదని సూచించారు. నిర్మాణాత్మకమైన సూచనలు చేస్తే స్వీకరించడానికి సిద్ధంగా ఉన్నామని చెప్పారు. ఇప్పటికే సీపీఐ, ఎంఐఎం, బీజేపీ వర్సిటీకి మద్దతు తెలిపాయనీ, బీఆర్ఎస్ సభ్యులు కూడా తమ వైఖరేంటో చెప్పాలని కోరారు.

పదేండ్లు పాలన చేసినవాళ్లు ఇలా చేయొచ్చా? : కూనంనేని

సీపీఐ పక్ష నేత కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ..రాష్ట్రాన్ని పదేండ్ల పాటు పాలించిన వాళ్లు సభలో ఇలా చేయొచ్చా? అని బీఆర్ఎస్ సభ్యులను ప్రశ్నించారు. నిరసన పేరుతో రుణమాఫీపైన మాట్లాడనీయలేదన్నారు. ఇప్పుడు స్కిల్స్ యూనివర్సిటీపై మాట్లాడే సమయంలో అడ్డుతగలటం సరిగాదన్నారు. మనస్సులో ఏదో పెట్టుకుని ఇక్కడ ఏదో చేయడం సరిగాదని సూచించారు. చిన్న అంశంపై అధికారపక్షంతో విభేదం వస్తే సభలో మిగతా వారిని మాట్లాడనీయకపోవడం ఏంటని నిలదీశారు. ఎస్సీ వర్గీకరణకు మొదటి నుంచీ మద్దతు ఇచ్చామనీ, సుప్రీం కోర్టు అనుకూలంగా ఇవ్వడాన్ని స్వాగతిస్తున్నామని చెప్పారు. ఈ పోరాటంలో కీలకపాత్ర పోషించిన మందకృష్ణ మాదిగకు అభినందనలు తెలిపారు. స్కిల్స్ యూనివర్సిటీని స్వాగతిస్తున్నామనీ, అయితే, అది అందరికీ అందుబాటులో ఉండేలా చూడాలని కోరారు. ఇంజినీరింగ్ విద్యార్థుల్లో చాలా మందిలో నైపుణ్యాలు లేక ఉద్యోగాలు పొందలేకపోతున్నారన్నారు. వాటి మాదిరిగా స్కిల్స్ యూనివర్సిటీ తయారు కాకుండా చూడాలన్నారు.

బీఆర్ఎస్ సభ్యుల తీరుతో మేం అవకాశం కోల్పోతున్నాం : మహేశ్వర్‌రెడ్డి

స్కిల్స్ యూనివర్సిటీకి మద్దతు తెలుపుతున్నట్టు బీజేపీ పక్షనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి చెప్పారు. బీఆర్ఎస్ సభ్యులు కౌశిక్‌రెడ్డితో పాటు మరికొందరు 'బడేబాయ్..చోటే బాయ్..బడే బాయ్ చోటే బాయ్' అంటూ సీఎంను, తనను చూపెట్టడాన్ని తప్పుబట్టారు. బీఆర్ఎస్ సభ్యుల తీరుతో కీలకమైన చర్చల్లో తాము మాట్లాడలేకపోతున్నామని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఫోర్త్ సిటీగా బేగారి కంచ

(మొదటిపేజీ తరువాయి)



అంతర్జాతీయ ఎయిర్‌పోర్టుతో ఈ ప్రాంతంలో భూముల విలువ పెరిగినట్టు చెప్పారు. ఇక భవిష్యత్ అంతా మహేశ్వరం దేనని, ఈ ప్రాంతంలో విద్యా వైద్యంకు సంబంధించిన పరిశ్రమలు నెలకొల్పనున్నట్టు తెలిపారు. ప్రపంచ పర్యాటక కేంద్రంగా ఈ ప్రాంతం మారబోతుందన్నారు. ఈ ప్రాంతంలో దొరకనిదంటూ ఉండే అవకాశం లేకుండా తీర్చిదిద్దుతామని స్పష్టంచేశారు. విమానం ఎక్కాలన్న.. కొనుగోలు చేయాలన్న ఇక్కడి నుంచే జరిగే విధంగా ఈ ప్రాంతం తయారు కాబోతుందన్నారు. ఔటర్ రింగ్ రోడ్డు నుంచి 200 ఫీట్ల రోడ్డు వేయడానికి కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని, దీనికి ప్రజలు సహకరించాలని కోరారు. రీజనల్ రింగ్ రోడ్డు పనులు, రెండు, మూడు నెలల్లో ప్రారంభం కానున్నాయని తెలిపారు. ప్రభుత్వానికి భూములు ఇచ్చి సహకరించిన రైతులకు 662 ఎకరాల్లో 4500 మంది కుటుంబాలకు అద్భుతమైన టౌన్‌షిప్‌ను ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. వారి మౌలిక వసతుల్లో భాగంగా రెండు ఎకరాల్లో కమ్యూనిటీ హాల్, ఎకరంలో ఆస్పత్రి, అడ్వాన్స్ ఎడ్యుకేషన్ ఇన్స్టిట్యూషన్స్ నిర్మాణాలు చేపడుతున్నట్టు చెప్పారు. ఈ ప్రాంతం సింగపూర్, దుబాయి, న్యూయార్క్‌ను మైమరిపించేలా అభివృద్ధి చేస్తామని స్పష్టం చేశారు. మంత్రి మండలి సహకారంతో ప్రజలకు ఇచ్చిన అన్నీ హామీలను అమలు చేస్తామని భరోసానిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఎస్ శాంతి కుమారి, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

కార్మిక, కర్షక పక్షం నిలిచే పత్రిక

(మొదటిపేజీ తరువాయి)

50 ఏండ్లుగా ప్రజలకు మద్దతుగా నిలిచింది. బడుగు, బలహీనవర్గాల కోసం కృషిచేస్తున్నది. పేదలు, మహిళలు, యువత, కార్మికులు, కర్షకులు, విద్యార్థుల పక్షాన అక్షరరూపంలో సేవలు అందిస్తున్నది. గతంలో మాదిరిగానే ఇక ముందు కూడా నవతెలంగాణ విజయవంతంగా నడవాలని ఆకాంక్షిస్తూ మరోసారి అందరికీ వార్షికోత్సవ శుభాకాంక్షలు.

ప్రజల పత్రికను ఇదే స్ఫూర్తితో నడిపించాలి

(మొదటిపేజీ తరువాయి)

పారదర్శకంగా నడుస్తున్న పత్రిక యాజమాన్యం, సిబ్బందికి అభినందనలు. ఈ పత్రికలో రాజకీయాలకు సంబంధించి అవసరం అయినంత వరకే రాస్తారు. ప్రజాసమస్యలను ఎక్కువగా ప్రచురించడం గొప్ప విషయం.ఇదే స్ఫూర్తితో పత్రికను భవిష్యత్తులోనూ నడిపించాలి.

సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నాం

- మాజీ మంత్రి హరీశ్ రావు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన చారిత్రక తీర్పును స్వాగతిస్తున్నట్టు మాజీ మంత్రి హరీశ్ రావు తెలిపారు. గొప్ప తీర్పు ఇచ్చిన న్యాయమూర్తులకు మనస్ఫూర్తిగా ధన్యవాదాలు చెప్పారు. ఈ మేరకు గురువారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఎస్సీ వర్గీకరణ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని తెలంగాణ ఉద్యమం నుంచే బీఆర్ఎస్ పోరాటం చేస్తున్నదని పేర్కొన్నారు. ఉద్యమ నాయకునిగా ఎస్సీ వర్గీకరణ డిమాండ్ చేసిన కేసీఆర్, రాష్ట్రం ఏర్పడిన మొదటి అసెంబ్లీ సమావేశంలోనే ఎస్సీ వర్గీకరణ బిల్లును ఆమోదించి కేంద్రానికి పంపించారని తెలిపారు. దీనిపై 2016 మే 16న ప్రధాని మోదీని కలిసి లేఖ ఇచ్చారని గుర్తుచేశారు. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో ఆ దిశగా వెంటనే చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

వైద్యారోగ్య శాఖ కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

- తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.యాదానాయక్
- వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్ కార్యాలయం ముందు ధర్నా
- అడ్డుకున్న పోలీసులు.. పలువురి అరెస్ట్



నవతెలంగాణ - ధూల్ పేట్

వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.యాదానాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. యూనియన్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో కోఠి వైద్య ఆరోగ్యశాఖ కమిషనరేట్ ముందు గురువారం ధర్నా చేపట్టారు. పోలీసులు అడ్డుకోవడంతో ఆ ప్రాంతంలో కొద్దిసేపు ఉద్రిక్తత ఏర్పడింది. ఉద్యోగులను అరెస్టు చేసి పలు పోలీసుస్టేషన్లకు తరలించారు. ఈ సందర్భంగా యాదానాయక్ మాట్లాడుతూ.. సమస్యలు పరిష్కరించాలని ధర్నా చేస్తున్న ఉద్యోగులను రాష్ట్ర ప్రభుత్వం పోలీసుల చేత అక్రమంగా అరెస్టులు చేయించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. వైద్య ఆరోగ్యశాఖ అన్ని విభాగాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వైద్యారోగ్య రంగంలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యల పట్ల నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తోందన్నారు. కాంట్రాక్టు ఉద్యోగులతో వెట్టి చాకిరీ చేస్తూ కనీస వేతనాలు, చట్టబద్ధ హక్కులు కల్పించడం లేదన్నారు. మహిళా ఉద్యోగులకు వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు ఇవ్వాలని, పని భారం తగ్గించాలని, టార్గెట్స్ అచ్యుమెంట్ పేరిట ఒత్తిడి తగ్గించాలని, బదిలీలకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను అసెంబ్లీలో చర్చించి పరిష్కరించాలన్నారు. లేనియెడల రాబోయే రోజుల్లో పెద్దఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. అవసరమైతే విధులు బహిష్కరించి నిరవధిక సమ్మె చేపడతామని చెప్పారు.

ఈ ధర్నాలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఎండీ ఫసియుద్దీన్, రాష్ట్ర కోశాధికారి ఏ.కవిత, రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ బలరాం, విజయవర్ధన్, రాజు, కిరణ్మయి, నవీన్ కుమార్, సుధాకర్, శ్రీనివాస్, కుమారస్వామి, రాజేశ్వరి, లక్ష్మి, రాధిక, విజయలక్ష్మి, సరోజ, మంజుల, దీన, సుగుణ, నేహా తదితరులు పాల్గొన్నారు.

ఫామ్‌హౌజ్‌ల పేరిట భూముల కేంద్రీకరణ

- మిగులు భూముల సాధన కోసం పోరాటాలు
- కాచం కృష్ణమూర్తికి అర్పించే నివాళి అదే : ఏఐకేఎస్ జాతీయ ఉపాధ్యక్షులు సారంపల్లి మల్లారెడ్డి, వెంకట్రాములు



నవతెలంగాణ బ్యూరో–హైదరాబాద్

ప్రజాప్రతినిధులు ఫామ్‌హౌజ్‌ల పేరిట భూములను కేంద్రీకరించుకుంటున్నారని ఏఐకేఎస్ జాతీయ ఉపాధ్యక్షులు సారంపల్లి మల్లారెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్రాములు విమర్శించారు. ప్రభుత్వ మిగులు భూముల సాధన కోసం పోరాటాలను ఉధృతం చేయడమే కాచం కృష్ణమూర్తికి అర్పించే నిజమైన నివాళి అని చెప్పారు. గురువారం హైదరాబాద్‌లోని రైతు సంఘం కార్యాలయంలో కృష్ణమూర్తి వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..కమ్యూనిస్టుల పోరాట ఫలితంగా ఆనాటి పాలకులు భూసంస్కరణల చట్టాలను అమలు చేస్తే నేడు ప్రజల ఓట్లతో గెలిచిన ప్రజాప్రతినిధులు ఫామ్ హౌజ్‌ల పేరుతో వేలాది ఎకరాలను ఆక్రమిస్తున్నారని విమర్శించారు. రియల్ ఎస్టేట్, అగ్రీ ఫామ్స్ పేరుతో పెద్ద ఎత్తున భూములను సమీకరించి పెట్టుకుంటున్నారనీ, పట్టణ భూసంస్కరణల పరిమితి చట్టాన్ని అమలు చేయకుండా తొక్కిపట్టారని తెలిపారు. అభివృద్ధి, హైవేలు, కరెంటు ఉత్పత్తి కేంద్రాలు, ప్రభుత్వ భవనాల నిర్మాణాల పేరుతో పేదల భూములను బలవంతంగా లాక్కుంటున్నారనీ, దానిని ప్రశ్నించే వారిపై కేసులు బనాయిస్తున్నారని చెప్పారు. ప్రజా ప్రతినిధులు ప్రభుత్వ భూములను, చెరువులను, కుంటలను ఆక్రమించుకుంటే మాట్లాడని అధికారులు నిలువనీడ కోసం 60 గజాల స్థలంలో గుడిసెలు వేసుకున్న పేదలపై అక్రమ కేసులు పెట్టడమేంటి? జైలుకు పంపడమేంటి? అని ప్రశ్నించారు. తక్షణమే నిర్బంధం ఆపాలనీ, పెట్టిన కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. గుడిసెలు వేసుకున్న చోటనే హక్కు పట్టా ఇచ్చి ఇంటి నిర్మాణానికి 10 లక్షల రూపాయలు మంజూరు చేయాలని కోరారు. పోడు సాగదారులందరికీ హక్కు పట్టాలు ఇవ్వాలని విన్నవించారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మాజీ ప్రొఫెసర్ అరిబండి ప్రసాద్ రావు, రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి శోభన్ నాయక్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ఆర్.ఆంజనేయులు, రాహుల్ పాల్గొన్నారు.

పారదర్శకంగా బదిలీలు

- ప్రభుత్వానికి ధన్యవాదాలు : తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వైద్యారోగ్యశాఖలో ప్రభుత్వ వైద్యుల బదిలీల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించిన రాష్ట్ర ప్రభుత్వానికి తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం ధన్యవాదాలు తెలిపింది. ఈ మేరకు ఆ సంఘం నాయకులు లాలూ ప్రసాద్ రాథోడ్ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. బదిలీలకు 40 శాతం అవకాశమివ్వడం అసాధారణ నిర్ణయమని కొనిడాయారు. ప్రభుత్వం తీసుకునే మంచి నిర్ణయాలకు సంఘం మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. ప్రభుత్వ వైద్యుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డికి, వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు, ఉన్నతాధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

సత్తాచాటిన స్వప్నిల్

- పొజిషన్-3 షూటింగ్‌లో కాంస్యం
- పారిస్ ఒలింపిక్స్‌లో భారత్‌కు మూడో పతకం



పారిస్: 2024 పారిస్ ఒలింపిక్స్‌లో భారత షూటర్లు మరో పతకాన్ని చేజిక్కించుకున్నారు. ఈ ఒలింపిక్స్‌లో అత్యుత్తమ ప్రదర్శన కనబరుస్తున్న షూటర్లు.. మూడో కాంస్య పతకాన్ని చేజిక్కించుకున్నారు. మను భాకర్ 'డబుల్ మెడల్' ఇచ్చిన స్ఫూర్తితో గురువారం జరిగిన పురుషుల పొజిషన్ 3 షూటింగ్‌లో యువ షూటర్ స్వప్నిల్ కాంస్య పతకంతో మెరిసాడు. మూడు పొజిషన్ల షూటింగ్ అంటే.. బోర్లా పడుకొని(ప్రోన్), మోకాళ్ల మీద(నీలింగ్), నిల్చొని(స్టాండింగ్) షూటింగ్ చేయాల్సి ఉంటుంది. స్వప్నిల్ మోకాళ్లపై షూటింగ్‌లో 153.5 పాయింట్లు, ప్రోన్ విభాగంలో 156.8 పాయింట్లు, స్టాండింగ్‌లో 141.1 పాయింట్లను (స్టేజ్ 2 ఎలిమినేషన్‌తో సహా) మొత్తం 451.4 పాయింట్లు సాధించాడు. దీంతో స్వప్నిల్ కుశల్ మూడో స్థానంలో నిలిచాడు. తొలుత నెమ్మదిగా ప్రారంభించిన స్వప్నిల్.. కీలక సమయంలో అద్భుతంగా పుంజుకొన్నాడు. ఒక దశలో నాలుగు, ఐదు స్థానాలకే పరిమితమైన స్వప్నిల్... క్రమంగా టాప్-3లోకి ఎగబాకాడు. ఆ తర్వాత ఏ మాత్రం వెనక్కి తిరిగిచూడలేదు. చివరికి 451.4 పాయింట్లను సాధించి కాంస్యం చేజిక్కించుకున్నాడు. చైనాకు చెందిన లి యుకున్(463.6) స్వర్ణం, ఉక్రెయిన్ షూటర్ కులిష్ సెర్హియ్(461.3) రజత పతకాలు కైవసం చేసుకున్నారు. బుధవారం జరిగిన క్వాలిఫికేషన్ రౌండ్‌లో 590 పాయింట్లు సాధించిన స్వప్నిల్.. ఏడో స్థానంలో నిలిచి ఫైనల్‌కు అర్హత సాధించిన సంగతి తెలిసిందే. క్వాలిఫికేషన్ రౌండ్‌లో ఎక్కువ సంఖ్యలో పది పాయింట్లు కొట్టడంతో స్వప్నిల్‌కు ఫైనల్ బెర్త్ దక్కింది. దీంతో పారిస్ ఒలింపిక్స్‌లో భారత్‌కు దక్కిన పతకాల సంఖ్య మూడుకు చేరింది.

నిఖత్ జరీన్ ఔట్

భారత్‌కు పతకాలు దక్కే ఈవెంట్‌లలో బాక్సింగ్ ఒకటి. గురువారం జరిగిన మహిళల 50 కిలోల బాక్సింగ్ విభాగంలో నిఖత్ జరీన్.. ఆసియా స్వర్ణ పతక విజేత, చైనాకు చెందిన వూ యూ చేతిలో ఓటమిపాలైంది. ప్రి క్వార్టర్స్‌లో 5-0 తేడాతో నిఖత్ బాక్సింగ్ బౌట్‌ను కోల్పోయింది. పారిస్ ఒలింపిక్స్‌లో అన్‌సీడెడ్‌గా నిఖత్ బరిలోకి దిగింది. ఈ బౌట్‌లో నిఖత్ పంచ్‌లను ఆశించిన స్థాయిలో కొట్టలేకపోయింది. ఇక 52 కిలోల ఫ్లయ్‌వెయిట్‌లోనూ ప్రపంచ చాంపియన్ అయిన చైనా క్రీడాకారిణి.. బౌట్ మొత్తం ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. మెగా గేమ్స్‌లో మెడల్ సాధిస్తుందని అనుకున్నా.. నిఖత్‌కు రెండో రౌండ్‌లోనే బలమైన ప్రత్యర్థిని ఎదుర్కోవాల్సి వచ్చింది. తొలి రౌండ్‌లో జర్మనీ బాక్సర్ మాక్సీ కరీనా కోయిజర్‌పై నిఖత్ గెలుపొంది రెండోరౌండ్‌కు చేరింది.

హాకీలో వరుస విజయాలకు బ్రేక్..

పారిస్ ఒలింపిక్స్ భారత హాకీ జట్టు వరుస విజయాలకు బ్రేక్ పడింది. గురువారం జరిగిన గ్రూప్-బి లీగ్ పోటీలో డిఫెండింగ్ ఛాంపియన్ బెల్జియం చేతిలో భారత్ 2-1 తేడాతో ఓటమిపాలైంది. ఆరంభంలో భారతజట్టు ఆధిక్యంలో ఉన్నా.. టోక్యో స్వర్ణ పతక విజేత బెల్జియం అద్భుతమైన ఆట తీరును ప్రదర్శించింది. భారత్ తరపున అభిషేక్ ఒక్కడే ఇక గోల్ చేశాడు. బెల్జియం తరపున స్టాక్‌బ్రోక్స్(33వ ని.), జాన్ డోమన్(44వ ని.)లో ఒక్కో గోల్ కొట్టారు. తొలి రెండు క్వార్టర్లలో భారత్ దూకుడు ప్రదర్శించినా.. కీలకమైన చివరి రెండు క్వార్టర్స్‌లో బెల్జియం ఆటగాళ్లు జోరు పెంచారు. రాజ్ కుమార్ పాల్‌కు ఎల్లో కార్డు ఇవ్వడం వల్ల.. చివరి నిమిషాల్లో ఒక ఆటగాడు లేకుండానే భారత్ ఆడాల్సి వచ్చింది. ఈ ఓటమితో భారత్ 4 మ్యాచ్‌లు ముగిసేసరికి 7పాయింట్లతో మూడోస్థానంలో నిలిచింది. నేడు జరిగే చివరి లీగ్ మ్యాచ్‌లో భారతజట్టు ఆస్ట్రేలియాతో తలపడనుంది.

లక్ష్యసేన్ ముందుకు...

బ్యాడ్మింటన్ విభాగంలో భారత్‌కు మిశ్రమ ఫలితాలు దక్కాయి. పురుషుల సింగిల్స్‌లో లక్ష్యసేన్ క్వార్టర్స్‌కు చేరగా.. పురుషుల డబుల్స్ స్టార్ ప్లేయర్స్ చిరాగ్-సాత్విక్ జంట అనూహ్యంగా క్వార్టర్స్‌లో ఓటమిపాలైంది. గురువారం జరిగిన ప్రి క్వార్టర్‌ఫైనల్లో లక్ష్యసేన్ 21-12, 21-6తో భారత్‌కే చెందిన హెచ్ఎస్ ప్రణయ్‌పై వరుససెట్లలో గెలిచాడు. ఇక పురుషుల డబుల్స్‌లో సాత్విక్-చిరాగ్ జోడీకి షాక్ తగిలింది. క్వార్టర్‌ఫైనల్లో వీరు 21-13, 14-21, 16-21తో మలేషియా జంట చేతిలో పోరాడి ఓడారు.


పతకాల సాధనలో చైనా అగ్రస్థానం

పారిస్ ఒలింపిక్స్‌లో పతకాల సాధనలో కమ్యూనిస్టు చైనా తన ఆధిపత్యాన్ని చెలాయిస్తోంది. 2024 పారిస్ ఒలింపిక్స్ ప్రారంభమై నేటికి 6రోజులు కావొస్తున్నా.. ప్రతి రోజూ పతకాల పట్టికలో చైనా అగ్రస్థానంలోనే నిలుస్తోంది. మరోవైపు టోక్యో ఒలింపిక్స్‌లో అమెరికాకు ధీటైన పోటీనిచ్చినా.. ఈ ఒలింపిక్స్‌లో అమెరికా నేటికీ 5వ స్థానంలోనే కొనసాగుతోంది. గురువారం రాత్రి పోటీలు ముగిసే సమయానికి చైనా 11స్వర్ణ, 7రజత, 3కాంస్యాలతో సహా మొత్తం 21 పతకాలతో అగ్రస్థానంలో ఉండగా.. అమెరికా 6స్వర్ణ, 13రజత, 12కాంస్యాలతో సహా 31 పతకాలతో 5వ స్థానంలో కొనసాగుతోంది. టేబుల్ టెన్నిస్, బ్యాడ్మింటన్ విభాగాల్లో చైనాకు మరికొన్ని పతకాలు దక్కే ఛాన్స్ ఉంది. ఈ క్రమంలో చైనా పారిస్ ఒలింపిక్స్‌లో అగ్రస్థానంలో నిలిచే ఛాన్స్ ఉంది.

ఆటలు

నేడు శ్రీలంకతో తొలి వన్డే

- మ.2.30గం॥ల నుంచి



కొలంబో: టి20 సిరీస్ నెగ్గిన ఉత్సాహంలో ఉన్న టీమిండియా.. ఇక శ్రీలంకతో వన్డే సిరీస్‌కు సిద్ధమైంది. సూర్యకుమార్ యాదవ్ సారథ్యంలోని భారతజట్టు టి20 సిరీస్‌ను 3-0తో క్లీన్‌స్వీప్ చేయగా.. వన్డే సిరీస్‌కు టి20 ప్రపంచకప్ సాధించిన రోహిత్ శర్మ అందుబాటులోకి వచ్చాడు. అలాగే విరాట్ కోహ్లి కూడా జట్టుతో కలవడంతో భారత బ్యాటింగ్ ఆర్డర్ మరింత పటిష్టంగా మారింది. మరోవైపు శ్రీలంక టి20 సిరీస్‌ను కోల్పోయినా.. స్వదేశంలో కనీసం వన్డే సిరీస్‌ను అయినా నెగ్గాలనే దృఢ సంకల్పంతో బరిలోకి దిగుతోంది. విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ ప్రాక్టీస్ లేకుండానే బరిలోకి దిగుతున్నారు.

జట్లు....

ఇండియా: రోహిత్(కెప్టెన్), శుభ్‌మన్, కోహ్లి, కెఎల్ రాహుల్, పంత్(వికెట్ కీపర్), దూబే, అక్షర్, కుల్దీప్, సిరాజ్, అర్ష్‌దీప్, ఖలీల్ అహ్మద్, సుందర్, రియాన్ పరాగ్, హర్షిత్ రాణా.

శ్రీలంక: అసలంక(కెప్టెన్), నిస్సంక, ఫెర్నాండో, కుశాల్ మెండీస్(వికెట్ కీపర్), సమరవిక్రమ, లైనగే, వెల్లలిగే, హసరంగ, తీక్షణ, అసితా ఫెర్నాండో, షిరాజ్, కరుణరత్నే, ధనుంజయ, కమిందు మెండీస్, మధుశంక, మలింగ.

మైక్ ఇస్తే శాపనార్థాలు ఇవ్వకపోతే నిరసనలు

అక్కలూ మీ క్షేమం కోరే చెబుతున్నా
వారి ఉచ్చులో పడొద్దు



- ప్రతిపక్ష నేత సభకు రారు.. వచ్చినోళ్లు వాకౌట్ చేసిపోతారు
- స్కిల్స్ యూనివర్సిటీపై, రుణమాఫీపై చర్చ జరగనివ్వలేదు : సీఎం రేవంత్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మైక్ ఇస్తే శాపనార్థాలు.. ఇవ్వకపోతే నిరసనలు ఇదేం పద్ధతి అని బీఆర్ఎస్ సభ్యులపై సీఎం రేవంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్కలూ.. క్షేమం కోరి చెబుతున్నా వారి ఉచ్చులో పడొద్దని హితవుపలికారు. గురువారం అసెంబ్లీలో ఆయన 'యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ బిల్లు'పై మాట్లాడారు. ఆనాడు నెహ్రూ పంచవర్ష ప్రణాళికలు తీసుకొచ్చి వ్యవసాయం, విద్య, పారిశ్రామిక రంగాలకు ప్రాధాన్యం ఇచ్చారని తెలిపారు. రెసిడెన్షియల్ స్కూల్స్ అందుబాటులోకి తెచ్చారన్నారు. ఇందిరాగాంధీ చదువుకునే విద్యార్థులకు స్కాలర్ షిప్స్ ఇచ్చి ప్రోత్సహించారని గుర్తుచేశారు. రాజీవ్ గాంధీ దేశానికి సాంకేతికను అందుబాటులోకి తీసుకొచ్చారని చెప్పారు. హైదరాబాద్‌లో ఐటీ రంగ అభివృద్ధికి రాజీవ్‌గాంధీ పునాదులు వేసిన విషయాన్ని గుర్తుచేశారు. ప్రపంచంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా మన విధానాల్లో మార్పులు రావాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పారు. ప్రపంచంలో నైపుణ్యం ఉన్నవారి కొరత ఉందన్నారు. వృత్తి నైపుణ్యాలు లేకపోవడం వల్లనే దేశంలో నిరుద్యోగం పెరుగుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. అందరికీ అన్ని రకాల నైపుణ్యాలను అందించేందుకే స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేయబోతున్నామని తెలిపారు. భూమి పూజకు సభ్యులు రావాలని కోరారు. యంగ్ ఇండియాను పత్రిక మహాత్మాగాంధీ మొదలు పెట్టారనీ, ఆయన స్ఫూర్తితో వర్సిటీని ఏర్పాటు చేసుకోబోతున్నామని తెలిపారు. లక్షలాదిమంది యువతకు ఉపాధి కల్పించడమే స్కిల్స్ యూనివర్సిటీ ఉద్దేశమని చెప్పారు. స్కిల్స్ యూనివర్సిటీపై ప్రధాన ప్రతిపక్ష నాయకులు సూచనలు ఇస్తే సంతోషించేవాళ్ళమన్నారు. ఆయన సభకు రారు, వచ్చినవారు వాకౌట్ చేసి వెళ్లిపోయారని విమర్శించారు. స్కిల్స్ యూనివర్సిటీలో 17 కోర్సులను యూనివర్సిటీలో ప్రవేశపెట్టబోతున్నామనీ, శిక్షణ పూర్తిచేసుకున్న వారికి సర్టిఫికెట్లు అందజేస్తామని తెలిపారు. ఏడాదికి రూ.50వేల నామ మాత్రపు ఫీజుతో కోర్సుల శిక్షణ అందించబోతున్నామన్నారు. అవసరమైతే ఎస్సీ,ఎస్టీ,ఓబీసీ పిల్లలకు ఫీజు రీయింబర్స్ మెంట్ ద్వారా ఉచితంగా అందిస్తామని భరోసానిచ్చారు. వర్సిటీ భూమిపూజకు సభ్యులు రావాలని కోరారు. తొలి ఏడాది ఆరు కోర్సుల ద్వారా రెండు వేల మంది శిక్షణ ఇస్తామని తెలిపారు. శిక్షణ ఇచ్చి ఉద్యోగాలు ఇచ్చేందుకు కొన్ని సంస్థలు ముందుకు వచ్చాయన్నారు. భవిష్యత్‌లో జిల్లాల్లోనూ అలాంటి కళాశాలలు ఏర్పాటు చేసి శిక్షణ ఇచ్చే ఆలోచనలో ఉన్నామని చెప్పారు. బీఆర్ఎస్ నేతలకు రాజకీయ ప్రయోజనం తప్ప ప్రజల ప్రయోజనాలు పట్టడం లేదని విమర్శించారు. రైతు రుణమాఫీపైనా, స్కిల్స్ యూనివర్సిటీపై చర్చ జరగకూడదని బీఆరెస్ నేతలు ఆడబిడ్డలను అడ్డం పెట్టుకుని రాజకీయం చేస్తున్నారని ఆరోపించారు. ఇద్దరు అక్కలను తాను సొంత అక్కలుగానే భావిస్తున్నానన్నారు. సీతక్కపై సోషల్ మీడియాలో అవమానించేలా మీమ్స్ పెడుతున్నారనీ, బీఆర్ఎస్ వాళ్లు ఆదివాసీ ఆడబిడ్డను అవమానించినట్లు కాదా? అని ప్రశ్నించారు. సొంత చెల్లెల్ని జైల్లో పెట్టినా ఢిల్లీ వెళ్లి రాజకీయ ఒప్పందం చేసుకున్న నీచులు వాళ్లు అని విమర్శించారు. దొర పన్నిన కుట్రలో అక్కలు బందీలయ్యారనీ, వారి క్షేమం కోరి చెబుతున్నా ఆయన ఉచ్చులో నుంచి బయటపడాలని సూచించారు. కావాలనే కేసీఆర్ సభకు రావడంలేదన్నారు. కేసీఆర్, హరీశ్‌రావులకు రాజకీయ జీవితం ఇచ్చిందే కాంగ్రెస్ అని తెలిపారు. ఎస్సీ వర్గీకరణ పై సుప్రీంకోర్టులో ఉద్దండులైన న్యాయవాదులతో వాదించి విజయం సాధించామన్నారు. దళితబిడ్డలు సంతోషపడే వేళ ప్రధాన ప్రతిపక్షం సభను వాకౌట్ చేసి పోవడం సరిగాదన్నారు.

ప్రభుత్వ భూముల్లో

గుడిసెలేసుకున్న పేదలకు పట్టాలివ్వండి

భూ పోరాటంలో పెట్టిన కేసులను ఎత్తేయండి :
ఎమ్మెల్సీ నర్సిరెడ్డి డిమాండ్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రభుత్వ భూముల్లో గుడిసెలేసుకున్న పేదలకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పట్టాలివ్వాలని ఎమ్మెల్సీ నర్సిరెడ్డి డిమాండ్ చేశారు. గురువారం శాసన మండలిలో పిటిషన్ల సమయంలో ఈ అంశాన్ని ప్రస్తావించారు. నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రి, వరంగల్, హన్మకొండ, మహబూబా బాద్‌తో పాటు రాష్ట్ర వ్యాప్తంగా 20 జిల్లాల్లో ఇండ్లు లేని పేదలు ప్రభుత్వ స్థలాల్లో గుడిసెలేసుకున్నారని పేర్కొన్నారు. ఇందిరమ్మ పథకంలో భాగంగా ఇండ్లు లేని పేదలకు ఇంటి స్థలంతో పాటు రూ.5 లక్షలు ఇస్తామని కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ ప్రాంతాలను వెంటనే సర్వే చేసి మ్యానిఫెస్టోకు అనుగుణంగా ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని కోరారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో గుడిసెలేసుకున్న వారిపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తేయాని పిటిషన్ సమర్పించారు.

ఈ కుబేర్ బిల్లులపై వాస్తవాలు చెప్పండి

ఆన్‌లైన్లో ప్రభుత్వ ఉద్యోగులకు ఈ కుబేర్ ద్వారా చెల్లిస్తున్న బిల్లులు సక్రమంగా జరగడం లేదని వస్తున్న వార్తలపై సర్కార్ వివరణ ఇవ్వాలని ఎమ్మెల్సీ నర్సిరెడ్డి విజ్ఞప్తి చేశారు. మండలిలో ప్రత్యేక ప్రస్తావన సమయంలో ఈ అంశాన్ని లేవనెత్తారు. 2023 జనవరి నుంచి మార్చి వరకు, 2024 జనవరి నుంచి మార్చి వరకు రాష్ట్రంలో జరిగిన ఈ కుబేర్ చెల్లింపుల సమాచారాన్ని బహిర్గత పర్చాలని కోరారు. కొంత కాలంగా ఈ అంశంపై ఉద్యోగ వర్గాల్లో ఉన్న సందేహాలను నివృత్తి చేయాలని సూచించారు. ఉద్యోగుల రిటైర్మెంట్ వయస్సు మూడేండ్లు పెంచినప్పటికీ, 2021 నుంచి 2024 వరకు వాలంటరీ తీసుకున్న వారికి బెనిఫిట్స్ ఆలస్యమయ్యాయని పేర్కొన్నారు. ఇటీవల రిటైర్మెంట్ తీసుకున్న వారికి గతంలో లాగా ఆలస్యం కాకుండా సత్వరమే చెల్లించాలని కోరారు.

రేవంత్ వ్యాఖ్యలపై బీఆర్ఎస్ నిరసన

అసెంబ్లీ ఆవరణలో సీఎం చాంబర్ వద్ద ధర్నా...అరెస్టు



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలనుద్దేశించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలకు నిరసనగా ఆ పార్టీ రెండో రోజు ఆందోళన కొనసాగించింది. గురువారం అసెంబ్లీ ఆవరణలోని సీఎం చాంబర్ ముందు ఎమ్మెల్యేలు నల్ల బ్యాడ్జీలతో ధర్నా నిర్వహించారు. సీఎంకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. సీఎం డౌన్,డౌన్ అంటూ నినాదాలు చేశారు. మహిళలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు, అసెంబ్లీ మార్షల్స్‌కు వాగ్వాదం చోటుచేసుకుంది. అనంతరం పోలీసులు వాహనంలో అసెంబ్లీ నుంచి తరలించారు. అంతకు ముందు నల్ల బ్యాడ్జీలతో అసెంబ్లీలో వెల్‌లో బైఠాయించారు. మర్షల్ వారిని అసెంబ్లీ ఆవరణంలోకి తీసుకొచ్చారు.ఆ తర్వాత సీఎం చాంబర్ ముందుకు ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ శాసనసభలో అధికార పక్షం తమ గొంతు నొక్కుతున్నదని విమర్శించారు. తాము ఎన్నిసార్లు కోరినా స్పీకర్ మైక్ ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ఉద్యమంలో కూడా ఇన్ని ఆంక్షలు లేవనీ, తెలంగాణ ఉద్యమంలో లేని ఆంక్షలు శాసనసభలో చూడడం దురదృష్టకరమన్నారు. ఇవాళ ప్రజాస్వామ్యం ఖూనీ అయిపోయిందని చెప్పారు. ముమ్మాటికీ ఈ ముఖ్యమంత్రి తెలంగాణ ఆడబిడ్డలకు క్షమాపణలు చెప్పాల్సిందేననీ, అప్పటివరకు విడిచిపెట్టేది లేదని కేటీఆర్ స్పష్టం చేశారు. మరోవైపు శాసనసభలో మూడుగంటలుగా నిల్చొని ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, కోవలక్ష్మి, సునీతా లక్ష్మారెడ్డి నిరసన తెలిపారు. సీఎం క్షమాపణలు చెప్పే వరకు నిరసన కొనసాగిస్తామని బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యే స్పష్టం చేశారు. నిరసన కార్యక్రమంలో బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షులు కేటీఆర్, మాజీ మంత్రులు హరీశ్‌రావు, ప్రశాంత్‌రెడ్డి, జగదీశ్‌రెడ్డి, గంగుల కమలాకర్, పద్మారావు గౌడ్‌తో పాటు ఎమ్మెల్యేలు పాడి కౌశిక్‌రెడ్డి, అనిల్ జాదవ్, పల్లా రాజేశ్వర్‌రెడ్డితో పాటు పలువురు సభ్యులను అరెస్టు చేశారు.

పేదలు, కష్టాలు ఉన్నంత వరకు కమ్యూనిజం ఉంటుంది

పట్టుదల, క్రమశిక్షణ, ధైర్యానికి వెంకట్రావమ్మ ఆదర్శం : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం



నవతెలంగాణ-బోనకల్

కష్టాలు, పేదలు, పెట్టుబడిదారీ వ్యవస్థ ఉన్నంతవరకూ కమ్యూనిజం ఉంటుందని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. పట్టుదల, క్రమశిక్షణ, చైతన్యానికి వెంకట్రావమ్మ ఆదర్శమని కొనియాడారు. ఖమ్మం జిల్లా బోనకల్ మండలం ఆళ్లపాడు గ్రామంలో సీపీఐ(ఎం) నాయకులు పారా వెంకట్రావమ్మ సంస్మరణ సభ పార్టీ శాఖ కార్యదర్శి బండి నాగేశ్వరరావు అధ్యక్షతన గురువారం జరిగింది. తొలుత వెంకట్రావమ్మ చిత్రపటానికి తమ్మినేని వీరభద్రం, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పారా నారాయణరావు, పారా లక్ష్మీనారాయణ కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలిపారు. అనంతరం జరిగిన సంస్మరణ సభలో తమ్మినేని మాట్లాడుతూ.. కమ్యూనిస్టు ఉద్యమం సాదాసీదాగా సాగేది కాదని, కష్టాలు, కన్నీళ్లతో ఉద్యమాలు సాగుతాయని తెలిపారు. పార్టీని అడ్డం పెట్టుకొని పదవులు, డబ్బులు సంపాదించడం కుదరదని అన్నారు. వెంకట్రావమ్మ భర్త అమరజీవి వెంకటేశ్వరరావు గ్రామంలో ఆనాడు హత్యకు గురైనా వెనకడుగు వేయకుండా తన కుమారులైన నారాయణరావు, లక్ష్మీనారాయణను పార్టీ నీడలోనే తీర్చిదిద్దటం ఆమెకే సొంతమన్నారు. గ్రామంలో పార్టీని అభివృద్ధి చేయడానికి ఆటంకాలు, కష్టాలు, బాధలు ఎదురైనప్పుడు చాలామంది వెనుకడుగు వేస్తారని, ఆమె మాత్రం వాటన్నింటినీ తట్టుకుంటూ ముందుకే అడుగులు వేశారని గుర్తుచేశారు. తన ఇంటిని సీపీఐ(ఎం) కార్యాలయంగా మార్చి ఎంతోమంది పేదల సమస్యలు పరిష్కారంలో విశేషమైన కృషి చేశారని కొనియాడారు. ప్రతి ఉద్యమంలో మహిళలు కీలకపాత్ర నిర్వహించినప్పుడే ఆ ఉద్యమం విజయవంతం అవుతుందన్నారు. ఆ విధంగా వెంకట్రావమ్మ ప్రజా ఉద్యమాలను, ప్రజా సమస్యలను పరిష్కరించడంలో ఆమె పట్టుదల, క్రమశిక్షణ మనందరికీ ఆదర్శమని అన్నారు. ప్రతి కమ్యూనిస్టు ఆమెను స్ఫూర్తిగా తీసుకొని ఉద్యమం బలోపేతం కోసం కృషి చేసినప్పుడే మనం ఆమెకు ఇచ్చే నిజమైన నివాళి అని తెలిపారు.

సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వర రావు, రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వర రావు మాట్లాడుతూ.. కష్టాలు, కన్నీళ్లు, ఆటంకాలు ఎదురైనప్పుడు ఎలా ముందుకు సాగాలో వెంకట్రావమ్మ ఆచరణలో అమలు చేసి నిరూపించారని, ఆమెను మనమందరం ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలన్నారు. వెంకట్రావమ్మ ఆదర్శం, పట్టుదల, ధైర్యం, క్రమశిక్షణ కలిగిన మంచి నాయకురాలని తెలిపారు. ఈ సభలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు చింతలచెరువు కోటేశ్వరరావు, డీసీసీబీ మాజీ ఉపాధ్యక్షులు ఉమ్మనేని కోటయ్య, మండల కార్యదర్శి దొండపాటి నాగేశ్వరరావు, సీపీఐ మండల కార్యదర్శి ఎంగల ఆనందరావు నివాళి అర్పించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) మధిర రూరల్ కార్యదర్శి మంద సైదులు, మధిర పట్టణ మాజీ కార్యదర్శి పాపినేని రామ నరసయ్య, విశ్రాంత లెక్చరర్ కిలారు కృష్ణయ్య, మాజీ సర్పంచ్ మర్రి తిరుపతిరావు, సీపీఐ(ఎం) మండల కమిటీ సభ్యులు కిలారు సురేష్, మోటమర్రి సొసైటీ అధ్యక్షులు బోజడ్ల పుల్లారావు, గుగులోతు పంతు పాల్గొన్నారు.

వాయనాడ్ బాధితులకు అండగా ఉందాం

- నేటి నుంచి విరాళాల సేకరణ : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వాయనాడ్‌లో భారీ వర్షాలు, ఆకస్మిక వరదలతో కొండచరియలు విరిగిపడి దాదాపు 300 మంది ప్రాణాలు కోల్పోయారనీ, వందలాదిమంది గాయపడ్డారని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ తెలిపింది. భారీ ఆస్తి నష్టం జరిగిందని పేర్కొంది. కేరళలోని ఎల్డీఎఫ్ ప్రభుత్వం ముమ్మరంగా సహాయక చర్యలను చేపడుతున్నదని వివరించింది. బాధితులకు పునరావాసం కల్పించేందుకు తన శాయశక్తులా కృషి చేస్తోందని తెలిపింది. ఈ కష్ట సమయంలో వాయనాడ్ ప్రజలు, బాధితులకు అండగా ఉండాలనీ, వారిని ఆదుకోవడానికి ఉదారంగా విరాళాలు అందించాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో పార్టీ శ్రేణులు శుక్రవారం నుంచి ఈనెల నాలుగో తేదీ వరకు మూడు రోజులపాటు విస్తృతంగా కదిలి విరాళాలు సేకరించి రాష్ట్ర కేంద్రానికి పంపాలని కోరారు. ఇక్కడి నుంచి తాము అఖిల భారత కేంద్రానికి పంపుతామని పేర్కొన్నారు. నేరుగా అఖిల భారత కేంద్రానికి పంపాలనుకునేవారు, పార్టీ కేంద్ర కార్యాలయం 'వాయనాడ్ ప్రత్యేక నిధి' విరాళాల కోసం ఏర్పాటు చేసిన ఈ క్రింది అకౌంట్‌కు పంపాలని సూచించారు. రూ.20 వేలకుపైగా విరాళాలు అందించే దాతలు వారి పేరు, చిరునామా, పాన్ నెంబర్ వివరాలను కింద పేర్కొన్న మెయిల్‌కు పంపాలని విజ్ఞప్తి చేశారు. విరాళాలు పంపేవారు 'వాయనాడ్ రిలీఫ్ ఫండ్ కోసం (ఫర్ వాయనాడ్ రిలీఫ్ ఫండ్)' అని పేర్కొనాలని సూచించారు. ఆ వివరాలను పార్టీ ఇ మెయిల్ ఐడీ cc@cpim.orgకి పంపాలని కోరారు.

విరాళాలు పంపే వివరాలు

అకౌంట్ పేరు	: కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా (మార్క్సిస్టు)
అకౌంట్ నెంబర్	: 07621000432853
ఐఎఫ్ఎస్‌సీ కోడ్	: పీఎస్ఐబీ 0000762
బ్రాంచ్‌పేరు	: పంజాబ్, సింద్ బ్యాంక్
బ్రాంచ్ పేరు	: భాయి వీర్‌సింగ్ సాహిత్య సదన్, న్యూఢిల్లీ

స్వచ్ఛదనం పచ్చదనానికి ఏర్పాట్లు

- అధికారులకు సీఎస్ ఆదేశం





నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

స్వచ్ఛదనం- పచ్చదనానికి పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అధికారులను ఆదేశించారు. గురువారం హైదరాబాద్‌లోని సచివాలయం నుంచి ఆమె అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సీఎం ఆదేశాల మేరకు ఈ నెల 5 నుంచి 9వ తేదీ వరకు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఐదు రోజులు నిర్వహించే ఈ కార్యక్రమంలో రోజుకో ప్రత్యేకత ఉండేలా ప్రణాళిక రూపొందించి వాటి వివరాలను ఇప్పటికే కలెక్టర్లకు పంపించినట్టు గుర్తుచేశారు. ఈ కార్యక్రమాన్ని ప్రజలలోకి తీసుకెళ్లేందుకు ఈ నెల 5న ప్రజల భాగస్వామ్యంతో ర్యాలీలు నిర్వహించడం, విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించడం వంటి ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ప్రతి గ్రామంలో చురుకుగా ఉన్న యువజనల సంఘాలు, స్వచ్ఛంద సేవా సంస్థలు, రాజకీయ నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొనేలా చర్యలతో పాటు కార్యక్రమాన్ని పర్యవేక్షించేందుకు ప్రత్యేక టీంలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

వికలాంగులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన అధికారిపై చర్యలు తీసుకోవాలి

ప్రభుత్వానికి ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి విజ్ఞప్తి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వికలాంగులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతోద్యోగిపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గురువారం శాసన మండలిలో ప్రత్యేక ప్రస్తావన సమయంలో ఈ అంశాన్ని లేవనెత్తారు. ప్రివెన్షన్ ఆఫ్ డిసెబుల్ యాక్ట్ ప్రకారం సదరు అధికారిపై చర్య తీసుకోవాలని సూచించారు, అలాగే పలువురు ఎమ్మెల్సీలు వివిధ సమస్యలను ప్రత్యేక ప్రస్తావన, పిటీషన్ల సమయంలో ప్రస్తావించారు. జీహెచ్ఎంసీ పరిధిలో ఇష్టా రాజ్యంగా నిర్మిస్తున్న అక్రమ కట్టడాలపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఎంఎస్.ప్రభాకర్ డిమాండ్ చేశారు. హైదరాబాద్ నగరంలో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన బస్తీ దవాఖానాల్లో మౌళిక సదుపాయాలు కల్పించాలని మహమూద్ అలీ కోరగా, అంగన్‌వాడీలు, ఆశా వర్కర్లు, పారిశుద్య కార్మికులకు జీతాలు సకాలంలో చెల్లించాలని వాణీదేవి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో చికెన్‌గున్యా డెంగ్యూ తదితర వ్యాధులను అరికట్టేందుకు చర్యలు చేపట్టాలని భానుప్రసాద్‌రావు ప్రస్తావించగా, ఎంపీటీసీ, సర్పంచ్‌లకు చెల్లించాల్సిన గౌరవ వేతనాన్ని వెంటనే విడుదల చేయాలని ఎగ్గే మల్లేశం డిమాండ్ చేశారు. మహబూబాబాద్ జిల్లాలో కొత్తగా ఏర్పాటు చేసిన మెడికల్ కాలేజీలో మౌళిక సౌకర్యాలు లేవని మెడికల్ కౌన్సిల్ రూ.15 లక్షల పెనాల్టీ వేసిందని రవిందర్‌రావు ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే కళాశాలలో సౌకర్యాల కల్పనకు నిధుల కేటాయించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఉన్నత విద్యా సంస్థల్లో బోధనా సిబ్బందిని నియమించాలని బీజేపీ ఎమ్మెల్సీ ఎవిఎన్ రెడ్డి కోరగా, హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ పోలీసులు విధులు మర్చి సామాన్యులపై తమ ప్రతాపం చూపిస్తున్నారని ఎంఐఎం ఎమ్మెల్సీ మీర్జా ఆవేదన వ్యక్తం చేశారు. చదువు, ఉద్యోగాల వేటలో విదేశాల్లో మృత్యువాత పడుతున్న ఎన్ఆర్ఐలకు నష్ట పరిహారం అందించాలని తాతా మధు డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం గిరిజనుల పెంచిన రిజర్వేషన్లు అమలు చేయాలని సత్యవతి రాథోడ్ డిమాండ్ చేశారు. గ్రామాల్లో చిన్న చిన్న భూ తగాదాలను పరిష్కరించేందుకు గ్రామ స్థాయి కమీటీలను ఏర్పాటు చేయాలని గోరటి వెంకన్న కోరారు. మోడల్ స్కూళ్లలో పని చేస్తున్న సిబ్బందికి బదిలీలు, ప్రమోషన్లు కల్పించాలని రఘోత్తమ్‌రెడ్డి ప్రస్తావించగా, క్యాబ్, ఆటో డ్రైవర్ల మీటర్ చార్జీలు పెంచాలని తీన్మార్ మల్లన్న కోరారు. కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు గల్ఫ్ కార్మికుల కోసం ప్రత్యేక బోర్డ్ ఏర్పాటు చేయాలని ఎల్.రమణ కోరగా, 2008 డీఎస్సీ, 46 జీవో, గురకులాల సిబ్బంది తమస్యలపై వెంకట్ పిటిషన్లు సమర్పించారు. రుణమాఫీపై పెట్టిన షరతులను వెంటనే ఎత్తేయాలని కోటిరెడ్డి ప్రస్తావించగా, వారసత్వ సర్టిఫికెట్లను ఇచ్చే అధికారం ఎమ్మార్వోలకు కల్పించాలని నవీన్‌కుమార్ కోరారు.

కాంగ్రెస్ మహిళలకు

ఎక్కడా అన్యాయం చేయలేదు

ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆదిశ్రీనివాస్


నవతెలంగాణ-సిటీబ్యూరో



కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఎక్కడా అన్యాయం చేయలేదని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో కలిసి ఆయన బుధవారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాట్లాడారు. ముఖ్యమంత్రి దిష్టిబొమ్మను బీఆర్ఎస్ నేతలు ఎందుకు దహనం చేయాలని నిర్ణయం తీసుకున్నారని ప్రశ్నించారు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించినందుకా? స్త్రీ శిశుశక్తి మహిళలకు స్కూల్ యూనిఫామ్ కుట్టే బాధ్యత ఇప్పించినందుకా? అన్ని నిలదీశారు. మహిళా సంఘాల ద్వారా కోటి మంది మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసే నిర్ణయం తీసుకున్నందుకా? అని ప్రశ్నించారు. ఆ ఎమ్మెల్యేలను అక్కలనే గౌరవంగా సీఎం అన్నారన్నారు. కానీ విషయాన్ని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. రైతుల రుణమాఫీ చేస్తున్నందు వల్ల బీఆర్ఎస్ నాయకులు తట్టుకోలేక పోతున్నారన్నారు. తప్పుడు ప్రచారంతో దిష్టిబొమ్మల దహనం, నిరసన చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు.

సభ సమయాన్ని వృథా చేసిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు

బీజేపీ ఫ్లోర్ లీడర్ ఏలేటి మహేశ్వర్‌రెడ్డి



రెండ్రోజులుగా అసెంబ్లీలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు చేస్తున్న నాటకాలను తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారని, ద్రవ్య వినిమయ బిల్లుపై గంటసేపు మాట్లాడే అవకాశమున్నా దాన్ని వృథా చేశారని బీజేపీ ఫ్లోర్ లీడర్ ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. గురువారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడారు. నిరసన వ్యక్తం చేయడం వారి హక్కు.. కానీ వెల్‌లోకి వెళ్లి రెండున్నర గంటలు రచ్చ చేయడం సరికాదన్నారు. పదేండ్లలో రాష్ట్రాన్ని ధ్వంసం చేశారని, ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేసి.. అప్పుల కుప్పగా మార్చారని విమర్శించారు. యువతను పూర్తిగా మోసం చేసిన మాట వాస్తవం కాదా అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు.. ఇతర పార్టీలకు మాట్లాడే సమయాన్నివ్వాలని, వారిని గౌరవించాలని అన్నారు. గతంలో ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా అన్ని వర్గాల ప్రజలను మోసం చేశారని తెలిపారు. కాంగ్రెస్ ఏడు నెలల్లో చేసిన అప్రజాస్వామ్య అంశాలపై తాము ఎప్పటికప్పుడూ లేవనెత్తున్నామని, తమను బుల్డోజ్ చేసే ప్రయత్నం బీఆర్ఎస్ పార్టీ నేతలు చేశారని అన్నారు.

స్కిల్ యూనివర్సిటీని స్వాగతిస్తున్నాం

ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ



తెలంగాణ యువత కోసం ఏర్పాటు చేస్తున్న స్కిల్ యూనివర్సిటీని తమ పార్టీ స్వాగతిస్తోందని ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. అయితే, చార్మినార్ భాగ్యలక్ష్మి అమ్మవారి సాక్షిగా చేసిన యూత్ డిక్లరేషన్, నిరుద్యోగులకు రూ.4వేల భృతి, ఏటా రెండు లక్షల ఉద్యోగాలు కల్పన గురించి సీఎం రేవంత్ రెడ్డి మార్చిపోయారన్నారు. రైతు రుణమాఫీపై అనేక ఆంక్షలు విధిస్తున్నారని, ఆంక్షలు లేకుండా రుణమాఫీ చేయాలని కోరారు. ఆరు గ్యారంటీలు, ఐదు డిక్లరేషన్లు, 420 హామీలిచ్చి బడ్జెట్‌లో కేటాయింపులు చేయకుండా మమ అనిపించారని ఆరోపించారు. 50శాతంపైగా ఉన్న బీసీలకు బడ్జెట్‌లో కేవలం రూ. 9వేల కోట్లు కేటాయించి అన్యాయం చేశారన్నారు.

కేసీఆర్ అందుకే అసెంబ్లీకి రావడం లేదు

కాంగ్రెస్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి



దళిత స్పీకర్‌ను ఎక్కడ సార్ అని పిలవాల్సి వసుందోనని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అసెంబ్లీకి రావడం లేదని కాంగ్రెస్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. అసెంబ్లీ సమావేశాలు మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడారు. స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు కోసం తీసుకొచ్చిన బిల్లుపై చర్చలో పాల్గొనాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు విన్నవించినా స్పందించలేదని విమర్శించారు. గత పదేండ్ల పాలనలో బీఆర్ఎస్ యువత నోట్లో మట్టికొట్టిందని, ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాలలు ఏర్పాటు చేయలేదని అన్నారు. వైస్ ఛాన్స్‌లర్ల పోస్టులను రాజకీయ పునరావాసం కింద ఇచ్చారని ఆరోపించారు. కాంగ్రెస్ వాటన్నిటినీ సరిదిద్దే ప్రయత్నం చేస్తోందన్నారు. కీలక బిల్లుల విషయంలో విలువైన సూచనలు ఇవ్వకుండా పనికిరాని అంశాలను ముందు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలను ముందు పెట్టి రాజకీయం చేస్తున్న బీఆర్ఎస్ నేతలు.. తమ పదేండ్ల పాలనలో సర్కారు బడుల్లో టాయిలెట్లు లేక మహిళా ఉపాధ్యాయులు, విద్యార్థినులు ఇబ్బంది పడినప్పుడు వారి ఆత్మగౌరవం మీకు గుర్తుకు రాలేదా అని ప్రశ్నించారు. స్కిల్ యూనివర్సిటీ ఇప్పుడు ఒక విత్తనం మాత్రమే.. రానున్న రోజుల్లో మహావృక్షం అవుతుందన్నారు. ఎవరెన్ని అడ్డంకులు సృష్టించినా ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని, యువతకు ఉద్యోగావకాశాలు సృష్టిస్తామని స్పష్టం చేశారు.

సంపాదకీయం

ఇజ్రాయిల్ దురాగతం!



హమాస్ ముఖ్య రాజకీయ నేత ఇస్మాయిల్ హనియే హత్యతో ఇజ్రాయిల్ మరోసారి బరితెగించింది. దీనికి ప్రతీకారం తీర్చుకోవాలని ఇరాన్ అధినేత అయతుల్లా అలీ ఖమేనీ ఆదేశాలిచ్చినట్లు వచ్చిన నిర్ధారణగాని వార్తలు నిజమే అయితే మధ్య ప్రాచ్యంలో పరిణామాలు మరింత విషమించే అవకాశం ఉంది. ఒకే రోజు, బుధవారం నాడు హమాస్, హిజబుల్లా సంస్థల ప్రముఖ నేతలను ఇజ్రాయిల్ దళాలు హత్య చేశాయి. ఇరాన్ నూతన అధ్యక్షుడు మసూద్ పెజెషికియాన్ ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరైన హనియేను రాజధాని టెహరాన్‌లో హత్యచేశారు. అంతకు కొద్దిగంటల ముందు లెబనాన్ రాజధాని బీరూట్ నగరంలో హిజబుల్లా సీనియర్ మిలిటరీ కమాండర్ ఫాద్ షకుర్‌ను ఇజ్రాయిల్ హత్యచేసింది. ఈ రెండు సంస్థలూ ఇరాన్‌కు గట్టి మద్దతుదారులే అన్న సంగతి తెలిసిందే. ఇజ్రాయిల్ ఆక్రమణలోని గోలన్ గుట్టల ప్రాంతంపై అంతకుముందు జరిగిన దాడికి కారణమని ఇజ్రాయిల్ ఆరోపించగా తమకేమీ సంబంధం లేదని హిజబుల్లా ప్రకటించింది. గాజాలో హమాస్ నేతలు, కార్యకర్తల అణచివేత పేరుతో సాగిస్తున్న మారణహోమంలో భాగం, శాంతి చర్చలను దెబ్బతీసే కుట్ర కారణంగానే హనియే హత్య అన్నది స్పష్టం.

> గత నెల చివరి వారంలో పాలస్తీనా విముక్తికోసం పోరాడుతున్న పద్నాలుగు సంస్థలు, పార్టీలు చైనా మధ్యవర్తిత్వంలో ఉమ్మడిగా పోరాడేందుకు, జాతీయ ప్రభుత్వ ఏర్పాటుకు ఒక ఒప్పందానికి వచ్చిన సంగతి తెలిసిందే. ఈ పరిణామాన్ని అమెరికా, ఇజ్రాయిల్ జీర్ణించుకోలేకపోతున్నాయి. ఆ ఒప్పందంలో హమాస్, పశ్చిమ గట్టు ప్రాంతంలో అధికారంలో ఉన్న ఫతా పార్టీలు కీలకు భాగస్వాములు. ఈ రెండూ కలవకూడదని కోరుకుంటున్న ఇజ్రాయిల్‌కు అది శరాఘాతం మాదిరి తగిలింది. ఆ ఉక్రోశంతో టెహరాన్‌లో హమాస్ నేత హత్యకు పాల్పడి ఉండవచ్చు.

గతేడాది అక్టోబరు ఏడు నుంచి గాజాలో మారణకాండతో పాటు దాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్న ఇరాన్, అది మద్దతిస్తున్న సంస్థలను రెచ్చగొట్టి పూర్తి స్థాయి మధ్యప్రాచ్య యుద్ధంలోకి లాగాలన్నది ఇజ్రాయిల్ దానికి మద్దతు ఇస్తున్న అమెరికా, ఇతర పశ్చిమ దేశాల ఎత్తుగడ అన్నది తెలిసిందే. దాని వలలో పడకుండా ఇరాన్ ఇన్ని నెలలుగా సంయమనం పాటిస్తున్నది. ప్రతీకారం తీర్చుకోవాలని బుధవారం నాటి జాతీయ భద్రతా మండలి సమావేశంలో ఖమేనీ ఆదేశాలిచ్చినట్లుగా అధికారులు అనధికారికంగా చెప్పినట్లుగా గురువారం నాడు న్యూయార్క్ టైమ్స్ పత్రిక వార్త ఇచ్చింది. మంటను ఎగదోసేందుకు ఇలాంటి వార్తలను ప్రచారం చేయటం తెలిసిందే. ఒకటి మాత్రం స్పష్టం, తమకు ఎదురు లేదని, ఎవరిని కావాలంటే వారిని, ఎక్కడబడితే అక్కడ మట్టుబెట్టే సత్తా తమకుందని ఇజ్రాయిల్ తాజా హత్యల ద్వారా ఆ ప్రాంత, ప్రపంచ దేశాలకు సందేశమిచ్చింది. గత నెల చివరి వారంలో పాలస్తీనా విముక్తికోసం పోరాడుతున్న పద్నాలుగు సంస్థలు, పార్టీలు చైనా మధ్యవర్తిత్వంలో ఉమ్మడిగా పోరాడేందుకు, జాతీయ ప్రభుత్వ ఏర్పాటుకు ఒక ఒప్పందానికి వచ్చిన సంగతి తెలిసిందే. ఈ పరిణామాన్ని అమెరికా, ఇజ్రాయిల్ జీర్ణించుకోలేకపోతున్నాయి. ఆ ఒప్పందంలో హమాస్, పశ్చిమ గట్టు ప్రాంతంలో అధికారంలో ఉన్న ఫతా పార్టీలు కీలకు భాగస్వాములు. ఈ రెండూ కలవకూడదని కోరుకుంటున్న ఇజ్రాయిల్‌కు అది శరాఘాతం మాదిరి తగిలింది. ఆ ఉక్రోశంతో టెహరాన్‌లో హమాస్ నేత హత్యకు పాల్పడి ఉండవచ్చు. దానికి ప్రతిగా యుద్ధం గాకపోయినా ఇజ్రాయిల్ మీద పరిమితదాడులు జరిగే అవకాశం లేకపోలేదు. అది ఇరాన్ నేరుగా చేస్తుందా లేక మద్దతు ఇస్తున్న హిజబుల్లా, ఎమెన్‌లోని హౌతీ సాయుధ సంస్థలతో చేయిస్తుందా అన్నది చూడాల్సి ఉంది.

హనియే హత్యను ఐరాస భద్రతా మండలి బుధవారం నాటి అత్యవసర సమావేశం ఖండించింది.దీని పర్యవసానాలు మధ్య ప్రాచ్యంలో పూర్తి స్థాయి యుద్ధానికి దారితీయకుండా చూడాలని కోరింది.హనియే హత్యను చైనా, రష్యా, అల్జీరియా నిర్ద్వందంగా నిరసించగా అమెరికా, బ్రిటన్,ఫ్రాన్స్ ఈ ప్రాంతంలో పరిస్థితులు దిగజారటానికి కారకులైన వారికి ఇరాన్ మద్దతు ఇవ్వటమే కారణమని ఎదురుదాడికి దిగాయి.తాము ఎంతో సంయమనంతో ఉన్నామని అయితే నిర్దయాత్మకంగా హనియే హత్య మీద స్పందించేందుకు తమకు హక్కు ఉందని ఐరాసలో ఇరాన్ రాయబారి స్పష్టం చేశాడు. దీనికి ఇజ్రాయిల్‌తో పాటు అమెరికా కూడా బాధ్యత వహించాల్సిందే అన్నాడు.హత్యతో తమకేమీ సంబంధం లేదని, ఈ కారణంగా యుద్ధ అవసరం లేదని అమెరికా సన్నాయి నొక్కులు నొక్కింది. ఇరాన్ మీదే చర్యలు తీసుకోవాలంటూ దొంగే దొంగ అన్నట్లుగా ఇజ్రాయిల్ ఎదురుదాడికి దిగింది. అంతర్జాతీయ కోర్టులు తీర్పు చెప్పినా, యావత్ ప్రపంచం ఖండిస్తున్నా ఇజ్రాయిల్ ఖాతరు చేయటం లేదు. అడ్డగోలుగా భద్రతా మండలిలో అమెరికా ఇస్తున్న మద్దతు బయట అందిస్తున్న మిలిటరీ ఇతర సాయమే దాని దురాగతాలకు కారణం.ప్రపంచ శాంతి శక్తులు ఇప్పటి వరకు స్పందించింది ఒక ఎత్తు కాగా, మరింతగా రంగంలోకి దిగితేనే వాటికి అడ్డుకట్టపడుతుంది.

దైవాంశ సంభూతుడు!

అతను నాలా నీలా కాదు
అచ్చం దైవాంశ సంభూతుడు
అతను మన విధిరాత
విదర్భ విధ్వంసానికి
బెస్ట్ బేకరీ నరమేధానికి
దర్శక నిర్మాత!
అతను నాలానీలా కాదు
తల్లి పేగు తెంచుకొని పుట్టడానికి
సాక్షాత్తు దైవ కుమారుడు!

అకస్మాత్తుగా పచ్చ నోట్లకు
మంగళ గీతం పాడి
బ్యాంకుల ముందు
జనాల్ని బారులు తీర్చి
డజన్ల కొద్ది ప్రాణాలకు
మోక్షం ప్రసాదించిన మహాత్ముడు!

అందరి సొమ్మును అప్పనంగా కాజేసిన
మానవోత్తములను వైతరణి దాటించిన
పరమ పావన కామధేనువు
అతను నాలా నీలా కాదు
కారణజన్ముడు!

హత్రాస్‌లో ఆడపిల్లను చిదిమేసిన వాళ్లనీ
ఆటలాడి మువ్వన్నెల జెండాకు
మెరుగుపెట్టిన వాళ్ల అభిమానాన్ని
అపహాస్యం చేసిన వాళ్లను
తన రెక్కల కింద దాచుకొని
కాపాడిన తల్లికోడి అతను!

అతడు నాలా నీలా కాదు
దైవం ఏరి కోరి భువికి పంపబడ్డాడు
మణిపూర్ మంటలు అతని
ఆత్మను కాల్చజాలవు

అకస్మాత్తుగా అతను విధించిన
కరోనా కర్ఫ్యూను సవాలు చేస్తూ
వేల కిలోమీటర్లు నడిచిన
కాళ్లు కార్చిన రక్తం
అతని ఆత్మను తడపజాలదు
ప్రాణవాయువు అందక
పసిబిడ్డల్ని కోల్పోయిన
తల్లులు కార్చిన కన్నీళ్లు సైతం
అతని మనసు ముంచెత్త జాలవు


గడ్డ కట్టిన చలిలో
రాజధాని నడిబొడ్డున
గొంతెత్తిన అన్నదాత ఆర్తనాదాలు
అతని చెవికి వినపడవు
అతను నాలా నీలా కాదు
మానవాతీతుడు!

అతని మనోనిబ్బరం మంచు పర్వతం
ప్రజాగ్రహానికి మాత్రమే కరుగగలదు
ఆకాశమార్గాన సంచరించే అతని అహాన్ని
ఇదొక్కటే భూమార్గం
పట్టించగలదు...

-టి హరికృష్ణ, 9494037288

సామాన్యుడే 'పద్మ'వ్యూహాన్ని ఛేదిస్తాడు-తప్పదు!

29 జులై 2024 నాడు బడ్జెట్ మీద లోకసభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఉపన్యాసం చాలా ఆవేశంగా, ఆర్ద్రంగా, అర్థవంతంగా ప్రజల పక్షాన సాగింది. ఉపమానాలతో, సంకేతాలతో రాజకీయ కవితలా కూడా అనిపించింది. ఆరెస్సెస్, బీజేపీలకు వారి స్థాయి ఏమిటో చూపించింది. ప్రతిపక్షాలనన్నింటినీ ఏకం చేసి, ఇండియా కూటమి నాయకుడిగా మాట్లాడిన తీరు, దేశ ప్రజలకు నచ్చింది-మరీ ముఖ్యంగా అధికార బీజేపీ వారికి అర్థమయ్యేట్లు పురాణఘట్టాలను ఉదహరించి చేసిన ఆ ఉపన్యాసాన్ని తెలుగు పాఠకుల కోసం తెలుగులో అందిస్తున్నాను.



డాక్టర్ దేవరాజు మహారాజు

***

స్పీకర్ సర్, నా ఉపన్యాసాలలో నేను తరచూ చెపుతూనే ఉన్నాను. ప్రస్తుతం మన భారతదేశంలో భయపూరితమైన వాతావరణం ఉంది. అధికార పక్షంలో ఉన్న నా స్నేహితులు నవ్వుతున్నారు. కానీ, వాళ్లు కూడా భయపడుతున్నారు. నాకు తెలుసు బీజేపీలో కేవలం ఒకే ఒక్క వ్యక్తి ప్రధాని కావడానికి కలలు కనొచ్చు. ఒక వేళ రక్షణ మంత్రి ప్రధాని కావాలనుకుంటే అక్కడ ఒక పెద్ద సమస్య ఉంది. అక్కడ కూడా భయం ఉంది. అదే భయాన్ని వారు దేశవ్యాప్తం చేశారు. అందుకే నన్ను నేనొక ప్రశ్న అడుక్కుంటూ ఉన్నాను. బీజేపీ వారు దేశంలో భయాన్ని ఎందుకింత లోతుగా వ్యాప్తి చేశారూ? అని! స్పీకర్ సర్, మా చేయి గుర్తు-భయపడకు, భయపెట్టకు - అన్న విషయం గుర్తు చేస్తుంది. అదొక అభయ ముద్ర!! బీజేపీ పరిస్థితి వేరుగా ఉంది. బీజేపీ సభ్యులు భయపడుతున్నారు. బీజేపీ మంత్రులు భయపడుతున్నారు. దేశంలోని కష్టజీవులు, రైతులు, యువతీ యువకులు అందరికందరూ భయపడుతున్నారు. దీని గురించి తీవ్రంగా ఆలోచించి, నేనొక జవాబు కనుక్కున్నాను. అదే చెపుతున్నాను. బడ్జెట్ గురించే మాట్లాడుతున్నాను స్పీకర్ సర్! కొంచెం ఉపోద్ఘాతం ఇచ్చి అక్కడికే వస్తున్నాను.

చాలాయేళ్ల క్రితం హరియాణా కురుక్షేత్రలో యువకుడైన అభిమన్యుణ్ణి చక్రవ్యూహంలో ఇరికించి చంపేశారు. అంటే! స్పీకర్ సర్ చక్రవ్యూహంలో భయం ఉంది. హింస ఉంది. అలాంటి చక్రవ్యూహంలో అభిమన్యుణ్ణి ట్రాప్ చేసి, ఒక ఆరుగురు చుట్టుముట్టి, నిర్దాక్షిణ్యంగా చంపేశారు. నేను ఈ చక్రవ్యూహం గురించి కొంత పరిశోధన చేసి, తెలుసుకున్నదేమంటే - చక్రవ్యూహానికి మరొక పేరుందని, దాన్నే 'పద్మ'వ్యూహమంటారని !! అంటే ఆ వ్యూహం కమలం పువ్వు ఆకారంలో ఉంటుందట. లోటస్ ఫార్మేషన్-21వ శతాబ్దంలో కూడా ఒక కొత్త చక్రవ్యూహం- 'పద్మ' వ్యూహం తయారయ్యింది. అది కూడా కమలం పువ్వు ఆకారంలోనే ఉంటుంది. ఆ కమలం పువ్వు గుర్తునే మన దేశ ప్రధాని తనఛాతి మీద పెట్టుకుని తిరుగుతుంటాడు. ఆనాడు అభిమన్యుణ్ణి బంధించి, హింసించిన విధంగానే, ఈనాడు ఈ 'పద్మ'వ్యూహం కూడా ఈ దేశాన్ని బంధించింది. దేశంలోని రైతుల్ని, యువతీ యువకుల్ని, తల్లుల్ని, అక్కా చెల్లెళ్ళి, చిన్న వ్యాపారస్తుల్ని, మధ్యతరగతి వ్యాపారస్తుల్ని బంధించింది. స్పీకర్ సర్- నాడు మూకుమ్మడిగా అభి మన్యుణ్ణి చంపిన ఆరుగురు ఎవరంటే -ద్రోణాచార్య, కర్ణుడు, కృపాచార్య, కృతవర్మ, అశ్వద్ధామ, శకుని. ఈనాటి చక్రవ్యూహంలో కూడా ఆరుగురు ఉన్నారు. చక్రవ్యూహం వేల మందితో తయారవుతుంది. వారందరూ ఉంటారు. కానీ, దాని కేంద్రకంలో అంటే సెంటర్లో కేవలం ఆరుగురే ఉంటారు. వారే కంట్రోల్ చేస్తుంటారు. ఈ రోజు కూడా ఆరుగురే కంట్రోల్ చేస్తున్నారు. వారెవరంటే - నరేంద్రమోడీ జీ, అమిత్‌షా జీ, మోహన్ భగవత్ జీ, అజిత్ డోబాల్ జీ, అదానీ జీ, అంబానీ జీ.

ఈ 'పద్మ'వ్యూహపు ఉద్దేశమేమంటే - దేశ ఆర్థిక శక్తిని తమ ఆధీనంలో ఉంచుకోవడం. అదీ కేవలం ఇద్దరి దగ్గరే ఉండాలనుకోవడం. ఈడి, సిబిఐ, ఇన్‌కంటాక్స్ వ్యవస్థల్ని దుర్వినియోగం చేయడం. సరే ఇక ఇప్పుడైనా, ఈ బడ్జెట్‌లో గతంలో చేసిన తప్పిదాలు సవరించుకుంటారేమోనని అనుకున్నాం. కానీ అలా జరగలేదు. రైతులకు, యువతులకు ఈ బడ్జెట్ కొంత సహాయకారిగా ఉంటుందని భావించాం. కానీ, అలా జరగలేదు. చిన్న, మధ్య తరగతి వ్యాపార స్తులకు మేలుజరగలేదు. వీరందరి జీవితాల్ని ఈ బడ్జెట్ ధ్వంసం చేసింది. ఇదంతా 'పద్మ'వ్యూహంలో భాగం నోట్‌బందీ; జీఎస్టీ; టాక్స్ టెర్రరిజం - ఆపడానికి ఈ బడ్జెట్‌లో ఏ వెసులుబాటూ లేదు. కోవిడ్ సమయంలో మీరేం చేశారు? పెద్ద పెద్ద వ్యాపారస్తులకు ప్రోత్సాహ కాలు అందించారు. చిన్న వ్యాపారాల్ని మూసేయించారు. దేశంలోని నిరుద్యోగులకు జీవన భృతి లేదు. వారంతా బతకలేక తల్లడిల్లిపోతు న్నారు. ఐదు శాతమున్న అతిపెద్ద కంపెనీలలో పనిచేసే ట్రెయినీలకే స్టైఫండ్ అందుతుంది. 95శాతం యువతీ యువకులకు దీనివల్ల ఏ మాత్రం లాభం లేదు. అంటే ఏమిటీ? ముందు మీరు కాళు విరగ్గొడ తారు. తరువాత బ్యాండ్‌ఎయిడ్ వేస్తారు. అది సరిపోదు. పనిచేయదు.



ఈ రోజు పరీక్షల పేపర్‌లీక్ చాలా ప్రధానమైన అంశం. దాని గురించి ఏమైనా ఆలోచించారా? ఒక వైపు మీ పద్మవ్యూహం నిరుద్యోగాన్ని పెంచుతోంది. మరోవైపు మీ పద్మవ్యూహం పేపర్‌లు లీక్ చేస్తోంది. ఈ దేశపు యువత ఏమైపోవాలని అనుకుంటున్నారు. గత పదేండ్ల మీ పాలనలో దేశంలో డెబ్భయిసార్లు పరీక్ష పేపర్లు లీక్ అయ్యాయి. కావాలంటే వివరాలిస్తాను. తీరికగా చూస్కోండి. స్పీకర్ సర్-యువతీయువకులకు పేపర్‌లీక్ చాలా పెద్ద సమస్య దాన్ని ఎదుర్కోడానికి, దాన్ని సరిచేయడానికి, యువతకు న్యాయం చేయడానికి ఈ బడ్జెట్‌లో ఒక్క ంటే ఒక్కమాట కూడా లేదు. ఈ విషయం గుర్చి ఆర్థిక మంత్రి ఒక్క మాట మాట్లాడలేదు. పైగా గత ఇరవై ఏండ్లలో ఎన్నడూ లేనంత తక్కువగా -2.5 శాతం విద్యకు కేటాయించారు. దేం సరిపోతుందీ? మరో విశేషమేమంటే అగ్నివీర్ జవాన్‌లను తొలిసారి మీ చక్రవ్యూహంలో బంధించారు. ఈ బడ్జెట్‌లో అగ్నివీర్‌ల పెన్షన్ గురించి ఒక్కమాట చెప్పలేదు. మిమ్మల్ని మీరు దేశభక్తులని ప్రకటించుకుంటారు. కానీ, దేశ రక్షణ బాధ్యతను నిర్వహిస్తున్న అగ్నివీర్ జవాన్‌ల గురించి మీరు ఆలోచించరు. వారికి పెన్షన్ ఇవ్వడానికి బడ్జెట్‌లో ఒక్క రూపాయి కూడా కేటాయించరు. ఆ రకంగా మీరు మన సైనికుల్ని, 'అగ్నివీర్' అనే పద్మవ్యూహంలో ఇరికించారు.

అన్నదాతలైన, రైతుల్ని మీ నల్ల చట్టాల చక్రవ్యూహంలో బంధించారు. దానిలోంచి బయటపడడానికి రైతులు ఢిల్లీ బార్డర్‌లో ఏండ్లకేండ్లు ధర్నాలు చేస్తున్నారు. ఎంతోమంది ప్రాణత్యాగం చేశారు. అయినా వారిని కనికరించలేదు. వారు ఢిల్లీకి రాకుండా చేసి, వారి మీద బుల్లెట్లు కురిపించారు. అయినా రైతులు వీరోచితంగా పోరాడుతూనే ఉన్నారు. మీ పద్మవ్యూహంలోంచి బయటపడడానికి వారు ఒకే ఒక్క విషయం అడిగారు. లీగల్ గ్యారెంటెడ్ ఎం.ఎస్.పి. కావాలని డిమాండ్ చేశారు. దాని మీద మాట్లాడకపోగా, వారి రోడ్లు మూసేశారు. అది ఇప్పటికీ మూసే ఉంది. వారితో మీరు మాట్లాడరు. అందుకే వారు నన్ను కలవడానికి పార్లమెంటుకు వస్తే, వారిని లోనికి అనుమతించలేదు. అప్పుడు నేనే బయటికి వెళ్లి, మీడియా ముందు వారిని కలిశాను. అప్పుడు ఏమైందో నాకైతే తెలియదు, వెంటనే పార్లమెంట్ గేట్లు రైతుల కోసం తెరుచుకున్నాయి. సరే, ఈ బడ్జెట్‌లో రైతులు అడిగిన ఒక్క కోర్కెను దృష్టిలో ఉంచుకుని కేటాయింపులు చేసిఉంటే వారు మీ పద్మవ్యూహంలోంచి కొంతవరకు బయట పడేవారు. కానీ, అది జరగలేదు. మా 'ఇండియా' కూటమి వైపు నుండి మేం అన్నదాతలకు భరోసానిస్తున్నాం. అవకాశం రాగానే మేం తప్పక వారి డిమాండ్‌కు అనుకూలంగా స్పందిస్తాం! గ్యారంటీడ్ లీగల్ ఎం.ఎస్.పి. బిల్ ఈ సభలో పాస్ చేస్తాం! అన్నదాతల్ని ఆదుకుంటాం! ఇది మా వాగ్దానం!!

ఇకపోతే ఈ దేశపు మధ్య తరగతి ప్రజలు, ఈ బడ్జెట్‌కు ముందు, ప్రధాని మోడీకి ఎక్కువగా మద్దతిచ్చారు. కోవిడ్ సమయంలో కోవిడ్‌ను పారదోలడానికి ప్రధాని వారిని చప్పట్లు కొట్టమన్నారు. వారు రెండు చేతులతో శక్తి కొద్దీ చప్పట్లు చరిచారు. మాకు అది కొంచెం విచిత్రంగా అనిపించింది. కానీ, చెప్పింది దేశ ప్రధాని కదా-అని దేశ ప్రజలు విన్నారు. తర్వాత ప్రధాని మొబైల్ లైట్ వెలిగించమన్నారు.దేశ వ్యాప్తంగా మొబైల్ లైట్లు వెలిగాయి. అలాంటి మధ్య తరగతి ప్రజలకు మీరు మీ బడ్జెట్‌తో రెండు కత్తులు పొడిచారు. ఇండక్సేషన్ కౌన్సిల్ చేసి వారి వీపులో కత్తి పొడిచారు. కాపిటల్ గెయిన్ టాక్స్ పెంచి-వారి ఛాతిలో మరో కత్తి పొడిచారు. దీనితో మా ఇండియా కూటమికి కనిపించని లాభం జరిగింది. దేశ ప్రజలు ఎన్డీయే కూటమిని వదిలి ఇండియా కూటమివైపు వస్తున్నారు. - అవకాశం దొరికితే చాలు మీరు చక్రవ్యూహాలు ఏర్పాటు చేస్తారు. మేం మీ చక్రవ్యూహాన్ని, పద్మవ్యూహాన్ని బద్దలుకొట్టే పనిలో ఉన్నాం. భారతదేశంలో ప్రజలెవరూ కలలు కనగూడదని మీరు భావిస్తారు. కేవలం ఎ2,ఎ2లే (ఆదానీ, అంబానీలే) కలలు కనడానికి అర్హులు అని మీరనుకుంటారు. ఆ ఇద్దరే దేశంలోని ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కంట్రోల్ చేస్తారు. వారి దగ్గరే టెలికామ్ సిస్టమ్ ఉంది. ఎయిర్‌పోర్టులున్నాయి.ఇప్పుడిక రైల్వేలను ఆక్రమించాలనే ప్రయత్నంలో ఉన్నారు. సంపదకు సంబంధించిన ఏకచ్ఛత్రాధిపత్యం వీరి వద్దనే ఉంది.

> లోటస్ ఫార్మేషన్-21వ శతాబ్దంలో కూడా ఒక కొత్త చక్రవ్యూహం- 'పద్మ' వ్యూహం తయారయ్యింది. అది కూడా కమలం పువ్వు ఆకారంలోనే ఉంటుంది. ఆ కమలం పువ్వు గుర్తునే మన దేశ ప్రధాని తనఛాతి మీద పెట్టుకుని తిరుగుతుంటాడు. ఆనాడు అభిమన్యుణ్ణి బంధించి, హింసించిన విధంగానే, ఈనాడు ఈ 'పద్మ'వ్యూహం కూడా ఈ దేశాన్ని బంధించింది. దేశంలోని రైతుల్ని, యువతీ యువకుల్ని, తల్లుల్ని, అక్కా చెల్లెళ్ళి, చిన్న వ్యాపారస్తుల్ని, మధ్యతరగతి వ్యాపారస్తుల్ని బంధించింది. స్పీకర్ సర్- నాడు మూకుమ్మడిగా అభి మన్యుణ్ణి చంపిన ఆరుగురు ఎవరంటే -ద్రోణాచార్య, కర్ణుడు, కృపాచార్య, కృతవర్మ, అశ్వద్ధామ, శకుని. ఈనాటి చక్రవ్యూహంలో కూడా ఆరుగురు ఉన్నారు. చక్రవ్యూహం వేల మందితో తయారవుతుంది. వారందరూ ఉంటారు. కానీ, దాని కేంద్రకంలో అంటే సెంటర్లో కేవలం ఆరుగురే ఉంటారు. వారే కంట్రోల్ చేస్తుంటారు. ఈ రోజు కూడా ఆరుగురే కంట్రోల్ చేస్తున్నారు. వారెవరంటే - నరేంద్రమోడీ జీ, అమిత్‌షా జీ, మోహన్ భగవత్ జీ, అజిత్ దోబాల్ జీ, అదానీ జీ, అంబానీ జీ.

> ఈ దేశపు మధ్య తరగతి ప్రజలు, ఈ బడ్జెట్‌కు ముందు, ప్రధాని మోడీకి ఎక్కువగా మద్దతిచ్చారు. కోవిడ్ సమయంలో కోవిడ్‌ను పారదోలడానికి ప్రధాని వారిని చప్పట్లు కొట్టమన్నారు. వారు రెండు చేతులతో శక్తి కొద్దీ చప్పట్లు చరిచారు. మాకు అది కొంచెం విచిత్రంగా అనిపించింది. కానీ, చెప్పింది దేశ ప్రధాని కదా-అని దేశ ప్రజలు విన్నారు. తర్వాత ప్రధాని మొబైల్ లైట్ వెలిగించమన్నారు.దేశ వ్యాప్తంగా మొబైల్ లైట్లు వెలిగాయి. అలాంటి మధ్య తరగతి ప్రజలకు మీరు మీ బడ్జెట్‌తో రెండు కత్తులు పొడిచారు. ఇండక్సేషన్ కౌన్సిల్ చేసి వారి వీపులో కత్తి పొడిచారు. కాపిటల్ గెయిన్ టాక్స్ పెంచి-వారి ఛాతిలో మరో కత్తి పొడిచారు. దీనితో మా ఇండియా కూటమికి కనిపించని లాభం జరిగింది. దేశ ప్రజలు ఎన్డీయే కూటమిని వదిలి ఇండియా కూటమివైపు వస్తున్నారు. - అవకాశం దొరికితే చాలు మీరు చక్రవ్యూహాలు ఏర్పాటు చేస్తారు. మేం మీ చక్రవ్యూహాన్ని, పద్మవ్యూహాన్ని బద్దలుకొట్టే పనిలో ఉన్నాం.

స్పీకర్ సర్! దేశంలో మరొక ముఖ్యమైన సమస్య ఉంది. దానిమీద ఈ బడ్జెట్ దృష్టి పెట్టలేదు. ఈ దేశంలో దళితుల, ఆదివాసీల, మైనార్టీల, వెనకబడిన వర్గాల సంఖ్య అధికం. సుమారు 90-95 శాతం ప్రజలు వారే. అయితే వారికి ఎందులోనూ స్థానం దొరకదు. పెద్దపెద్ద వ్యాపారాల్లోగానీ, ప్రభుత్వ యంత్రాంగంలో గానీ, ముఖ్యమైన చోట్ల ఎక్కడా వారికి తగిన స్థానం దొరకదు. అందుకే దేశంలోని 95 శాతం ప్రజలు 'జనగణన' కోరుతున్నారు. అప్పుడు గానీ, ప్రతి దాంట్లో వారివారి భాగస్వామ్యం ఎంత అనేది బయటపడదు. ఆర్థిక మంత్రి నవ్వుతున్నారు గానీ, ఇది నవ్వే విషయం కాదని మేడమ్ గారు తెలుసుకుంటే మంచిది-ఈ దేశపు బడ్జెట్ దేనికి ఎంత అనేది నిర్ణయించడమంటే ఏమిటీ? ఈ దేశపు 'హల్వా'ను పంచడం జనాభాలో 2-3శాతం ఉన్నవారు ఈ దేశపు హల్వా పంచడానికి కూర్చు న్నారు. ఎవరికి పంచుతున్నారూ? వారికి అనువైన 2-3శాతం కార్పోరేట్లకు మాత్రమే పంచుతున్నారు. అంటే 95 శాతం ఉన్న సామాన్యులకు హల్వా ఏ మాత్రం అందడం లేదు (బడ్జెట్ ప్రవేశపెట్టే ముందు ఆర్థిక శాఖలో హల్వా (మిఠాయి) చేసి, అక్కడ ఉన్న అధికారులు కలిసి తినడం ఆనవాయితీ, దాన్ని దృష్టిలో ఉంచుకుని రాహుల్ గాంధీ దేశపు హల్వా పంచుకుని తింటున్నారని పరోక్షంగా ఎత్తిచూపారు. ఆఫొటో కూడా లోక్‌సభలో చూపించారు) ఈ సారి బడ్జెట్ తయారు చేసిన వారిలో 20 మంది అధికారులున్నారని తెలిసింది. అందులో ఒకరు మైనార్టీ. మరొకరు ఒబిసి. అంటే 95 శాతం ప్రజలకు ప్రతినిధులు ఇద్దరయితే 5 శాతానికి 18 మంది ఉన్నారు. ఉన్న ఆ ఇద్దరిని కూడా ఇక్కడ ఫొటోలోకి రాకుండా అడ్డుకుని, వెనక్కి నెట్టేశారు. ఎందుకీ వివక్ష అని మేమడుగుతున్నాం. మీ పద్మవ్యూహాల్ని బద్దలు కొట్టడానికే మేం బయలుదేరాం! మేం అదే పనిలో ఉన్నాం!! స్పీకర్ సర్-

పద్మవ్యూహాలు తయారు చేసేవారికి భారతదేశపు స్వభావం అర్థం కాలేదు పద్మవ్యూహంలో చిక్కుకున్న అణగారిన వర్గాల వారు 'అభిమన్యుడు' అనుకుని పొరపడ్డారు-కాదు-అక్కడ ఉన్నది 'అర్జునుడు'!! మీ కుటిల పద్మవ్యూహాల్ని ఛేదించుకుని ఈ దేశ ప్రజలు తప్పక బయటపడతారు. పద్మవ్యూహాలు పన్నినవారిని తుత్తునియలు చేస్తారు. మా చేతిలో ఉన్న రాజ్యాంగం- స్వేచ్ఛ- అహింస- ప్రేమభావన- 'పద్మ'వ్యూహాల్ని ముక్కలు చేస్తాయి. వీటితోనే మేం ప్రధాని ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీశాం. కుప్పగూల్చాం అందుకే ఆయన సభలోఉండటం లేదు. స్పీకర్ సర్!

- కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు విజేత, జీవశాస్త్రవేత్త (మెల్బోర్న్‌నుంచి)

వేలం కత్తికి వేలాడుతున్న 'సింగరేణి'!



నాదెండ్ల శ్రీనివాస్
9676407140

తెలంగాణ కల్పతరువు..మన సింగరేణి. సిరులనిచ్చే బొగ్గు గనులు..మన ప్రాంత వనరులు. ఎంతోమందికి అన్నం పెట్టి, ఉపాధి చూపిన నల్ల బంగారం నేల నేడు కేంద్రం ప్రయి'వేటు'కు విలవిల్లాడుతోంది. ఉమ్మడి రాష్ట్రంలో ప్రయివేటీకరణ యత్నాలను తిప్పికొట్టి నిలబడిన సింగరేణి ఇప్పుడు గనులు, నిల్వలు బ్లాక్‌ల వారీగా వేలం కత్తికి వేలాడుతోంది. నిన్న నల్లచట్టాలతో రైతులను నట్టేట ముంచే కుట్ర చేసి భంగపడిన మోడీ సర్కార్ నేడు బొగ్గుగనులపై కన్నేసి సింగరేణిని నిలువునా దెబ్బతీసే కుతంత్రం చేస్తోంది. లాభాల బాటలో నడుస్తున్న సంస్థను బలోపేతం చేసేందుకు అవసరమైన బొగ్గు గనులను కేటాయించాల్సింది పోయి అస్థిరపరిచే ప్రయత్నాలు ముమ్మరం చేస్తూ గనులను ప్రయివేటుపరం చేసే కుట్రకు తెరదీసింది. ఇది తెలంగాణకు అతిపెద్ద పెనుముప్పు. అందుకే సిఐటియు వంటి కార్మిక సంఘం సింగరేణికి దన్నుగా నిల బడి పోరాడుతున్నది. సింగరేణిని పరిరక్షించాలని, బొగ్గు గనుల వేలాన్ని ఆపాలని, కార్మికుల హక్కుల్ని, ఉపాధిని కాపాడాలని డిమాండ్ చేస్తూ పాదయాత్ర ప్రారంభించింది.

సింగరేణి అంటే ఒక సంస్థనే కాదు, తెలంగాణ ప్రజల ఆస్తి. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి గత ఏడేండ్ల కాలంలో 450 లక్షల టన్నుల ఉత్పత్తి నుంచి 670 లక్షల టన్నుల కంటే ఎక్కువ ఉత్పత్తి జరిగింది. దీంతో పాటు బొగ్గు తవ్వకాలు, రవాణా, లాభాలు, కంపెనీ విస్తరణ విషయంలోనూ సింగరేణి గణనీయమైన ప్రగతిని సాధిస్తూ వస్తున్నది. సింగరేణి ఆధ్వర్యంలో నడుస్తున్న థర్మల్ విద్యుత్ కేంద్రం దేశంలోనే అత్యుత్తమ పిఎల్ఎఫ్‌ను కలిగి ఉన్నది. కేవలం సింగరేణి రాష్ట్రానికే పరిమితం కాకుండా మహారాష్ట్రతో పాటు పలు దక్షిణాది రాష్ట్రాల్లోని థర్మల్ విద్యుత్ కేంద్రాలకు భారీ ఎత్తున బొగ్గు సరఫరా చేయడంతో దేశం విద్యుత్తు కాంతులతో విరజిమ్ముతోంది. దీంతోపాటు సింగరేణి ప్రాంతంలోనే కాకుండా ఇతర రాష్ట్రాల్లోనూ తన కార్యకలాపాలను విస్తరిస్తూ సింగరేణి ప్రగతి ప్రస్థానంలో దూసుకెళ్తున్నది. దేశంలో ఏ ప్రభుత్వరంగ సంస్థ ఇవ్వని విధంగా లాభాల్లో 29 శాతం వాటను కార్మికులకు ఇస్తున్న ఏకైక సంస్థ సింగరేణి. ఏ ప్రభుత్వ రంగ సంస్థ చేయనన్ని కార్మిక సంక్షేమ కార్యక్రమాలను చేపట్టింది. సింగరేణి యాజమాన్యం, కార్మికవర్గం కృషితో ఇంతకాలం కార్మికులకు లాభాల్లో వాటాలు అనేది పత్రికల్లో పతాక శీర్షికలయ్యాయి. ఇక సంస్థను ప్రయివేటుపరం చేస్తే, ఇక నుంచి నష్టాల మూటలు అనేవి ప్రధాన శీర్షికలు అవుతాయి. ప్రగతి పథంలో ఉన్న సింగరేణిని బలహీనపరిచి,నష్ట పూరిత పబ్లిక్ సెక్టార్ కంపెనీగా మార్చి అంతిమంగా ప్రయివేటుపరం చేసే కుట్రను కేంద్రంలోని బీజేపీ అమలు చేస్తోంది. గుజరాత్‌కు మాత్రం అడిగిన వెంటనే కేంద్రం లిగ్నైట్ గనులను ఎలాంటి వేలం లేకుండా నేరుగా గుజరాత్ మినరల్ డెవలప్‌మెంట్ సంస్థకు కేటాయించింది. కానీ తెలంగాణలోని సింగరేణికి ఎందుకు ఇవ్వదు? దేశమంతా ఒక్కటే అయినప్పుడు గుజరాత్‌కో విధానం, తెలంగాణకో విధానం ఉంటుందా?

దూకుడుగా ప్రయివేటీకరణ!

కోల్‌మైన్ అంటే బొగ్గు గనులే కాదు..యువతకు ఉపాధి సృష్టించి గోల్‌మైన్. అలాంటి సంస్థను అస్థిరపరిచి ప్రయివేటుపరం చేసేందుకు కేంద్రం తెగబడింది. మొదటి కాప్టివ్ మైనింగ్ పేరుతో కోల్ ఇండియా, సింగరేణి నుంచి బొగ్గు కొనకుండా తానే ఉత్పత్తి చేసుకొనేందుకు అవకాశం కల్పించింది. ఆ తర్వాత నెమ్మదిగా సాధారణ బొగ్గు తవ్వకాల్లో కూడా ప్రయివేట్ సంస్థలకు చొరబాటుకు దారి చూపి ఆపై వెసులుబాటు కల్పించింది.లీజ్ ఒప్పంద విధానాల్లో సులభతరంగా మార్పులు చేసింది.కేంద్రంలో మోడీ ప్రభుత్వం గత పదేళ్లుగా దూకుడుగా ప్రయివేటీకరణ విధానాలను అమలు చేస్తోంది.అందులో భాగంగా సింగరేణిలో 2021లో మరో దుర్మార్గ చట్టాన్ని తీసుకొచ్చింది.బొగ్గు వేలం పాటలో నెగ్గిన వారికి ఎలాంటి కండీషన్లు లేకుండా ఆ చట్టం పూర్తి స్వేచ్ఛను ఇచ్చింది.కార్మికుల భద్రత, సంక్షేమం,పర్యావరణ సంరక్షణ మొదలైన సమస్య ఏమైనప్పటికీ ఇవేవీ వారికి ముఖ్యం కాదు.వారికి కేవలం లాభాలు దండుకోవటమే లక్ష్యం.ప్రభుత్వమే పూనుకొని సింగరేణి బొగ్గు తవ్వకాలు జరిపితే ఉత్పత్తి కారుచౌకగా లభిస్తుంది. విద్యుత్ ఉత్పత్తి కూడా ధారాళంగా, చౌకగా వస్తుంది. దానితో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలకు అదనపు ఆదాయం మెండుగా సమకూరుతుంది. కార్మికుల, ప్రజల ప్రాధాన్యతను పక్కన పెట్టి బొగ్గుబ్లాకును వేలం వేయడమనేది దుర్మార్గమైన చర్య ప్రయివేటు వ్యాపార ప్రయోజనాల కోసం,బడా కార్పొరేట్ల లాభాల కోసం లక్షలాది కార్మికులు, వారి కుటుంబాల పొట్టకొట్టడం దారుణం.



గోదావరి నదీ పరివాహక ప్రాంతంలో సింగరేణి సంస్థ సొంత ఖర్చులతో అనేక ప్రాంతాల్లో సర్వే చేసి బొగ్గు బ్లాక్ లను గుర్తించింది. ఆపై బొగ్గు ఉత్పత్తిని కూడా చేపట్టింది. శ్రావణపల్లిలో కూడా ఆ రకంగానే బొగ్గు తవ్వకాలు చేపట్టాల్సి ఉంది. కానీ వేలం పాటల ద్వారా దక్కించుకోవాలని కేంద్రం నిర్దేశించింది. గత బీఆర్ఎస్ సర్కార్ కూడా ఇదే బాటలో నడిచి వేలం పాట ద్వారానే ప్రయివేటువారికి వత్తాసు పలికింది. ప్రస్తుత ప్రభుత్వమేమో సింగరేణికే కేటాయించాలని డిమాండ్ చేస్తున్నప్పటికీ సరైన ప్రణాళికతో కేంద్రంపై ఒత్తిడి తేవడం లేదు. దీనిపై అన్ని పార్టీలతో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి బొగ్గు గనులను రక్షించేందుకు కార్యచరణ చేపడితే ప్రయోజనకరం.

యుపిఎ ప్రభుత్వ కాలంలో కోల్ ఇండియా పది శాతం వాటాలు అమ్మితే ప్రస్తుత ఎన్డీయే ప్రభుత్వం మరో 29 శాతం వాటాలను అమ్మింది. క్రమంగా వాటికున్న హక్కులను నిర్వీర్యం చేయడం, తెలంగాణ వరప్రదాయిని సింగరేణిని కార్పొరేట్ల చేతుల్లో పెట్టడం దాని లక్ష్యంగా ఉంది. ఆ విధానాలకు వ్యతిరేకంగా 2003లో సింగరేణి 15 రోజులపాటు సమ్మె చేసింది.ఆ తర్వాత అనేక పోరాటాలు వెల్లువెత్తాయి. అయినా పాలకులు తమ విధానాల్ని మార్చుకోలేదు. పైగా మోడీ ప్రభుత్వం నగరీకరణ పేరుతో, ప్రయివేటువాళ్లకు విపరీత రాయితీ లిచ్చింది. బొగ్గు దిగుమ తుల మీద సుంకం రద్దు చేసింది. వీటితోపాటు దేశంలో బొగ్గు వినియోగించే సంస్థలన్నీ పది శాతం దిగుమతి చేసుకోవాలని కేంద్ర ప్రభుత్వం నిబంధనలు కూడా విధించింది.ఆ విధంగా దిగుమతుల రూపంలో బొగ్గు కొనేందుకు అవకాశం కల్పించింది. కార్పొరేట్ ప్రయోజనాల కోసమే కేంద్రం చూస్తోందన్నది దీన్నిబట్టి తెలుస్తోంది. ఉదాహరణకు టన్ను బొగ్గు 3,500 రూపాయల నుంచి 4వేల రూపాయలకిచ్చే సింగరేణిని కాదని పొరుగు రాష్ట్రమైన ఏపీ అనివార్యంగా గతంలో టన్నుకు 18వేల రూపాయల చొప్పున 7 లక్షల టన్నుల బొగ్గు దిగుమతి ఒప్పందం చేసుకుంది. ఇలా చేయడం ద్వారా ఛార్జీలు పెరిగి ప్రభుత్వ ఖజానా మీద అధిక భారం పడింది. ఇది అంతిమంగా ప్రజలపై ప్రభావం చూపుతుంది. తెలంగాణలోనైతే జెన్కో ఎన్టీపీసీకి గత ప్రభుత్వం రూ. 30వేల కోట్ల బకాయిపడింది. అయినా సింగరేణి లాభాల్లోనే ఉందంటే అధిక బొగ్గు ఉత్పత్తి, కార్మికుల శ్రమయే కారణం.

ప్రమాదంలో పారిశ్రామిక రంగం

గోదావరి నదీ పరివాహక ప్రాంతంలో సింగరేణి సంస్థ సొంత ఖర్చులతో అనేక ప్రాంతాల్లో సర్వే చేసి బొగ్గు బ్లాక్ లను గుర్తించింది. ఆపై బొగ్గు ఉత్పత్తిని కూడా చేపట్టింది. శ్రావణపల్లిలో కూడా ఆ రకంగానే బొగ్గు తవ్వకాలు చేపట్టాల్సి ఉంది. కానీ వేలం పాటల ద్వారా దక్కించుకోవాలని కేంద్రం నిర్దేశించింది. గత బీఆర్ఎస్ సర్కార్ కూడా ఇదే బాటలో నడిచి వేలం పాట ద్వారానే ప్రయివేటువారికి వత్తాసు పలికింది. ప్రస్తుత ప్రభుత్వమేమో సింగరేణికే కేటాయించాలని డిమాండ్ చేస్తున్నప్పటికీ సరైన ప్రణాళికతో కేంద్రంపై ఒత్తిడి తేవడం లేదు. దీనిపై అన్ని పార్టీలతో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి బొగ్గు గనులను రక్షించేందుకు కార్యచరణ చేపడితే ప్రయోజనకరం. ఒక్కసారి గనులు ప్రయివేటు సంస్థల చేతుల్లోకి వెళ్లిన తర్వాత గనులు మూతపడిన కొద్దీ కార్మికులను ఉద్యోగాలకు ఉద్వాసన పలికే అవకాశాలే మెండు. ప్రస్తుతం సింగరేణి కార్మికులకు అందుతున్న హక్కులు,లాభాల్లో వాటా వంటి అన్ని సౌకర్యాలూ దూరమవుతాయి.

అంతిమంగా సింగరేణి సంస్థ సమీప భవిష్యత్తులో కనుమరుగైపోయే ప్రమాదమూ లేకపోలేదు. సింగరేణి ద్వారా రాష్ట్రంలోని రెండు వేల పరిశ్రమలకు బొగ్గు అందుతోంది. ఒకవేళ ఈ సంస్థ ప్రయివేటీకరణ అయితే ఆయా పరిశ్రమలకు బొగ్గు సరఫరా అందడం ప్రయివేటు కంపెనీల చేతుల్లోకి వెళ్లి అంతిమంగా తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక పురోగతి ప్రమాదంలో పడే ప్రమాదం ఉంది. కేంద్రం సింగరేణిలోని కేవలం బ్లాకులు మాత్రమే వేలం వేయడం లేదు, వేలాది మంది కార్మికుల భవిష్యత్తును బహిరంగ మార్కెట్‌లో వేలం వేస్తోంది. ఈ వేలం వెర్రి ఆలోచనలు కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ఇప్పటికైనా మానుకోవాలి. లేదంటే ఎన్నో వీరోచిత పోరాటాలకు కేరాఫ్‌గా నిలిచిన సింగరేణి కార్మికవర్గం మరోసారి ఉద్యమ ఉక్కు పిడికిలి బిగించేందుకు సిద్ధమవ్వాలి.



మాదినేని భారతమ్మ మృతి

• నివాళులర్పించిన తమ్మినేని, నున్నా



నవతెలంగాణ-ఖమ్మం

సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు మాదినేని రమేష్ మాతృమూర్తి మాదినేని భారతమ్మ (80) గురువారం మృతిచెందారు. ఆమె భౌతికకాయాన్ని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావులు సందర్శించి నివాళ్లర్పించారు. మాదినేని కుటుంబానికి సానుభూతి తెలిపారు. భారతమ్మ వామపక్ష కుటుంబాల నుండి వచ్చారని, అభ్యుదయ భావాలు కలిగిన ఆమె, పిల్లలను కూడా వామపక్ష భావాలవైపు నడిపించారని, వారి పెద్ద కుమారుడు రమేష్ ప్రస్తుతం పార్టీ జిల్లా కమిటీ సభ్యుడుగా, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడుగా పనిచేస్తున్నారని వారు తెలిపారు. నివాళులర్పించిన వారిలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు, యర్రా శ్రీకాంత్, ఎం.సుబ్బారావు, పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బుగ్గవీటి సరళ, వై.విక్రం, కళ్యాణం వెంకటేశ్వరరావు, సిహెచ్.కోటేశ్వరరావు, బొంతు రాంబాబు, జిల్లా కమిటీ సభ్యులు యర్రా శ్రీనివాసరావు, ఆర్.ప్రకాష్, ఎస్.కె.బషీరుద్దీన్, కుటుంబరావు, వర్మ, ఎస్.కె.వి.ఎ.మీరా, సత్తెనపల్లి శ్రీను, ప్రతాపనేని వెంకటేశ్వరరావు, పి.సంగయ్య తదితర నాయకులు నివాళులర్పించారు.



కనీస కూలీ రూ.600 చెల్లించాలి : వ్యకాస

నవతెలంగాణ-ఎర్రుపాలెం

వ్యవసాయ కూలీలకు రోజుకు 600 రూపాయలు కనీస కూలి చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి తేలప్రోలు రాధాకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రమైన ఎర్రుపాలెం రామిశెట్టి పుల్లయ్య భవనం నందు రౌండ్ టేబుల్ సమావేశాన్ని వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ కూలీలకు సంవత్సరానికి 12 వేల రూపాయల కూలి బంద్ ఇవ్వాలని, 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్ సరఫరా చేయాలని, అర్హులందరికీ కొత్త రేషన్ కార్డులు జారీ చేస్తూ సన్నబియ్యం అందించాలని డిమాండ్ చేశారు. కౌలు రైతులకు ఎకరానికి 15 వేల రూపాయలు పంట సాయం అందించాలని ఇల్లు లేని వారికి ఇంటి స్థలంతో పాటు ఇంటి నిర్మాణానికి 5 లక్షల రూపాయల ఆర్థిక సహాయం అందించాలని ఎస్సీ, ఎస్టీలకు ఆరు లక్షల రూపాయలు ఇవ్వాలని అన్నారు. పెన్షన్‌దారులకు 4 వేల రూపాయలు వెంటనే జమ చేయాలని పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మహాత్మా గాంధీ గ్రామీణ జాతీయ ఉపాధి హామీ పథకంలో పని దినాలు సంవత్సరానికి 150 రోజుల పని కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు దివ్వెల వీరయ్య, గొల్లపూడి పెద్ద కోటేశ్వరరావు, నల్లమోతుల హనుమంతరావు, గామాసు జోగయ్య, నాగులవంచ వెంకట్రామయ్య, సగ్గుర్తి సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.



వ్యవసాయ విశ్వవిద్యాలయం ఎదుట దీక్ష

నవతెలంగాణ-మధిర

మధిర ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిశోధన టైం స్కేల్ వర్కర్ సెంట్రల్ యూనియన్ వారు గురువారం విశ్వవిద్యాలయం ముందు టెంట్ వేసి దీక్షకు దిగారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కన్వీనర్ పి.మురళి మాట్లాడుతూ గత కొన్నేండ్లుగా యూనివర్సిటీ రూల్ ప్రకారం గతంలో ఇక్కడ పనిచేసిన అధికారులు తాత్కాలికంగా టైం స్కేల్ వర్కర్స్‌తో పని చేయించుకున్నారన్నారు. ప్రస్తుత అధికారులు వీరిని తొలగించి కాంట్రాక్టు ఉద్యోగుల పేరుతో కొత్తవారిని నియమించుకున్నారని అన్నారు. తమకు రావలసిన హక్కులను అవకాశాలను దూరం చేసినందుకు కాంట్రాక్టు ఔట్సోర్సింగ్ వాళ్లను తొలగించి తమకు న్యాయం చేయాలని 2021లో లెటర్ ఇచ్చామన్నారు. దానికి సమాధానం లేదని, తర్వాత ఫిబ్రవరి, 2023లో ఇచ్చిన లెటర్‌కూ సమాధానం లేదన్నారు. 11-03-2024న వరంగల్ జోనల్ ఏడిఆర్‌ను మరియు హెడ్ ఆఫీసర్‌ను హైదరాబాదులో రిజిస్టర్‌కు లెటర్ ద్వారా తెలియపరిచామన్నారు.. వారు కూడా తమకు న్యాయం చేయలేదన్నారు. వర్కర్లకు న్యాయం జరిగేంత వరకూ ఆందోళన కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి వడ్రానపు మధు, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు మద్దాల ప్రభాకర్, వ్యవసాయ కార్మిక సంఘం టౌన్ నాయకులు పి.విల్సన్ తదితరులు పాల్గొన్నారు.



సంక్షేమబోర్డు నిధులు కార్మికులకే ఖర్చు చేయాలి

నవతెలంగాణ-కారేపల్లి

భవన నిర్మాణ కార్మికుల కోసం ఏర్పాటు చేసిన సంక్షేమ బోర్డు నిధులను కార్మికుల సంక్షేమానికి ఖర్చు చేయాలని బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్స్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయు) మండల కార్యదర్శి శనగ రాంబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బిల్డింగ వర్కర్స్ సమావేశం మండల అధ్యక్షులు కేలోత్ రవి అధ్యక్షతన కారేపల్లిలోని భాగం రామనర్సయ్య భవన్‌లో గురువారం జరిగింది. ఈసమావేశంలో రాంబాబు మాట్లాడుతూ గత పాలకులు కార్మికుల శ్రమ ఫలితాన్ని దారి మళ్లించి అన్యాయం చేశారని విమర్శించారు. వేల్ఫేర్ బోర్డు నిధులను ఇతర సంక్షేమ పథకాలకు వినియోగించటం విచారకరమన్నారు. బోర్డు ద్వారా మృతి చెందిన కార్మికులను మాత్రమే ఎక్స్‌గ్రేషియా ఇస్తున్నారని, అన్ సీజన్‌లో పని దొరకక ఉపవాసం ఉంటున్నా కార్మికుల వ్యధలు ప్రభుత్వం పట్టించుకోవటం లేదన్నారు. పని దొరకని సమయంలో సంక్షేమ బోర్డు నుండి పని కల్పించాలని లేదా వారికి సగం వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికులకు టూ వీలర్స్ ఇవ్వాలని, మెడికల్ క్లైయిమ్‌లు, భీమా క్లైయిమ్‌లు వెంటనే చెల్లించాలన్నారు. సంక్షేమ బోర్డుకు నిధుల కేటాయింపు కై బిల్డింగ్ వర్కర్స్ ఆధ్వర్యంలో పోరాటాలకు ఉపక్రమిస్తామని అన్నారు. సమావేశంలో సిఐటియు కారేపల్లి మండల కన్వీనర్ కే.నరేంద్ర, నాయకులు గజ్జల శ్రీను, ఆదెర్ల ఉపేందర్, మధు తదితరులు పాల్గొన్నారు.

రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణం కోసం స్థల పరిశీలన

నవతెలంగాణ - బోనకల్

బోనకల్ పాత రైల్వే గేటు వద్ద అండర్ బ్రిడ్జి నిర్మాణ కోసం స్థలాన్ని మధిర ఐఓడబ్ల్యూ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గురువారం పరిశీలించారు. మండల కేంద్రంలోని 117 రైల్వే గేటు వద్ద ఫ్లై ఓవర్ నిర్మించడంతో బోనకల్ స్టేషన్ వైపు నివసిస్తున్న ప్రజలతోపాటు అటువైపు ఉన్న గ్రామాల ప్రజలు ఇవతల వైపు ఉన్న ప్రభుత్వ వైద్యశాల, తహసిల్దార్ కార్యాలయం ఎంపీడీవో కార్యాలయం, జూనియర్ కళాశాల పలు ప్రభుత్వ కార్యాలయాలకు, ఖమ్మం బస్సు కొరకు వెళ్ళుటకు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ క్రమంలో గత కొన్ని రోజుల క్రితం బోనకల్ రైల్వే స్టేషన్‌కు తనిఖీల నిమిత్తం వచ్చిన డిఆర్ఎమ్ కు బోనకల్ మండల అఖిలపక్ష నాయకుల ఆధ్వర్యంలో రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణం చేయాలని వినతిపత్రం అందజేశారు. స్పందించిన డిఆర్ఎం సంబంధిత అధికారులకు అండర్ బ్రిడ్జి నిర్మాణం పై ప్రతిపాదనలు పంపించవలసిందిగా ఆదేశించినట్లు రైల్వే అధికారులు తెలిపారు. అందులో భాగంగా మధిర ఐఓడబ్ల్యు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అధికారులు సర్వే నిర్వహించారు. రైల్వే అధికారులు వస్తున్న విషయం తెలిసిన స్థానికులు అక్కడికి వెళ్లి రైల్వే అండర్ బ్రిడ్జి లేకపోవటం వలన ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వారికి వివరించారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి

• ఆగివున్న లారీని ఢీ కొట్టిన బైక్

నవతెలంగాణ-సత్తుపల్లి



ఆగివున్న లారీని బైక్ ఢీకొట్టిన ఘటనలో ముగ్గురు యువకులు అక్కడికక్కడే దుర్మరణం పాలైన సంఘటన సత్తుపల్లి మండలం గంగారం హెచ్‌పీ పెట్రోలు బంకు ఎదుట గురువారం సాయంత్రం జరిగింది. ఈ ఘటనలో మండలంలోని రామగోవిందాపురం గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు, బాలుడొకరు మృతిచెందారు. . వివరాల్లోకి వెళ్తే... సాయిస్ఫూర్తి ఇంజినీరింగ్ కళాశాల సమీపంలోని హెచ్‌పీ పెట్రోలు ఎదురుగా రాష్ట్రీయ రహదారి పక్కగా అశ్వారావుపేట వైపు వెళ్లే లారీని డ్రైవరు రోడ్డు పక్కగా ఆపి ఉంచాడు. గంగారం సెంటరు నుంచి మోటారుసైకిలుపై ముత్తిని వేణు (18), బేతి సురేశ్ (22) రామగోవిందాపురంలోని ఇండ్లకు వెళు న్న క్రమంలో అప్పుడే బడి వదిలి పెట్టడంతో అదే గ్రామానికి చెందిన ఆరో తరగతి చదువుతున్న ఎస్కే కరీముల్లా (11) ఇంటికెళ్లేందుకు మోటారుసైకిలుపై వెళ్తున్న వారిని లిఫ్ట్ అడిగాడు. దీంతో బాలుడిని ఎక్కించుకొని ముగ్గురు కలిసి మోటారుసైకిలుపై వెళ్తున్న క్రమంలో రోడ్డు పక్కన ఆపివున్న లారీని ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో ముగ్గురి తలలు రోడ్డుకు బలంగా కొట్టుకొని అధిక రక్తస్రావమై అక్కడికక్కడే మృత్యువాతకు గురయ్యారు. సత్తుపల్లి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ప్రమాద వివరాలను సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జాబ్ క్యాలెండర్ ప్రకటించాలి

నిరుద్యోగ భృతి ఇవ్వాలి : డీవైఎఫ్ఐ

నవతెలంగాణ-ఖమ్మంకార్పొరేషన్

రాష్ట్రంలో ఖాళీగా ఉన్న పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని డివైఎఫ్ఐ ఖమ్మం త్రీ టౌన్ కార్యదర్శి శీలం వీరబాబు ప్రభుత్వాన్ని కోరారు. స్థానిక ఖమ్మం డివైఎఫ్ఐ ఆఫీసులో 29వ డివిజన్ డివైఎఫ్ఐ సమావేశం త్రీ టౌన్ అధ్యక్షుడు యర్రా సాయికుమార్ అధ్యక్షతన జరిగింది ఈ సమావేశంలో వీరబాబు మాట్లాడుతూ ప్రభుత్వం జాబ్ క్యాలెండర్‌ని రూపొందించి ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు నిరుద్యోగులందరికీ నిరుద్యోగ భృతి ఇవ్వాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. లేనిపక్షంలో నిరుద్యోగ పక్షాన అనేక ఆందోళన పోరాటాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో డివైఎఫ్ఐ త్రీ టౌన్ నాయకులు సారంగి పాపారావు, దాసరి గణేష్, వాసుదేవరాజు, పి.వెంకటరమణ, దావీద్ తదితరులు పాల్గొన్నారు.





ప్రజలకు నష్టం కలిగిస్తున్న కేంద్రం ఆర్థిక విధానాలు

• సిపిఐ (ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు ఎర్ర శ్రీకాంత్

నవతెలంగాణ- ఖమ్మం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆర్థిక విధానాలు ప్రజలకు నష్టం కలిగిస్తున్నాయని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు ఎర్ర శ్రీకాంత్ అన్నారు. గురువారం ఖమ్మంలోని ఖానాపురం హవేలి కమిటీ సమావేశం సత్తెనపల్లి రామకృష్ణ భవనంలో తోట నాగరాజ్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఎర్ర శ్రీకాంత్ మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ఆర్థిక విధానాలు ప్రజలకు నష్టదాయకంగా ఉన్నాయని అన్నారు. స్థానిక సమస్యలపై అధికారులు దృష్టి సారించాలన్నారు. డ్రైనేజీలలో మురికి పేరుకుపోతుంది అన్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థను పటిష్ట పరచాలని, 14 రకాల సరుకులు ఇవ్వాలని, బియ్యం ఒక్కటే ఉచితంగా ఇస్తున్నారని, కేరళ ప్రభుత్వం ఇస్తున్నట్టు అన్ని సరుకులు ప్రజలకు ఇవ్వాలన్నారు. ఇప్పటికే మహిళలు రక్తహీనతతో బాధపడుతున్నారని అన్నారు. కార్యక్రమంలో పార్టీ హవేలి కార్యదర్శి దొంగల తిరుపతిరావు, పి.రమ్య, ఎన్.వెంకన్న, టీ.నరసింహ, పి.వెంకటి, పి.నాగమణి, వి.రమాదేవి, కే.అమరావతి, జే.ఆనందరావు, కే నవీన్, వి.మురహరి తదితరులు పాల్గొన్నారు.

నాసిరకం పనులపై విచారణ చేయాలి

• తెలంగాణ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా వీరభద్రం

నవతెలంగాణ-వైరాటౌన్



వైరా కేంద్రంలో గిరిజన భవన్ కోటి 20 లక్షల రూపాయల వ్యయంతో నిర్మాణం జరుగుతుంది. ఆరు సంవత్సరాల నుండి పూర్తి కాకుండా అసంపూర్తిగా పనులు జరుగు తున్నాయి. గురువారం తెలంగాణ గిరిజన సంఘం, సిపిఐ(ఎం) నాయకులు నిర్మాణ పనులను పరిశీలించారు. నిర్మాణాలు కోసం ఉపయోగిస్తున్న సిమెంటు గడ్డకట్టడంతో పాటు డస్టు పౌడర్ వాడకాన్ని తెలంగాణ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా వీరభద్రం అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆయనతో పాటు సిపిఎం వైరా పట్టణ, రూరల్ కార్యదర్శులు సుంకర సుధాకర్, తోట నాగేశ్వరరావు, విప్పలమడక మాజీ సర్పంచ్ పారుపల్లి కృష్ణారావులు పనులను పరిశీలించారు. కాంట్రాక్టర్ అందుబాటులో లేరని, పర్యవేక్షణ చేసే గిరిజన శాఖ, ఐటిడిఏ అధికారులు ఎవరూ లేరని, నాసిరకం పనులు చేసిన కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఐటిడిఏ అధికారుల పర్యవేక్షణలో గిరిజన భవన్ నిర్మాణం పూర్తి చేయాలని డిఇని ఫోన్‌లో భూక్యా వీరభద్రం కోరడంతో ఆయన అంగీకరించారు. నాణ్యతతో నిర్మాణం చేపట్టకపోతే ఆందోళన చేస్తామని భూక్యా వీరభద్రం హెచ్చరించారు.

రేపు 'మంచికంటి'లో ఉచిత మెడికల్ క్యాంపు

• 2డి ఎకోతో పాటు పలు వైద్య పరీక్షలు ఉచితం
• సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై విక్రమ్

నవతెలంగాణ- ఖమ్మం

నెల నెలా ఉచిత మెడికల్ క్యాంపులో భాగంగా ఈనెల మొదటి శనివారం ఖమ్మం మంచికంటి ఫంక్షన్‌లో గుండెకు సంబంధించిన 2డి ఎకో పరీక్షలు పూర్తిగా ఉచితంగా నిర్వహిస్తున్నట్లు, ఈ అవకాశాన్ని నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై విక్రమ్, బివికె ట్రస్ట్ చైర్మన్ వై శ్రీనివాసరావు అన్నారు. గురువారం ఖమ్మంలోని మెడికల్ క్యాంపు నిర్వహణ కమిటీ సమావేశం మాజీ కౌన్సిలర్ నర్రా రమేష్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ స్తంభాద్రి ఆసుపత్రి సౌజన్యంతో గుండె సంభదించి 2డి ఎకో పరీక్షలు ఉచితంగా చేయడంతో పాటు ఆర్థో, న్యూరో, యూరాలజిస్ట్, జనరల్ ఫిజిషియన్ పరీక్షలు కూడా ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. అలాగే వీటికి సంబంధించి మందులు కూడా ఉచితంగా పంపిణీ చేయడం జరుగుతుందని, నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే, అమరజీవి బోడేపూడి వెంకటేశ్వరరావు (బివికె) ట్రస్ట్ కమిటీ, పార్టీ ఖమ్మం టూ టౌన్ కమిటీ ఆధ్వర్యంలో గత ఏడు సంవత్సరాలుగా ఉచితంగా బిపి, షుగర్, పక్షవాతం పేషెంట్లకు నెలకు సరిపడా మందులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు, టిఫిన్ సౌకర్యం కూడా ఉచితంగా అందిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లా ప్రజలు ఈ మెడికల్ క్యాంపును జయప్రదం చేయాలని కోరారు. ఈ హెల్త్ క్యాంపులో ప్రముఖ డాక్టర్లు మేదరమేట్ల అనిల్ కుమార్, పేర్ల హర్షతేజ, గుమ్మడి రాఘవేంద్ర, గట్టినేని సురేష్, డోగిపర్తి కృష్ణ, సుమంత్, చీకటి భారవి, కొల్లి అనుదీప్, రావెళ్ళ రంజిత్, పిల్లలమర్రి సుబ్బారావు, గుడిపూడి రాజేష్, జెట్ల రంగారావు పాల్గొంటారని తెలిపారు. ప్రతి నెలా చెవి, ముక్కు, గొంతు, కళ్ళ డాక్టర్ కూడా అందుబాటులో ఉంటారని, ఖమ్మం జిల్లాలో నిరాఘాటంగా, ఉచితంగా కొనసాగుతున్న ఏకైక మెడికల్ క్యాంపు ఇది మాత్రమే అని, గత కొన్ని సంవత్సరాలుగా ఈ వైద్య సేవలు అందిస్తున్నామని వారు పేర్కొన్నారు. ఈనెల ముఖ్య అతిథిగా పార్టీ జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు పాల్గొంటారని తెలిపారు. సమావేశంలో పార్టీ టూ టౌన్ కార్యదర్శి బోడపట్ల సుదర్శన్, నాయకులు వాసిరెడ్డి వీరభద్రం, అఫ్జల్, కృష్ణారావు, పి.ఝాన్సీ, పి.వాసు, సిహెచ్ భద్రం, గుమ్మడి బిక్షం, జె.వెంకన్న బాబు తదితరులు పాల్గొన్నారు.

నగరంలోని రహదారులపై గుంతలు పూడ్చాలి

• తరచూ ప్రమాదాలు..స్పందించని అధికారులు

నవతెలంగాణ- ఖమ్మం



ఖమ్మం నగరంలో ప్రధాన రహదారులపై పెద్ద ఎత్తున గుంతలు ఏర్పడ్డాయని, వెంటనే అధికారులు స్పందించి వాటిని వెంటనే పూడ్చాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై విక్రమ్ డిమాండ్ చేశారు. గురువారం ఖమ్మంలోని నూతన బస్టాండ్ ఎన్ఎస్టీ రోడ్‌పై బాగా లోతుగా వున్న గుంతలను సీపీఐ(ఎం) బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల పడిన వర్షాలకు ఖమ్మం నగరంలో ప్రతి గల్లీలో అలాగే ప్రధాన రోడ్లపై పెద్ద గుంతలు ఏర్పడ్డాయని తెలిపారు. టూ వీలర్ వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, తరచు అదుపు తప్పి కింద పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమస్యలపై మేయర్‌కు పలు వినతిపత్రాలు ఇచ్చినట్లు తెలిపారు. వెంటనే గుంతలు పూడ్చేందుకు ఖమ్మం కమిషనర్, మేయర్, అధికారులు స్వయంగా కలుగజేసుకుని అందుకు తగిన నిధులు మంజూరు చేసి సమస్య పరిష్కారం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ టూ టౌన్ కార్యదర్శి బోడపట్ల సుదర్శన్, నాయకులు జె.వెంకన్న బాబు, భుక్యా ఉపేంద్ర నాయక్, ఎస్కే హుస్సేన్, సీహెచ్ భద్రం, డి.నాగరాజు, మల్లికార్జున్‌రెడ్డి, నాగేశ్వరరావు, ఎస్కే షఫీ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) సానుభూతిపరురాలు మృతి

నవతెలంగాణ-ఖమ్మంరూరల్



మండలంలోని తెల్దారుపల్లి గ్రామానికి చెందిన సీపీఎం సానుభూతిపరాలు వాసం జమలమ్మ (85) గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం రాత్రి మృతి చెందారు. మృతదేహాన్ని గురువారం సీపీఎం జిల్లా నాయకులు తమ్మినేని కోటేశ్వరరావు సందర్శించి నివాళ్లర్పించారు. జమలమ్మకు ఐదుగురు కుమారులు, నలుగురు కుమార్తెలు ఉన్నారు. నివాళ్లర్పించిన వారిలో మాజీ సర్పంచ్ సిద్దినేని కోటయ్య, నాయకులు యల్లంపల్లి నాగయ్య, షేక్ రంజాన్ పాషా, పగిడిపల్లి ఉపేందర్, జక్కంపూడి సైదులు, బోడపట్ల శ్రీనివాస్, జక్కంపూడి కృష్ణ, సిరికొండ నగేష్, వేగినాటి ఫ్రాన్సిస్, మల్లెబోయిన రామకృష్ణ, గజ్జి పట్టాభి తదితరులు ఉన్నారు.

రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలి

• జిల్లా వ్యవసాయాధికారి విజయనిర్మల

నవతెలంగాణ-ఎర్రుపాలెం



జూన్ నెల 20 లోపు నూతనంగా పట్టాదారు పాసు పుస్తకం పొందిన రైతులు సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారుల వద్ద రైతు బీమా కొరకు దరఖాస్తు చేసుకోవాలని ఖమ్మం జిల్లా వ్యవసాయ అధికారి విజయనిర్మల రైతులకు సూచించారు. తొలుత ఎర్రుపాలెం మండల పరిధిలోని సకినవీడు, రాజుపాలెం, మామునూరు, బనిగండ్లపాడు గ్రామాలలో నిర్వహించబడుతున్న ఎరువుల దుకాణాలను, ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎరువుల దుకాణదారులతో మాట్లాడుతూ పిఓఎస్ మిషన్ ద్వారా మాత్రమే ఎరువులను విక్రయించాలని తెలిపారు. ఎరువుల క్రయవిక్రయాలను ఎప్పటికప్పుడు రిజిష్టర్‌లో నమోదు చేసుకోవాలని తెలిపారు. రైతులు పురుగు మందులు, ఎరువులు లైసెన్స్ కలిగిన డీలర్ల వద్దనే కొనుగోలు చేయాలని తెలిపారు. వాటిని పంట కాలం పూర్తి అయ్యే వరకు రైతులు కొనుగోలు చేసిన బిల్లులను భద్రపరుచుకోవాలన్నారు. రైతు బీమాకు 1965 ఆగస్టు నెల 14వ తేదీ నుండి 2006 ఆగస్టు నెల 14వ తేదీ మధ్యలో జన్మించిన వారు మాత్రమే అర్హులని (ఆధార్ కార్డు ప్రకారం) ఈనెల 5వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. రైతులు ఆధార్ కార్డు, నామిని ఆధార్ కార్డు, పాసుపుస్తకం జిరాక్స్‌లు దరఖాస్తు ఫారంతో పాటు జతచేసి వ్యవసాయ విస్తరణ అధికారుల వద్ద దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. రైతు రుణమాఫీకి సంబంధించి మొదటి రెండు విడతలలో లక్ష 50 వేల లోపు బ్యాంకులో అప్పు కలిగి ఉన్న 4064 మంది రైతు కుటుంబాలకు రుణమాఫీ నిధులు జమ చేసినట్లు తెలిపారు. రైతులకు ఎటువంటి సందేహాలు కలిగి ఉంటే వాటి నివృత్తి కొరకు విస్తరణ అధికారులను సంబంధిత రైతు వేదికల వద్ద సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కొండూరు విజయభాస్కర్‌రెడ్డి, ఏఈవోలు జిష్ణు, ధాత్రి, సుష్మ బాలకృష్ణ, కృష్ణకుమారి, దుర్గాప్రసన్న, ఎరువుల దుకాణదారులు, రైతులు పాల్గొన్నారు.

కృష్ణమూర్తి ఆశయ సాధనకు

నేటి యువత కృషి చేయాలి

• వ్యకాస రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నెకంటి

నవతెలంగాణ-ఖమ్మంరూరల్

వీర తెలంగాణ రైతంగ సాయుధ పోరాట యోధుడు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు కాసం కృష్ణమూర్తి ఆశయ సాధనకు నేటి యువత కృషి చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు పొన్నెకంటి సంగయ్య అన్నారు. మండలంలోని నాయుడుపేట గ్రామంలో వ్యవసాయ కార్మిక సంఘం ఖమ్మంరూరల్ మండల కమిటీ ఆధ్వర్యంలో కాసం కృష్ణమూర్తి 18వ వర్ధంతిని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణమూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పెద్దతండా మాజీ ఉప సర్పంచ్ మొరబోయిన పుల్లయ్య అధ్యక్షతన ఏర్పాటు చేసిన సభలో సంగయ్య మాట్లాడుతూ భూమి, భుక్తి, వెట్టి చాకిరి విముక్తి కోసం జరిగిన మహత్తర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో పాల్గొన్న వీరుడు కృష్ణమూర్తి అన్నారు. పేదల అభ్యున్నతి కోసం తన జీవితాంతం కృషి చేసిన కృష్ణమూర్తి సేవలను నేటి యువత కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో సంఘం మండల కార్యదర్శి వడ్లమూడి నాగేశ్వరరావు, నాయకులు నందిగామ కృష్ణ, కారుమంచి గురవయ్య, ఏటుకూరి ప్రసాదరావు, నాగరాజు, ఆంటోనీ తదితరులు పాల్గొన్నారు.





తుళ్లూరు భద్రయ్యకు నివాళి

నవతెలంగాణ-వైరాటౌన్

మండలంలోని వల్లాపురం గ్రామానికి చెందిన సీపీఐ(ఎం) సానుభూతిపరులు తుళ్లూరు భద్రయ్య(75) గురువారం తెల్లవారు జామున మరణించారు. మృతునికి భార్య, ఒక కుమారుడు ఉన్నారు. కుమారుడు తుళ్ళూరి హనుమంతరావు ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా, యూటీఎఫ్ సంఘం నాయకునిగా ప్రభుత్వ పాఠశాలలు, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్నారు. తుళ్లూరు భద్రయ్య మరణం సమాచారం తెలియగానే సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు, వైరా నియోజకవర్గం ఇన్‌చార్జి భూక్యా వీరభద్రం, బొంతు రాంబాబు, వైరా రూరల్ మండల కార్యదర్శి తోట నాగేశ్వరరావు మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో మండల కార్యదర్శివర్గ సభ్యులు బాజోజు రమణ, తూము సుధాకర్, కిలారు శ్రీనివాసరావు, పట్టణ కమిటీ సభ్యులు గుడిమెట్ల రజిత, గుడిమెట్ల మోహన్‌రావు, రైతు సంఘం జిల్లా నాయకులు వనమా చిన్న సత్యనారాయణ, ఎ.వెంకటేశ్వరరావు, ధర్మారావు, కొమ్మినేని రమేష్ తదితరులు ఉన్నారు.

5 లోగా రైతు బీమాకు దరఖాస్తు చేసుకోండి

నవతెలంగాణ-కల్లూరు

కొత్తగా పట్టాదారు పాసుపుస్తకాలు తీసుకున్న రైతులు ఈనెల 5వ తేదీలోగా రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలని వ్యవసాయ అధికారి ఎం.రూప గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 28వ తేదీ వరకు పట్టాదార్ పాస్ పుస్తకం కొత్తగా వచ్చిన రైతులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తుతో పాటు రైతు పట్టాదార్ పాస్ పుస్తకం, రైతు ఆధార్ కార్డు, నామిని ఆధార్ కార్డు, జతపరచి ఏఈఓకి ఇవ్వాలన్నారు. ఆగస్టు 14 1985, ఆగస్టు 14 2008 మధ్యలో పుట్టిన రైతులు మాత్రమే అర్హులని తెలిపారు. 18 సంవత్సరాల నుండి 59 సంవత్సరాల వరకు రైతులు దరఖాస్తు చేసుకోవచ్చున్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

నవతెలంగాణ-వైరాటౌన్

రైతుల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని సొసైటీ అధ్యక్షులు ఐలూరి కృష్ణారెడ్డి తెలిపారు. రుణమాఫీ సందర్భంగా గురువారం గరికపాడు గ్రామంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఐలూరి కృష్ణారెడ్డి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు ఐలూరి కృష్ణారెడ్డి, డైరెక్టర్లు గోసు రాధాకృష్ణ, మెరుగు రత్నరాజు, బాణాల చిన్న శేషయ్య, షేక్ వజీర్, విప్పలమడక మాజీ వైస్ సర్పంచ్ వీరపనేని చెన్నకేశవరావు రైతులు పాల్గొన్నారు.

ఎంపీడీఓగా అదనపు బాధ్యతలు స్వీకరించిన వీవీఎస్ శాస్త్రి

నవతెలంగాణ-బోనకల్

మండల పరిషత్ ఎంపీఓ వ్యాకరణం వెంకట సుబ్రహ్మణ్య శాస్త్రిని (వీవీఎస్ శాస్త్రి) పూర్తిస్థాయి అదనపు ఎంపీడీవోగా నియమిస్తూ జిల్లా కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎంపీడీవో గా విధులు నిర్వహిస్తున్న లకావత్ రాజు ఈ నెల 31న ఉద్యోగ విరమణ పొందనున్నారు. అయితే లకావత్ రాజు ఆరోగ్య సమస్యలతో సెలవు పెట్టారు. దీంతో ప్రస్తుత ఎంపీఓ వివిఎస్ శాస్త్రిని పూర్తిస్థాయి అదనపు ఎంపీడీవోగా నియమిస్తూ కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఆయన మండల పరిషత్ కార్యాలయంలో అధికార బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనకు మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది అభినందనలు తెలిపారు.

అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ట్రై సైకిళ్లు పంపిణీ

నవతెలంగాణ-మధిర



భట్టి క్యాంపు కార్యాలయంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సతీమణి, అమ్మ ఫౌండేషన్ చైర్మెన్ మల్లు నందిని విక్రమార్క చేతుల మీదుగా వికలాంగులకు ట్రై సైకిళ్ల గురువారం అందజేశారు. అనంతరం నందిని విక్రమార్క మాట్లాడుతూ అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గత 18 సంవత్సరాలుగా అనేక సేవా కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. కరోనా సమయంలో అమ్మ ఫౌండేషన్ మధిర ప్రజలకు అండగా ఉండి నిరుపేదలకు నిత్యవసర సరుకులు అందజేశామన్నారు. భవిష్యత్తులో అమ్మ ఫౌండేషన్ ద్వారా మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధికారి ప్రతినిధి వేమిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సూరంశెట్టి కిషోర్, పట్టణ అధ్యక్షుడు మిరియాల వెంకటరమణ గుప్తా, మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ రంగా హనుమంతరావు, మున్సిపాలిటీ కౌన్సిలర్ కోనధని కుమార్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు దారా బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేత...

నవతెలంగాణ-ఖమ్మం రూరల్

మండలంలోని ముత్తగూడెం గ్రామానికి చెందిన పలువురు లబ్ధిదారులకు ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి సిఫార్సు ద్వారా మంజూరైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను సీపీఐ(ఎం) నాయకులు ఉరడీ సుదర్శన్‌రెడ్డి, పీ.మోహన్‌రావులు గురువారం అందజేశారు. మేకల ఉమారాణికి మంజూరైన 85 వేల చెక్కును, గుదే పాపమ్మకు మంజూరైన 18 వేల చెక్కును, గుదే వీరప్రసాద్‌కు మంజూరైన 13,500 రూపాయల చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ముదాం శ్రీనివాసరావు, మెడికొండ నాగేశ్వరరావు, తాటి వెంకటేశ్వర్లు, చామకురి రవి తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ రాంబాబుకి అభినందనలు

నవతెలంగాణ-మధిర

తహసిల్దార్ బాధ్యతలు తీసుకున్న ఆర్.రాంబాబుని గురువారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సురం శెట్టి కిషోర్, నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మధిర మున్సిపాలిటీ కౌన్సిలర్ మల్లాది వాసు, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు దారా బాలరాజు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కర్నాటి రామారావు, మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ జహంగీర్, గౌసుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శిగా గౌరాజు ఏలేశ్వరం బాధ్యతలు స్వీకరణ

నవతెలంగాణ-ఎరుపాలెం



ఎర్రుపాలెం గ్రామపంచాయతీ కార్యదర్శిగా పదవి బాధ్యతలను గౌరాజు ఏలేశ్వరం గురువారం స్వీకరించారు. వైరా మండలం లింగన్నపాలెం గ్రామ పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తూ ఎర్రుపాలెం గ్రామపంచాయతీ కార్యదర్శిగా బదిలీపై వచ్చారు.

నేడు 'ఉపాధి హామీ' సామాజిక తనిఖీ

నవతెలంగాణ-తల్లాడ

మండలంలోని 27 గ్రామ పంచాయతీలలో, 15వ విడత, 2023 ఏప్రిల్ నెల నుండి, జులై 31, 2024, వరకు నిర్వహించిన అంశాలపై ప్రజావేదిక మండల స్థాయిలో ఈనెల 2న గ్రామపంచాయతీ కార్యాలయం తల్లాడలో ప్రజా వేదిక నిర్వహిస్తున్నమని ఎంపీడీవో చంద్రమౌళి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈజీఎస్ సిబ్బంది, గ్రామపంచాయతీ, కార్యదర్శులు, తగిన నివేదికలతో, సకాలంలో హాజరు కావాలని కోరారు.

పొలం బాట

నవతెలంగాణ-కామేపల్లి

పొలం బాట పట్టి వ్యవసాయ శాఖ అధికారులు గురువారం వరి నాట్లు వేసి రైతులకు అవగాహన కల్పించారు. వ్యవసాయ శాఖ అధికారులు ఏడిఎ.శ్రీనివాసరావు, ఎఓ తారాదేవి, వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో మండలంలో రైతుల పంట పొలాల వద్దకు వ్యవసాయ అధికారులు క్షేత్ర పర్యటన చేసి పంట పొలంలో కూలీలతో కలిసి వరి నాట్లు వేసి రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ ఉష, జగదీష్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

అంకెలతో కాదు..ఆచరణతోనే అభివృద్ధి

- **సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బొంతు రాంబాబు**

నవతెలంగాణ-వైరాటౌన్



రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్లో అంకెలు చూపించడం కాదని, ఆచరణలో కేటాయించిన బడ్జెట్ ఆ శాఖలకు వెంటనే బదిలీ చేసి అమలు చేయాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బొంతు రాంబాబు డిమాండ్ చేశారు. గురువారం సీపీఐ(ఎం) వైరా పట్టణ కమిటీ సమావేశం పట్టణ కార్యదర్శివర్గ సభ్యులు చింతనిప్పు చలపతిరావు అధ్యక్షతన స్థానిక బోడెపూడి భవనంలో నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ బడ్జెట్ భారీగా ఉన్న ప్రస్తుతం రాష్ట్ర పరిస్థితులకు అనుగుణంగా విద్యా, వైద్యం, సాగునీటి ప్రాజెక్టులకు కావలసినంత కేటాయింపులు చేయలేక పోయిందని ఆరోపించారు. ఇప్పటికైనా రాష్ట్ర బడ్జెట్ సవరణ చేసి విద్యా, వైద్యానికి కేటాయింపులు పెంచాలని, అదేవిధంగా సీతారామ ప్రాజెక్టుకు ఎక్కువ నిధులను కేటాయించి పూర్తి చేయాలన్నారు. ఇప్పటికి జరిగిన కేటాయింపులు ప్రాజెక్టు మెయింటనెన్స్ కు సరిపోయే విధంగా ఉందని, ఇంకా దుమ్ముగూడెం దగ్గర బ్యారేజీ, ప్రాజెక్టు లాకులు ఏర్పాటు చేయడానికి కావలసినన్ని బడ్జెట్ కేటాయింపు జరగలేదని తెలిపారు. ఇట్లా చూస్తే సీతారామ ప్రాజెక్టు పూర్తి అవటానికి ఇంకో పదేళ్ల పడుతుందని, రైతులకు సాగునీటి ప్రాజెక్టులకు సకాలంలో నీరు రాక రాను..రాను సీజన్లలో వ్యవసాయాన్ని ప్రారంభించే పద్ధతి మారుతుందని చెప్పారు. గత ప్రభుత్వం వైరా రిజర్వాయరును సాగర్ జలాలతో బ్యాలెన్స్ రిజర్వాయర్‌గా చేస్తామని మాటలు చెప్పడమే తప్ప ఆచరణలో అమలు చేయలేకపోయారని విమర్శించారు. ప్రస్తుత ప్రభుత్వమైనా సీతారాం ప్రాజెక్టు నుండి వైరా రిజర్వాయర్ కు నీళ్ళు తీసుకొచ్చి మా కల సాకారం చేసుకుంటామని రైతులకు ఇచ్చిన హామీని ఖమ్మం జిల్లా మంత్రులు నిలబెట్టుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ కార్యదర్శి సుంకర సుధాకర్, కార్యదర్శివర్గ సభ్యులు మచ్చా మణి, బొంతు సమత, పట్టణ కమిటీ సభ్యులు హరి వెంకటేశ్వరావు, గుడిమెట్ల రజిత, సంక్రాంతి నరసయ్య, పైడిపల్లి సాంబశివరావు, రాచబంటి బత్తిరన్న, అనుమోలు రామారావు, కొంగర సుధాకర్, గుడిమెట్ల మోహన్ రావు, గుమ్మా నరసింహారావు, మాడపాటి మల్లిఖార్జున్ తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్లో కార్మికులకు వాటా లేకపోవడం సిగ్గుచేటు : సీఐటీయూ

నవతెలంగాణ-ఖమ్మం రూరల్



కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన రెండు లక్షల,91 వేల కోట్ల బడ్జెట్లో కార్మిక వర్గానికి బడ్జెట్ కేటాయించకపోవడం హేయమైన చర్య అని తెలంగాణ బిల్డింగ్ అండ్ అదర్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి ముదాం శ్రీనివాసరావు, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి పీ.మోహన్‌రావు అన్నారు. మండలంలోని వరంగల్ క్రాస్ రోడ్డు వద్ద గల తమ్మినేని సుబ్బయ్య భవన్లో బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) మండల విస్తృతస్థాయి సమావేశం మండల నాయకులు పూరెల్లి రాములు అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పినట్లు అధికారంలోకొస్తే సంఘటిత, అసంఘటిత కార్మికులకు మెరుగైన వేతనాలు అందిస్తామని, వెల్ఫేర్ బోర్డులో పెండింగ్లో ఉన్న క్లైములన్ని పరిష్కరిస్తామని హామీ ఇచ్చి, బడ్జెట్లో కార్మికుల ఊసే ఎత్తకపోవడం సిగ్గుచేటు అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే స్పందించి కార్మికుల కోసం ప్రత్యేక నిధిని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా వర్కింగ్ కమిటీ అధ్యక్షులు మేడికొండ నాగేశ్వరరావు, నాయకులు వెంకటరమణ, పసుపులేటి రవి, నాగాచారి, ఉపేందర్, కొండలు, వెంకన్న, రాంబాబు, రాజయ్య సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

'మాదక ద్రవ్యాలను అరికడదాం'

నవతెలంగాణ-మధిర



భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ) రాష్ట్ర వ్యాప్తంగా మాదక ద్రవ్యాలను అరికడదాం, సమాజాన్ని కాపాడుదాం అనే కార్యక్రమంతో యువతలో చైతన్యాన్ని నింపడానికి అవగాహన కార్యక్రమాలు గురువారం నిర్వహించింది. అందులో భాగంగా డివైఎఫ్ఐ మధిర రూరల్, టౌన్ కమిటీల ఆధ్వర్యంలో మధిర సీఐ మధ చేతుల మీదుగా మాదకద్రవ్యాల పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు మద్దాల ప్రభాకర్ మాట్లాడుతూ దేశ భవిష్యత్తు, అభివృద్ధి యువతపై ఆధారపడి ఉందన్నారు. దేశం వివిధ రంగాల్లో రాణించాలంటే యువత మేధస్సు నైపుణ్యం అవసరం అన్నారు. గంజాయి డ్రగ్స్ లాంటి మాదకద్రవ్యాల వినియోగం వలన యువశక్తి పెడదారి పడుతుంది. యువతను మత్తులో ముంచి చిత్తు చేసే గంజాయి, డ్రగ్స్ అక్రమ వినియోగానికి అడ్డుకట్ట వెయ్యాలని డివైఎఫ్ఐ రాష్ట్రవ్యాప్తంగా అవగాహన కల్పించనుందని తెలిపారు. దీనికి తోడు ప్రభుత్వం కూడా వీటిని పూర్తిగా నిషేధించే విధంగా చట్టం చేయాలన్నారు. ఈ మహమ్మారిని తరిమికొట్టేందుకు డివైఎఫ్ఐ జిల్లాలో ఈనెల 01 నుంచి ఆగస్టు 18 వరకు జిల్లాలో సదస్సులు, ర్యాలీలు, సంతకాలను సేకరణలు చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ మండల అధ్యక్షులు షేక్ సైదులు, డివైఎఫ్ఐ యంగ్ ఉమెన్స్ కన్వీనర్ తెలప్రోలు మానస, టౌన్ నాయకులు ఆనంద్, నరేష్, వాడిత్య హరి, షేక్ ఖదర్, వాడపల్లి మురళి, పడకంటి మురళి, అంజి,కార్మిక సంఘం నాయకులు పల్లెకంటి విల్సన్ తదితరులు పాల్గొన్నారు.

ఈ నెల 6 న వైరా ప్రాజెక్టు నుండి సాగునీరు విడుదల

నవతెలంగాణ-వైరా



వైరా ప్రాజెక్టు నుండి ఖరీఫ్ సాగుకు ఈ నెల 6వ తేదీ సాయంత్రం నీరు విడుదలకు ప్రాజెక్టు ఆయకట్టు రైతుల అఖిల పక్ష సమావేశం నిర్ణయించింది. గురువారం ఎంఎల్ఏ క్యాంపు కార్యాలయంలో శీలం వెంకట నర్సిరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో రైతు సంఘాల నాయకులు, రైతులు ఆయకట్టుకు సాగునీరు వెంటనే విడుదల చేయాలని కోరారు. అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్నందున ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ సమావేశానికి రాక పోవటంతో కొంత సందిగ్ధత ఏర్పడింది. సమావేశం మధ్యలో నీటిపారుదల శాఖ డీఈ శ్రీనివాసరావు హాజరై నీటి విడుదలకు తేదీ నిర్ణయించారు. హాజరైన రైతులు ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువల్లో పేరుకుపోయిన సిల్ట్ తొలగించాలని డిమాండ్ చేశారు. నీటి విడుదల లోపు సిల్ట్ తొలగిస్తామని డీఈ తెలిపారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు బొర్రా రాజశేఖర్, దాసరి దానేలు, బీఆర్ఎస్ నాయకులు చింతనిప్పు మురళీ, సీపీఐ(ఎం) నాయకులు పారుపల్లి కృష్ణారావు, టీడీపీ నాయకులు చింతనిప్పు చలపతిరావు, మచ్చా బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

విద్యావిధానాన్ని పరిశీలించిన కేంద్ర బృందం

నవతెలంగాణ-కల్లూరు

మండల పరిధిలోని కొర్లగూడెం ప్రాథమికొన్నత పాఠశాలలో పేద పిల్లలకు ప్రభుత్వం అందిస్తున్న విద్యా విధానాన్ని గురువారం కేంద్ర బృందం పరిశీలించారు. ఎంపీఓ ఏనుగు సురేష్ బాబు ప్రభుత్వ శాఖల్లో జరుగుతున్న ప్రభుత్వ పథకాలు వివరించారు. కేంద్ర ప్రభుత్వం నుండి అసిస్టెంట్ సెక్షన్ అధికారులు కొర్లగూడెం పాఠశాలను సందర్శించి విలేజీ చిత్రపటాన్ని రంగవల్లుల తోటి ప్రదర్శించి రిసోర్స్ గ్రామ స్వరూపం సోషల్ మ్యాపు ద్వారా తెలుసుకున్నారు. అనంతరం తాసిల్దార్ ఆఫీస్‌ను సందర్శించి ధరణి రెవెన్యూ సమస్యలపై రైతుల సమస్యలపై తెలుసుకున్నారు. అదేవిధంగా మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయం, పోలీస్ స్టేషన్‌ను సందర్శించి సమావేశమై అభివృద్ధి పనులను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ బైరెడ్డి నరసింహారెడ్డి, ఏపీఎం వెంకటరామారావు, సీసీ ఫాతిమా, గ్రామపంచాయతీ సెక్రటరీ రాంప్రసాద్, రేషన్ డీలర్ పద్మ, అంగన్‌వాడీ సిబ్బంది, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

లేబర్ కార్యాలయంలో దళారులను అరికట్టాలి

- **అసిస్టెంట్ లేబర్ కమిషనర్ కృష్ణవేణికి వినతి**

నవతెలంగాణ-ఖమ్మం

లేబర్ కార్యాలయంలో దళారులను అరికట్టాలని ప్రగతిశీల భవన ఇతర నిర్మాణ కార్మిక సంఘం (ఐఎఫ్టియు) ఆధ్వర్యంలో అసిస్టెంట్ లేబర్ కమిషనర్ కృష్ణవేణికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఐఎఫ్టియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఐ.వెంకన్న మాట్లాడుతూ లేబర్ కార్డు అప్లై చేసుకోవాలి అంటే 110 రూపాయలు మీ సేవ ఖర్చులతో కలుపుకొని 200 రూపాయలలోపు మాత్రమే ఉంటుంది. కానీ లేబర్ కార్యాలయ సిబ్బంది ప్రోత్సాహంతో దళారులు 500 రూపాయల నుండి మొదలుకొని 2000 రూపాయలు కార్మికుల దగ్గర నుండి వసూలు చేస్తూ కార్మిక వర్గాన్ని మోసం చేస్తున్నారని, క్లెయిమ్‌ల విషయానికి వస్తే సగానికి సగం డబ్బులు దళారుల చేతిలో పడుతుందన్నారు. ఇదేంటని అడిగితే లేబర్ కార్యాలయంలో మేము ఇవ్వాలని చెపుతున్నారని తెలిపారు. ఈ దళారి వ్యవస్థను అరికట్టాలని లేనియెడల దశల వారి కార్యక్రమాలతో పాటు పెద్ద ఎత్తున లేబర్ కార్యాలయాన్ని కూడా ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్టియు జిల్లా అధ్యక్షులు షేక్ సుబహాన్, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బోడ నాగేశ్వరరావు, గుగులోత్ పటేల్ ,ఐ ఎఫ్ టి యు జిల్లా నాయకులు గౌని మోహన్ రావు, రాజు తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరం

నవతెలంగాణ-కల్లూరు



పుట్టిన ప్రతి బిడ్డకు ముర్రుపాలు తాగిస్తే అన్ని రకాల విటమిన్లు లభించి బిడ్డ సంపూర్ణ ఆరోగ్యానికి దోహదపడుతుందని ఎంపీటీసీ కొండూరు కిరణ్ కుమార్ అన్నారు. గురువారం పట్టణంలోని శాంతి నగర్ 2, 3, 4అంగన్ వాడీ సెంటర్‌లో తల్లి పాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్ సంధ్య, ఎంపీటీసీ కొండూరి కిరణ్ కుమార్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తోపుడు బండి ఫౌండేషన్ సాధిక్ అలీ, అంగన్‌వాడీ సూపర్ వైజర్ సంధ్య, సుజాత, అంగన్‌వాడీ టీచర్లు జయమ్మ, లక్ష్మీ, పద్మ, ఏఎన్ఎం రజిని, ఆశా సమాధానం, శాంతి నగర్ ఎస్‌డీఎస్ సభ్యులు వీరస్వామి, శ్రీను, మాజీ వార్డు సభ్యులు కొత్తపల్లి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎర్రుపాలెం : బిడ్డ పుట్టిన వెంటనే ముర్రుపాలు పట్టించాలని బిడ్డ ఆరోగ్యకరంగా ఉంటుందని పల్లె దవాఖాన డాక్టర్ శకుం తల తల్లులకు సూచించారు. గురువారం మండల పరిధిలోని నారాయణపురం, గుంటుపల్లిగోపవరం గ్రామంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా శకుంతల మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ పద్మావతి, రాజేశ్వరి, ఆశ కార్యకర్త మల్లీశ్వరి, బాలింతలు, గర్భిణీ స్త్రీలు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

- **ఎస్ఐ షాకీర్, డిపో మేనేజర్ రాజ్యలక్ష్మి**

నవతెలంగాణ-కల్లూరు



పర్యావరణ ప్రతి ఒక్కరు బాధ్యత అని ఎస్సై షాకీర్, సత్తుపల్లి డిపో మేనేజర్ యూ.రాజ్యలక్ష్మి అన్నారు. గురువారం కల్లూరు బస్టాండులో వనమహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మొక్కలు నాటి మాట్లాడారు. ప్రతి ఒక్కరు బాధ్యతాయుతంగా ఒక మొక్క నాటాలన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ఇంజనీర్ మెకానికల్ సాహితి, విలేజ్ బస్ ఆఫీసర్ కిన్నెర ఆనందరావు, కార్గో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ ఎస్కే.మునీర్ పాషా, సిబ్బంది కంచి సాంసన్, ఫీల్డ్ అసిస్టెంట్ మిద్దె బాబు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



'రెజోనెన్స్'లో బ్లూ , రైనీ డే వేడుకలు

నవతెలంగాణ-ఖమ్మం

నగరంలోని శ్రీనివాస నగర్‌లో రెజోనెన్స్ పాఠశాలలో బ్లూ డే, రైనీ డే ను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్స్ ఆర్‌వీ. నాగేంద్ర కుమార్, నీలిమ మాట్లాడుతూ విద్యార్థులు నీటిని కాపాడండి, భూమిని రక్షించండి అనే నినాదంతో బ్లూ డే, రైనీ డేను నిర్వహించినట్టు తెలిపారు. విద్యార్థులు వివిధ ఆటల ప్లే...వే కార్యకలాపాల ద్వార నీలం రంగు గుర్తించేలా చేశారు. విద్యార్థులను చైతన్య వంతులను చేయుటకు ఈ కార్యక్రమన్ని నిర్వహించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాలను సందర్శించిన ఎస్సీ డీడీ ఉపసంచాలకులు

నవతెలంగాణ-మధిర

జడ్పీహెచ్ఎస్ జిలుగుమాడు పాఠశాలను గురువారం ఎస్సీ డీడీ ఉప సంచాలకులు కస్తాల సత్యనారాయణ సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి భోజనం చేసి విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌డీఓ కే. వెంకటేశ్వర్లు, హెచ్‌డబ్ల్యూఓ సలీం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శ్రీనివాస్ సేవలు అభినందనీయం

- **ఎంఈఓ వై.ప్రభాకర్**

నవతెలంగాణ-మధిర



రికార్డ్ అసిస్టెంట్‌గా శ్రీనివాస్ సేవలు అభినందనీయమని ఎంఈఓ వై.ప్రభాకర్ తెలిపారు. మండలంలోని మహాదేవపురం జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల రికార్డ్ అసిస్టెంట్‌గా బేదంశెట్టి శ్రీనివాస్ విధులు నిర్వహిస్తూ పదవివిరమణ పొందారు. గురువారం నిర్వహించిన పదవీ విరమణ సన్మాన కార్యక్రమం ఎంఈఓ పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ సేవలను పలువురు కొనియాడారు. ఈ కార్యక్రమంలో బేదంశెట్టి శ్రీనివాస్ బంధువులు, మిత్రులు, పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎంపీడీవో శ్రీనివాసరావు మృతి

నవతెలంగాణ-ఎర్రుపాలెం



గత కొద్ది రోజుల నుండి అనారోగ్యంతో బాధపడుతూ ఎంపీడీవో బెక్కంటి శ్రీనివాసరావు (60) గురువారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఎర్రుపాలెం మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారిగా విధులు నిర్వహిస్తూ బదిలీపై మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండల ఎంపీడీవోగా పనిచేస్తూ మృతి చెందారు. ఆయన మృతికి పలువురు సంతాపం తెలిపారు. ప్రస్తుత ఎంపీడీవో సురేందర్, తాసిల్దార్ మన్నే ఉషా శారద, ఎంపీపీ దేవర కొండ శిరీష, జడ్పిటిసి శీలం కవిత, సీపీఐ(ఎం) మండల కార్యదర్శి దివ్వెల వీరయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి తదితరులు కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు.

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

నవతెలంగాణ-ఖమ్మంరూరల్

మండల పరిధిలోని వరంగల్ క్రాస్‌రోడ్, గుర్రాలపాడు విద్యుత్తు సబ్ స్టేషన్ పరిధిలోని 11కేవీ విద్యుత్తు లైన్లో మరమ్మతు పనులు చేపడుతున్నందున ఏదులాపురం, గుర్రాలపాడు, వెంకటగిరి, గుదిమళ్ల, గ్రామాల్లో శుక్రవారం విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ క్రాంతిసింహా గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేయబడుతుందని పేర్కొన్నారు. ప్రజలు సహకరించాలని కోరారు.

పాఠశాలకు వాటర్ కూలర్, పోడియం బహూకరణ

నవతెలంగాణ-కూసుమంచి

మండలంలోని జెడ్పీహెచ్ఎస్ చేగొమ్మ పాఠశాలలో కనుకుల బిక్షపతి స్కూల్ అసిస్టెంట్ బయోసైన్స్ ఉపాధ్యాయులుగా పనిచేసి మే నెలలో పదవి విరమణ పొందారు. గురువారం పాఠశాలకు రూ.25 వేల విలువచేసే వాటర్ కూలర్‌ను, రూ.10 వేల విలువ చేసే పోడియంను పాఠశాలకు బహుకరించారు. అలాగే పాఠశాలలోని 125 మంది విద్యార్థులకు మొత్తం పదివేల రూపాయలు విలుచేసే జామెట్రీ బాక్సులను బహుకరించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు టీ.రాధాకృష్ణ, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మెన్ వీ.తిరుపమ్మ హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు టీ.చంద్రశేఖర్‌రావు, సిహెచ్.రవి కిరణ్, బి.అమ్రు, బి.యాదగిరి, వి.శ్రీనివాసరావు, ఎస్‌డి.షహనాజ్ బేగం, పి.రాజు, ఎం.ఝాన్సీ రాణి, నాన్ టీచింగ్ సిబ్బంది ఎం.అనిల్ కుమార్, బి.రామనారాయణ సింగ్, ఎండి.జాన్ పాషా పాల్గొన్నారు.

కేశవపురంలో మెడికల్ క్యాంపు

నవతెలంగాణ-కూసుమంచి

కేశవాపురం గ్రామంలో గురువారం మండల వైద్యాధికారి డాక్టర్ కిషోర్ ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కిషోర్ మాట్లాడుతూ...గ్రామంలో డెంగ్యూ జ్వరాలు లేవని, ఇక్కడ జ్వరం ఒళ్ళు నొప్పులతో బాధపడేవారు ఖమ్మంలోని ప్రైవేట్ హాస్పిటల్లో కొందరు చికిత్స తీసుకుంటున్నారు. గ్రామంలో జ్వరం, ఒళ్ళు నొప్పులతో బాధపడుతున్న వారి నుండి రక్త నమూనాలు సేకరించి, ప్రభుత్వ ఆస్పత్రికి పంపినట్టు తెలిపారు. శుక్రవారం రిపోర్టులు వస్తాయని చెప్పారు. రిపోర్టులు బట్టి ఏ జ్వరాలు అనేవి తెలుస్తోందన్నారు.

ప్రతీ సోమవారం ప్రజావాణి

నవతెలంగాణ-ముదిగొండ

మండల కేంద్రంలో ప్రజావాణి ఫిర్యాదుల కేంద్రం ఈనెల 5న ప్రారంభిస్తున్నామని ఇన్‌చార్జి తహసీల్దార్ తిరుమల కరుణాకర్‌రెడ్డి చెప్పారు. ముదిగొండ తహసీల్దార్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం ప్రజావాణి జరిగినట్లే మండలంలో కూడా ప్రతి సోమవారం ప్రజా సమస్యలపై జిల్లా కలెక్టర్ ముజమిల్ ఖాన్ ఆదేశాల మేరకు, ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నమన్నారు. ప్రజలు వారి సమస్యలపై ముదిగొండ తహసీల్దార్ కార్యాలయంలో ఉదయం 10:30 గంటల నుండి మధ్యాహ్నం 1 వరకు నేరుగా వచ్చి ప్రజలు ఫిర్యాదులు అందజేయవచ్చున్నారు.ఈ అవకాశాన్ని మండల ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

ఎర్రుపాలెం : ఈ నెల 5 వ తేదీ నుండి ప్రతి సోమవారం ఉదయం 10.30 నుండి మధ్యాహ్నం 1.00 వరకు తహసిల్దార్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ మన్నె ఉషా శారద తెలిపారు.

రైతుల రుణమాఫీ సందేహాలు తీర్చండి

- రాష్ట్ర మార్క్‌ఫెడ్‌ డైరెక్టర్‌, డీసీఎంఎస్‌ చైర్మెన్‌ కొత్వాల



నవతెలంగాణ-పాల్వంచ

రాష్ట్రంలోని కాంగ్రెస్‌ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతు రుణమాఫీ విషయంలో రైతుల్లో నెలకొన్న సందేహాలు తీర్చేందుకు వ్యవసాయ శాఖ అధికారులు, బ్యాంకు అధికారులు సమన్వయంతో పనిచేసి, రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని జిల్లా కో-ఆపరేటివ్‌ మార్కెటింగ్‌ సొసైటీ చైర్మెన్‌, రాష్ట్ర మార్క్‌ఫెడ్‌ డైరెక్టర్‌ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. రైతు రుణమాఫీ విషయమై రైతులు కొత్వాలను సంప్రదించగా గురువారం ఆయన స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ అధికారులతో ఆయన మాట్లాడారు. అనంతరం లీడ్‌ బ్యాంకు మేనేజర్‌తో మాట్లాడిన కొత్వాల బ్యాంకుల మధ్య అవగాహనా లేక రుణమాఫీ అయిన రైతుల జాబితాను ప్రకటించడం లేదని, దాని వలన రైతులు అయోమయంలో వున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారి శంభో శంకర్‌, ఏఈఓలు భాను, శాంతి, అనురిక, సొసైటీ సీఈఓ లక్ష్మీనారాయణ, డైరెక్టర్‌ చౌగాని పాపారావు, కాంగ్రెస్‌ నాయకులు గండు భరత్‌, రైతులు తదితరులు పాల్గొన్నారు.

సొసైటీ సీఈవోగా కుంచారపు



నవతెలంగాణ-ములకలపల్లి

మండల కేంద్రంలోని సొసైటీ కార్యాలయంలో గురువారం పాలకవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో గతంలో ఇన్‌చార్జి సీఈవోగా పనిచేస్తున్న సీహెచ్‌ మురళి స్థానంలో సీఈవోగా కుంచారపు శ్రీనివాసరావును సంఘం పాలకవర్గం ఏకగ్రీవంగా ఆమోదించింది. దీంతో సంఘంలో రైతులకు రుణమాఫీ సభ్యులకు తిరిగి వారి రుణమాఫీ ఇచ్చిన మొత్తాన్ని తిరిగి ఇస్తామని సొసైటీ అధ్యక్షులు సునంద తెలిపారు. ఈ కార్యక్రమంలో పాలకవర్గసభ్యులు, నూతన సీఈవో పాల్గొన్నారు.

రిజర్వేషన్లకు భంగం

- సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తాం
- మాల మహానాడు జాతీయ అధ్యక్షులు చెన్నయ్య

నవతెలంగాణ-పాల్వంచ

సుప్రీం కోర్టు ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్లపై గురువారం ఇచ్చిన తీర్పు రిజర్వేషన్లకు భంగం కలిగించేలా ఉన్నాయని మాల మహానాడు జాతీయాధ్యక్షులు జి.చిన్నయ్య అన్నారు. పాల్వంచలో ఒక ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొనటానికి మాల ప్రజా సంఘాల జేఏసీ వర్కింగ్‌ చైర్మెన్‌ బూర్గుల వెంకటేశ్వర్లుతో కలిసి వచ్చిన ఆయన విలేకరుల సమావేశంలో సుప్రీంకోర్టు తీర్పు పై మాట్లాడారు. ఆర్టికల్‌ 341కి విరుద్ధంగా రాజకీయ ప్రమేయం ఉండేలా ఉందని, రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీసేలా ఉందని న్యాయనిపుణులతో చర్చించిన అనంతరం సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని పేర్కొన్నారు. ఈ నెల 8, 9, 10 తేదీలలో ఢిల్లీలో నిరసన చేపడతామన్నారు. ఈ సమావేశంలో మాల విద్యుత్‌ ఉద్యోగుల సంఘం జాతీయ అధ్యక్షులు బూర్గుల విజయ్‌ భాస్కర్‌, వరకోటి శ్రీనివాస్‌, నల్లబెల్లి రాంబాబు, నాగయ్య, సృజన తదితరులు పాల్గొన్నారు.

మణుగూరు సుప్రీం కోర్టు ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్లపై గురువారం ఇచ్చిన తీర్పు ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్లకు భంగం కలిగించేలా ఆర్టికల్‌ 341కి విరుద్ధంగా రాజకీయ ప్రమేయం ఉండేలా ఉందని, రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీసేలా ఉందని, న్యాయనిపుణులతో చర్చించిన అనంతరం సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని మాల మహానాడు జాతీయ అధ్యక్షులు జి.చెన్నయ్య పేర్కొన్నారు. గురువారం మణుగూరులో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. మాల ప్రజా సంఘాల జేఏసీ వర్కింగ్‌ చైర్మెన్‌ బూర్గుల వెంకటేశ్వర్లుతో కలిసి వచ్చిన ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఈ సమావేశంలో మాలమహానాడు జిల్లా, మండల నాయకులు గులగట్టు ఎల్లయ్య, పీర్నాకి నవీన్‌, విల్సన్‌, వేర్పుల నరేష్‌, దాసరి యేసురత్నం తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) సీనియర్‌ నాయకుడు ఖాదర్‌ బాబుకు అస్వస్తత

- పరామర్శించిన పార్టీ బృందం



నవతెలంగాణ-ఇల్లందు

సీపీఐ(ఎం) సీనియర్‌ నేత, సింగరేణి రిటైర్డ్‌ క్లర్క్‌ ఖాదర్‌ బాబు అనారోగ్యానికి గురై ఖమ్మం జాగృత్‌ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న సీపీఐ(ఎం) మండల నాయకులు గురువారం పరామర్శించారు. ఖాదర్‌ బాబు త్వరగా కోలుకుంటారని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం వైద్యులతో మాట్లాడి వారికి మెరుగైన చికిత్స అందించాలని కోరారు. వారి ఆరోగ్యం మెరుగైందని, ఏమీ పరవాలేదని వైద్యులు తెలిపారన్నారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి అబ్దుల్‌ నబి, తాళ్లూరి కృష్ణ, మన్యం మోహన్‌, ఆలేటి కిరణ్‌ కుమార్‌, ప్రముఖ జర్నలిస్టు దాస్యం సురేంద్ర బాబు తదితరులు పాల్గొన్నారు.


ఆంటీ నార్కోటిక్‌ డ్రగ్స్‌ డాగ్‌ టీం తనిఖీలు

నవతెలంగాణ-ఇల్లందు

ఎస్పీ రోహిత్‌ రాజ్‌ ఆదేశాల మేరకు డీఎస్పీ ఎన్‌.చంద్రబాను ఆధ్వర్యంలో సీఐ బత్తుల సత్యనారాయణ సిబ్బందితో కలిసి గురువారం పట్టణంలో ఆంటీ నార్కోటిక్‌ డ్రగ్స్‌ డాగ్‌ టీంతో కలిసి తనిఖీలు నిర్వహించారు. అనుమానిత ప్రదేశాలైన బస్‌ స్టేషన్‌, వైన్‌ షాపులు, దాసరి గడ్డ ఏరియాలలో నిశితంగా పరిశీలించారు. ఏరియాలవారికి మత్తు పదార్థాల వలన జరుగు నష్టాల పైన అవగాహనా ప్రోగ్రాం కల్పించారు. ఈ కార్యక్రమానికి సీఐ బత్తుల సత్యనారాయణ, ఎస్‌ఐ సూరి, ఏఎస్‌ఐలు నాగేశ్వరరావు, అబ్దుల్‌ ఘనితో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

వ్యవసాయ రంగానికి అధిక నిధులు కేటాయించాలి

- రైతు సంఘం మండల అధ్యక్షులు సత్యనారాయణ



నవతెలంగాణ-దుమ్ముగూడెం

ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను సవరించి వ్యవసాయ రంగానికి అధిక నిధులు కేటాయించాలని తెలంగాణ రైతు సంఘం మండల అధ్యక్షులు బొల్లి సత్యనారాయణ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్‌ చేశారు. గురువారం ఆ సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో తూరుబాక గ్రామంలోని భద్రాచలం చర్ల ప్రధాన రహదారిపై కేంద్ర బడ్జెట్‌ ప్రతుల్ని తగులబెట్టి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ ఇటీవల కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌ వ్యవశాయ రంగానికి భారతదేశ రైతాంగానికి భారంగా ఉందని, తక్షణమే బడ్జెట్‌ను సవరించి, నిధులు కేటాయించాలని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌ ప్రభుత్వం ఎన్నికల హామీల్లో ఇచ్చినటువంటి వాగ్దానాలను అమలు చేయాలని, రెండు లక్షల రుణమాఫీ మొత్తం మాఫీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు స్థానిక రైతులు బిల్లా ముత్యాలరావు, గంప నాగిరెడ్డి, బొల్లి సాయిబాబు, కందుల నరసింహారావు, బొల్లి ఖాదర్‌ బాబు, బూడిద ప్రసాద్‌, చెలికాని వెంకన్న, బిళ్ళ దివాకర్‌ రావు పాల్గొన్నారు.

పిసా చట్టాన్ని అబాసు పాలు చేసిన గ్రామసభ : టీడీపీ



నవతెలంగాణ భద్రాచలం రూరల్‌

భద్రాచలం ఏజెన్సీ చట్టాలను తుంగలో తొక్కి దళారులతో అధికారులు కుమ్మక్కై, తూతూ మంత్రంగా గ్రామపంచాయతీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన గ్రామ సభను రద్దుచేసి తిరిగి ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి పర్యవేక్షణలో గ్రామ సభ నిర్వహించాలని తెలుగుదేశం పార్టీ పార్లమెంట్‌ ప్రధాన కార్యదర్శి షేక్‌ అజీమ్‌ డిమాండ్‌ చేశారు. భద్రాచలం పట్టణంలో అనేక సమస్యలు పేరుకుపోయి ఉంటే ఇసుక రీచ్‌ కోసం ఇంత హడావుడిగా అధికారులు గ్రామసభ పెట్టడంపై మర్మం ఏమిటంటే అని ప్రశ్నించారు. పీసా చట్టం ప్రకారం గ్రామసభ నిర్వహించాలంటే కనీసం స్థానిక ప్రజలు 400 మంది గ్రామసభకు హాజరు కావలసి ఉండగా ఇసుక దళారులతో చేతులు కలిపి బూర్గంపాడు మండలం నుండి 200 మంది కూలీలను ఆంధ్ర ప్రాంతం నుండి 200 మందిని తీసుకొచ్చి నిబంధనలకు విరుద్ధంగా గ్రామసభ నిర్వహించారని ఆరోపించారు. వెంటనే గ్రామ సభను రద్దుచేసి ప్రాజెక్ట్‌ అధికారి రాహుల్‌ నేతృత్వంలో తిరిగి మళ్లీ గ్రామసభ నిర్వహించి నిబంధన ప్రకారం ఇసుక రీచ్‌లను కేటాయించాలన్నారు. లేనిపక్షంలో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ప్రత్యక్ష పోరాటాలకు దిగుతామని హెచ్చరించారు. తెలుగుదేశం పార్టీ సీనియర్‌ నాయకులు కోడాల శ్రీనివాసన్‌, నాయకులు కంభంపాటి సురేష్‌ కుమార్‌, కుంచాల రాజారాం, కోనేరు రాము, అభినేని శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

గురుకులంలో ర్యాగింగ్‌ కలకలం...

ఆత్మహత్యాయత్నం చేసిన ఇంటర్‌ మొదటి సంవత్సరం విద్యార్థిని

- బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి
- వామపక్ష ప్రజా సంఘాలు
- విద్యార్థినిని పరామర్శించి విచారణ చేపట్టిన పీఓ





నవతెలంగాణ-భద్రాచలం రూరల్‌

భద్రాచలం పట్టణ నడిబొడ్డున ఉన్నటువంటి తెలంగాణ ట్రైబల్‌ వెల్ఫేర్‌ గురుకుల పాఠశాలలో ర్యాగింగ్‌ కలకలంతో ఇంటర్మీడియట్‌ మొదటి సంవత్సరం విద్యార్థిని ఆత్మహత్యాయత్నం చేసిన సంఘటన చోటుచేసుకుంది. దుమ్ముగూడెం మండలం కొత్త మారేడు బాక గ్రామానికి చెందిన కట్టం ఆశ్రిత భద్రాచలం పట్టణంలోని చర్ల రోడ్డులో గల ట్రైబల్‌ వెల్ఫేర్‌ గురుకుల పాఠశాలలో ఇంటర్మీడియట్‌ మొదటి సంవత్సరం బైపీసీ కోర్సు తీసుకుని 15 రోజుల క్రితమే కళాశాల హాస్టల్‌లో జాయిన్‌ కాగా జాయిన్‌ అయిన నాటి నుండి సీనియర్‌ సీఈవో విద్యార్థినీలు అనేక విధాలుగా పదేపదే ఇబ్బందులకు గురి చేస్తూ ఏడిపించడంతో మనస్థాపానికి గురైన ఆశ్రిత తన తల్లితండ్రులకు చెప్పుకున్నా ఫలితం లేకపోవడంతో బుధవారం మధ్యాహ్నం నాలుగు గంటల సమయంలో బ్లేడుతో గొంతు, చెయ్యినీ తీవ్రంగా కోసుకొని ఆత్మహత్యయత్నానికి ప్రయత్నించింది. తీవ్ర రక్తస్రావం కావడంతో తోటి విద్యార్థులు గమనించి ప్రిన్సిపాల్‌కి తెలియజేయగా హుటాహుటిన ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు.

కుటుంబ సభ్యులకు తప్పడు సమాచారం అందించిన ప్రిన్సిపాల్‌

ఆత్మహత్యా ప్రయత్నం చేసుకున్న ఆశ్రిత తల్లికి కళాశాల నుండి చరవాణి ద్వారా సమాచారం అందించిన ప్రిన్సిపాల్‌ తీవ్రమైన జ్వరంతో బాధపడుతుంటే ఆసుపత్రిలో జాయిన్‌ చేశామని తప్పుడు సమాచారం ఇచ్చారని అశ్విత కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. అశ్విత చేరిన నాటి నుండి పలు విధాలుగా సీనియర్‌ విద్యార్థులు వేధిస్తున్నా ప్రిన్సిపాల్‌ పట్టించుకోలేదని ఆ ఫలితంగానే తన కూతురు ఆత్మహత్య ప్రయత్నం చేసిందని తల్లి పీఓ రాహుల్‌కి ఫిర్యాదు చేశారు. ఈ ఘటనకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ప్రిన్సిపాల్‌ పై చర్యలు తీసుకోవాలని కన్నీరు మున్నీరై విలపిస్తూ అధికారులను వేడుకున్నారు.

విద్యార్థినీని పరామర్శించి, విచారణ చేపట్టిన పీఓ

సంఘటన తెలుసుకున్న భద్రాచలం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్‌ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి వచ్చి విద్యార్థినీతో మాట్లాడి జరిగిన విషయాలన్నిటినీ తెలుసుకొని అశ్రితకు మెరుగైన వైద్యాన్ని అందించాలని వైద్యులను ఆదేశించారు. భవిష్యత్తులో కళాశాలలో ఇటువంటి సంఘటన జరగకుండా చూసుకుంటామని, ఆశ్రిత మనోధైర్యం చెడకుండా విద్యని అభ్యసించి ఉన్నత స్థాయికి ఎదగాలని అశ్వితకు పీఓ ధైర్యం చెప్పి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని తల్లితండ్రులకు హామీ ఇచ్చారు. అనంతరం గురుకుల కళాశాలకు వెళ్లిన పీఓ సంఘటనపై పూర్తిస్థాయిలో వివరాలు సేకరించారు. తోటి విద్యార్థులను సైతం సంఘటనపై అడిగి తెలుసుకున్నారు.

వామపక్ష ప్రజాసంఘాల ఆందోళన



జరిగిన సంఘటనపై వామపక్ష ప్రజా సంఘాలు ఆందోళన చేపట్టాయి. అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం పట్టణ కార్యదర్శి డి.సీతాలక్ష్మి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నాదెండ్ల లీలావతితో కూడిన మహిళా సంఘం బృందం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి వెళ్లి విద్యార్థినితో మాట్లాడి తనకు మనోధైర్యాన్ని నింపి, జరిగిన సంఘటనపై పూర్తి విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు చేపట్టాలని పీఓ బి.రాహుల్‌కి విన్నపించారు. అంతేకాకుండా వామపక్ష విద్యార్థి సంఘాలైన ఎస్‌ఎఫ్‌ఐ పీడీఎస్‌యూ, ఏఎస్‌ఎఫ్‌ విద్యార్థి సంఘాలు హాస్పటల్‌ ఆవరణకు చేరుకొని ఆశ్రితను పరామర్శించారు. ప్రిన్సిపాల్‌ పై చర్యలు చేపట్టాలని ఆర్సిఓ పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి నివేదిక ప్రాజెక్టు అధికారికి ఇచ్చి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆందోళన చేపట్టారు.

పునరావాస కేంద్రాన్ని కొనసాగించాలి

- జాయింట్‌ కలెక్టర్‌కు సీపీఐ(ఎం) వినతి



నవతెలంగాణ-పాల్వంచ

కొత్తగూడెం మున్సిపాలిటీలోని పాత కొత్తగూడెం దళితుల కోసం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని కొనసాగించాలని సీపీఐ(ఎం) కొత్తగూడెం పట్టణ కార్యదర్శి లిక్కీ బాలరాజు డిమాండ్‌ చేశారు. ఈ మేరకు కలెక్టరేట్‌లోనిలోని జాయింట్‌ కలెక్టర్‌ వేణుగోపాల్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాత కొత్తగూడెంలోని ఎస్సీ కాలనీ సుమారు 40 ఏండ్ల కిందట నిర్మించడం వల్ల అవి శిథిలా వ్యవస్థకు గురయ్యాయని వర్షం వస్తే ఆ ఇళ్లల్లో నివాసం ఉండడం వీలుకాదని వాపోయారు. ఇంటి పై పెచ్చులు ఊడి మీద పడే ప్రమాదం ఉందని ప్రతి ఏటా వర్షం వస్తే వారికి ఇవే ఇబ్బందులు ఎదురవుతున్నాయని అన్నారు. అందుకనే ప్రతి సంవత్సరం మున్సిపల్‌ అధికారులు 60 కుటుంబాల కోసం పాత కొత్తగూడెంలోని తెలంగాణ స్కూల్లో పునరావాస కేంద్రాన్ని ఏర్పాటు చేసి షెల్టర్‌ ఇస్తున్నారని ఈ సంవత్సరం కూడా పునరావస కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. 10 రోజులు మాత్రమే ఈ కేంద్రంలో ఉంచి ప్రస్తుతం వారిని ఎవరి ఇళ్లకు వాళ్లను వెళ్లిపొమ్మని చెప్పారని అన్నారు. వర్షాలు తగ్గక ముందే వారిని ఇళ్లకు పంపించడం ద్వారా ఒక సమయంలో ప్రమాదం జరిగి ప్రజలు ప్రాణానికి ముప్పు వచ్చే అవకాశం ఉందని అన్నారు. సమస్యకు శాశ్వత పరిష్కారం, కాలనీవాసులకు పక్కా ఇంటి నిర్మాణం చేపట్టి ఇందిరమ్మ ఇల్లు మొదట పాత కొత్తగూడెం దళిత కాలనీ కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ కమిటీ సభ్యురాలు సందకూరి లక్ష్మీ, నాయకులు కలంగి హరికృష్ణ, మంద నాగకృష్ణ, రాజేష్‌, గుర్రం వరలక్ష్మీ, గంగాపురి, జ్యోతి, బొమ్మెర ప్రమీల, మంద శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురు మావోయిస్టులు, ఒక సానుభూతిపరుడి అరెస్టు

- వివరాలు వెల్లడించిన ఎస్పీ



నవతెలంగాణ-కొత్తగూడెం

ఏసీఎంతో సహా ముగ్గురు మావోయిస్టులు, ఒక సానుభూతిపరుడిని అరెస్టు చేసినట్టు ఎస్పీ రోహిత్‌రాజు తెలిపారు. గురువారం ఎస్పీ కార్యాలయంలో అరెస్టు చేసిన మావోయిస్టుల వివరాలు వెల్లడించారు. దామరతోగు అటవీ ప్రాంతంలో జరిగిన ఎదురుకాల్పులలో తప్పించుకొని పారిపోయిన నిషేధిత మావోయిస్టుల ఆచూకి కోసం గుండాల పోలీస్‌ స్టేషన్‌ పరిధిలోని దామరతోగు అటవీ ప్రాంతంలో పోలీసు బలగాలను మోహరించి గాలింపు చర్యలు చేపట్టడం జరిగింది. దామరతోగు అటవీ ప్రాంతంలో జిల్లా స్పెషల్‌ పార్టీ పోలీసులు కూంబింగ్‌ నిర్వహిస్తుండగా గురువారం తెల్లవారు జామున ముగ్గురు మగ వ్యక్తులు, ఒక మహిళ పోలీసులను గమనించి పారిపోయేందుకు ప్రయత్నించారు. అనుమానాస్పదంగా ఉన్న వారిని విచారించగా వారిలో ఇద్దరు మగ వ్యక్తులు, ఒక ఆడ వ్యక్తి నిషేధిత సిపిఐ మావోయిస్టు పార్టీ దళ సభ్యులని, మరొక మగ వ్యక్తి గుండాల మండలం దామరతోగు గ్రామానికి చెందిన నిషేధిత సిపిఐ మావోయిస్టు పార్టీ సానుభూతిపరుడని తేలిందన్నారు.

పట్టుబడిన వారి వివరాలు

ఛత్తీస్గఢ్‌ రాష్ట్రం, బీజాపూర్‌, కుట్ర పోసుస్టేషన్‌ పరిధికి చెందిన పొట్టం రాజు అలియాస్‌ జోగా అని తెలిపారు. ఇతను 2016వ సంవత్సరం నుంచి నిషేధిత సిపిఐ మావోయిస్టు పార్టీలో పనిచేస్తున్నాడని చెప్పారు. 2022లో ఏసీఎంగా ప్రమోషన్‌ పొందాడని చెప్పారు. తెలంగాణ, ఛత్తీస్గఢ్‌ రాష్ట్రాల్లో దాదాపు 42 హింసాత్మక సంఘటనలలో పాల్గొన్నాడని చెప్పారు. ఇతని వద్ద నుండి ఒక మారణాయుధాన్ని, దానికి సంభంధించిన 29 రౌండ్లు గల రెండు లోడెడ్‌ మాగ్జిన్స్‌, పాచ్‌, బిలీవ్‌ గ్రీన్‌ కలర్‌ యూనిఫోర్స్‌ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఛత్తీస్గఢ్‌ రాష్ట్రం, బీజాపూర్‌ జిల్లా బైరాంఘడ్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలోని కోల్నార్‌ గ్రామంకు చెందిన ఓయం పొండు అని, ఇతను డిసెంబర్‌ 2021 వ సంవత్సరం నుంచి నిషేధిత సిపిఐ మావోయిస్టు పార్టీలో సెంట్రల్‌ రీజినల్‌ కంపెనీలో దళ సభ్యుడిగా చేరినాడు, తెలంగాణ, ఛత్తీస్గఢ్‌ రాష్ట్ర మావోయిస్టు పార్టీ సాయుధ దళ సభ్యులతో కలిసి తెలంగాణ, ఛత్తీస్గఢ్‌ రాష్ట్రాల్లో 19 హింసాత్మక సంఘటనలలో పాల్గొన్నాడని తెలిపారు. ఇతని వద్ద నుండి ఆలీవ్‌ గ్రీస్‌ కలర్‌ యూనిఫోర్మ్‌, 12 రౌండ్లు 303, రెండు చార్జర్‌ క్లిప్పులు, పౌచ్‌ స్వాధీనం చేసుకోవడం జరిగింది. తెలంగాణ రాష్ట్రం ములుగు జిల్లా, దూదేకుల పల్లి గ్రామంకు చెందిన పూనెం చుక్కి అలియాస్‌ తేజ అలియాస్‌ జోగి అని చెప్పారు. ఈమె 2023 నుంచి నిషేధిత సిపిఐ మావోయిస్టు పార్టీలో తెలంగాణ, ఏటూరు నాగారం మహాదేవపూర్‌ ఏరియా కమిటీలో దళ సభ్యురాలిగా చేరిందని, మావోయిస్టు పార్టీ సాయుధ దళ సభ్యులతో కలిసి తెలంగాణ, ఛత్తీస్గఢ్‌ రాష్ట్రాల్లో 3 హింసాత్మక సంఘటనలలో పాల్గొన్నదని తెలిపారు. ఈమె వద్ద నుండి ఒక గొడ్డలిని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, గుండాల మండలం, దామరతోగు గ్రామంకు చెందిన శ్యామల ముఖేష్‌ అని, ఇతను గత కొంతకాలంగా నిషేధిత సిపిఐ మావోయిస్టు పార్టీ సానుభూతిపరుడుగా పనిచేస్తున్నాడని చెప్పారు. వీరిపై గుండాల పోలీస్‌ స్టేషన్‌ నందు కేసు నమోదు చేయబడినది. చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

ఉద్యోగ జీవితంలో బదిలీ ప్రక్రియ సర్వసాధారణం

ఎంతకాలం పనిచేశామన్నది కాదు...ఎంత మేలు చేశాం అన్నది ముఖ్యం

బదిలీపై వెళ్తున్న జీసీసీ మేనేజర్‌కి ఘన సన్మానం







నవతెలంగాణ-దమ్మపేట

ఉద్యోగ జీవితంలో బదిలీ ప్రక్రియ అనేది సర్వసాధారణమని, ఎంత సుదీర్ఘకాలం ఒకే ప్రాంతంలో పనిచేశామనేది ముఖ్యం కాదని, ఎంతమంది ప్రజలకు తన ఉద్యోగ హోదా ద్వారా మేలు జరిగిందనేదే ముఖ్యమని దమ్మపేట జడ్పీటీసీ పైడి వెంకటేశ్వరరావు, సొసైటీ చైర్మెన్‌ వెళ్లిన రాఘవరావు, మండల కాంగ్రెస్‌ నాయకులు రావు గంగాధర్‌ రావు, కాంగ్రెస్‌ పార్టీ యువజన నాయకుడు చామర్తి గోపి శాస్త్రి, మార్కెట్‌ యార్డ్‌ మాజీ వైస్‌ చైర్మెన్‌ కొయ్యల అత్యుత్తరావు, మాజీ ఆత్మ కమిటీ చైర్మెన్‌ కేవీ సత్యనారాయణ, ఆదర్శ రైతు అంకత ఉమామహేశ్వరరావు, సీపీఐ(ఎం) నాయకులు మోరంపూడి శ్రీనివాసరావు, దొడ్డ లక్ష్మీనారాయణ, వైస్‌ ఎంపీపీ దారా మల్లికార్జునరావు, హమాలీ వర్కర్స్‌ యూనియన్‌ నాయకులు భోగం సత్యం, దమ్మపేట ప్రెస్‌ క్లబ్‌ సభ్యులు స్పష్టం చేశారు. గురువారం గత ఏడేండ్లుగా జీసీసీ బ్రాంచ్‌ మేనేజర్‌గా బాధ్యతలు నిర్వహించిన మేనేజర్‌ సుగ్గల నరసింహారావు, అకౌంటెంట్‌ యార్లగడ్డ పోలా రావు బదిలీపై ఇల్లెందు జీసీసీ బ్రాంచ్‌ మేనేజర్‌గా నరసింహారావు, పూసగూడెం సేల్స్‌ మాన్‌గా యార్లగడ్డ పోలా రావు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా దమ్మపేట జీసీసీ కార్యాలయ ఆవరణలో జీసీసీ ఉద్యోగులు సిబ్బంది, హమాలీల ఆధ్వర్యంలో బదిలీ వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం నూతన మేనేజర్‌ పాపారావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా పైన పేర్కొన్న ప్రముఖులు మాట్లాడారు. జీసీసీ కార్యాలయ ప్రాంగణంలో శ్రీ విజయ మహాగణపతి మరి భక్తాంజనేయ స్వామి దేవాలయ మందిరాల నిర్మాణానికి ఎనలేనిలేని కృషి సుగ్గల చేశారని, కరోనా సమయంలో సైతం అద్భుతమైన సేవలను ప్రజలకు అందించారని, జీసీసీ ద్వారా ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను అత్యంత సమర్థవంతంగా నిర్వహించడమే కాకుండా రాష్ట్రంలోనే ధాన్యం కొనుగోలు ద్వారా దమ్మపేట జీసీసీ బ్రాంచ్‌ మొదటి స్థానంలో ఉండే విధంగా నరసింహారావు కృషి అమోఘమన్నారు. దమ్మపేట, అన్నపురెడ్డిపల్లిలో జీసీసీ సంస్థ ద్వారా పెట్రోలు బంకులు ఏర్పాటుచేసి పలువురు గిరిజన యువకులకు ఉపాధి కల్పించడంలో ఆయన సేవలు మరవలేనివన్నారు. జీసీసీ ద్వారా అవుట్‌ సోర్సింగ్‌ సేల్స్‌ మాన్‌ నియమించటం వలన సుగ్గలచొరవ చెప్పుకోదగిందని, నిరంతరం రైతులకు అందుబాటులో ఉండి వారికి సలహాలు, సూచనలు ఇవ్వటమే కాకుండా జీసీసీ ద్వారా వచ్చే నూతన ఉత్పత్తులను ప్రజలకు పరిచయం చేయటంలో నరసింహారావు విజయం సాధించారన్నారు. తన ఉద్యోగ జీవితంలో కర్తవ్యాన్ని నిబద్ధతతో ప్రణాళిక బద్ధంగా వ్యవహరించి మండల ప్రజల మనసుల్లోనే కాక దమ్మపేట జీసీసీ బ్రాంచి పరిధిలో ఉన్న అన్ని మండలాల గిరిజన ఇతర సామాజిక వర్గాల ప్రజల హృదయాలలో మేనేజర్‌ సుగ్గల నరసింహారావు సుస్థిర స్థానం సంపాదించుకోవటం కొంతమందికే సాధ్యపడుతుందన్నారు. అలాంటి వారిలో సుగ్గల నరసింహారావు మొదటి వరుసలో ఉంటారని, మండల ప్రముఖులు కొనియాడారు. అనంతరం నరసింహారావు, పోలారావుని పూలమాలలు వేసి, శాలువాతో సత్కరించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గొట్టుపట్టి యోగానంద రావు, ఎర్ర వసంతరావు, ఎర్ర గొర్ల రాధాకృష్ణ, రాచూరి వేణుగోపాలరావు, ఏలూరి సత్యబాబు, జీసీసీ ఉద్యోగులు దీప లాల్‌, భూక్య కృష్ణ, సున్నం భీమరాజు, పుల్లారావు, మేకల రమేష్‌, కాకా శ్రీనివాసరావు, రాము నాయక్‌, సీఐటీయూ నాయకులు భోగం నరసింహారావు, మారేష్‌ కొప్పులు శ్రీనివాసరావు, పసుమర్తి నాగేశ్వరరావు, దండు శ్రీనివాసరావు, పులి శ్రీనివాసరావు, రొయ్యల ప్రసాద్‌, నాగరాజు, వీర్రాజు, జంగాల సర్వేశ్వరరావు, మాడ హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సీనియర్‌ న్యాయవాది మృతికి సంతాపం



నవతెలంగాణ-భద్రాచలం రూరల్‌

కొత్తగూడెం బార్‌ అసోసియేషన్‌ సభ్యులు, సీనియర్‌ న్యాయవాది వట్టికొండ సురేష్‌ బాబు మరణానికి చింతిస్తూ భద్రాచలం బార్‌ అసోసియేషన్‌ సంతాపం ప్రకటిస్తూ గురువారం మౌనం పాటించారు. ఈ సందర్భంగా బార్‌ అసోసియేషన్‌ అధ్యక్షులు టి.చైతన్య మాట్లాడుతూ... సురేష్‌ బాబు గత 60 సంవత్సరాలకి పైగా న్యాయవాది వృత్తిలో కొనసాగుతూ కక్షిదారులకు ఎనలేని సేవలు అందించారని, ఆయన మరణం తీరని లోటు అని అన్నారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం జ్యూడిషియల్‌ ప్రథమశ్రేణి న్యాయమూర్తి ఎం.వెంకటేశ్వర్లు, సీనియర్‌ న్యాయవాదులు ఎం.వి.ప్రసాదరావు, శ్రీ రావి రామ్‌ మోహన్‌ రావు, ఆర్‌.జయరాజు, శ్రీమన్నారాయణ, బండారు అరుణ్‌ చంద్‌, పి.శ్రీనివాసాచారి, కె.నవీన్‌, పామరాజు తిరుమలరావు, పి.మస్తాన్‌ బాబు, మల్లేష్‌, విద్యాధరి, అరుణశ్రీ, ఎం.వి.రమ, మాధవి, తదితర న్యాయవాదులు పాల్గొన్నారు.

గిరిజన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలి

- ఐటీడీఏ పీవో బి.రాహుల్‌



నవతెలంగాణ-భద్రాచలం రూరల్‌

గిరిజన ఆచార వ్యవహారాలు సంస్కృతి సాంప్రదాయాలు వారి జీవనశైలికి సంబంధించిన చిత్రకళా రూపాలు సహజత్వాన్ని, చిత్రకళారూపాలలో జీవత్వము ఉట్టిపడేలా తయారు చేయాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్‌ అన్నారు. గురువారం ఐటిడిఏ ప్రాంగణంలోని నాయకపోడు తయారీ కేంద్రం కోయా కల్చర్‌కి సంబంధించిన తయారీ కేంద్రంలోని చిత్రకళారూపాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఉమ్మడి ఖమ్మం జిల్లాలో నివసిస్తున్న ఆదివాసీ గిరిజన కుటుంబాలలో ఆచార వ్యవహారాలు, వారి వన్షైలి మామూలు ప్రజానీకం కంటే చాలా కట్టుదిట్టంగా భిన్నంగా ఉంటాయని అన్నారు. ఐటీడీఏ కార్యాలయానికి ప్రముఖులు సందర్శించినప్పుడు సహజత్వంగా ఉండే కళారూపాలను వారికి అందజేస్తే ఆదివాసీ గిరిజనుల సంస్కృతి, సాంప్రదాయాలు వారు తెలుసుకునే అవకాశం ఉంటుందన్నారు. ఇక్కడ తయారు చేస్తున్న ప్రతి కళారూపం ప్రతిభ రాష్ట్రంలోనే కాక ఇతర దేశాలలో కూడా ప్రాచుర్యం పొందుతుందని ఆయన అన్నారు. సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్‌ డేవిడ్‌ రాజ్‌, మ్యూజియం ఇన్‌చార్జి వీరాస్వామి, రామ్‌ కుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

ఇల్లందులో 133 శాతం బొగ్గుత్పత్తి : జీఎం

నవతెలంగాణ-ఇల్లందు

నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి 2.59 లక్షల టన్నులకు గాను జూలై నెలలో 3.41 లక్షల టన్నుల బొగ్గు తీసి మొత్తం 133 శాతం ఉత్పత్తి చేసినట్టు జీఎం జాన్‌ ఆనంద్‌ తెలిపారు. స్థానిక కార్యాలయంలో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జులై నెల బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకత వివరాలను ఏరియా జీఎం తెలిపారు. 0.39 లక్షల టన్నుల బొగ్గు రైల్వే మార్గం ద్వారా, 0.36 లక్షల టన్నులు రోడ్డు మార్గం ద్వారా, ఆర్‌సీహెచ్‌పీ ద్వారా 2.27 లక్షల టన్నులు మొత్తం 3.02 లక్షల టన్నుల బొగ్గు బట్వాడా చేసినట్టు తెలిపారు. జూలై నెలలో 10 రేకుల ద్వారా బొగ్గు రవాణా చేసామని తెలిపారు. అదేవిధంగా ఇల్లందు ఏరియాకు కేటాయించిన వార్షిక బొగ్గు లక్ష్యం 11.80 లక్షల టన్నులకు గాను 13.47 లక్షల టన్నులు బొగ్గు ఉత్పత్తి చేసి 114 శాతంతో నిలిచిందన్నారు. రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తికి కృషి చేసిన సంబంధిత అధికారులు, సూపర్వైజర్స్‌, యూనియన్‌ నాయకులకు, ఉద్యోగులకు జీఎం ప్రత్యేకం అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యస్‌ఓటూ జీఎం మల్లారపు మల్లయ్య, ఏజీఎం(ఐఈ) గిరిధర్‌ రావు, డీజీఎం(పర్సనల్‌)జివి మోహన్‌ రావు, డిజియం(సివిల్‌) రవికుమార్‌, సీనియర్‌ పర్సనల్‌ అధికారి సాయి స్వరూప్‌ తదితరులు పాల్గొన్నారు.

మత్తుపదార్థాల నిషేధంపై అవగాహన కలిగి ఉండాలి : ఎస్సై

బూర్గంపాడు : మండల పోలీసుల బృందం ఎస్పీ రోహిత్‌ రాజ్‌ ఆధ్వర్యంలో బూర్గంపాడులో గల ఐటీసీ ఎంఎస్‌కే, ప్రథమ్‌ వత్తి విద్యా శిక్షణ కేంద్రం నందు యువతలో మాదకద్రవ్యాల నివారణ, రోడ్డు భద్రతా జాగ్రత్తలపై అవగాహన సదస్సు ఎస్‌ఐ నాగ భిక్షం బృందంతో నిర్వహించారు. గంజాయి, మాదకద్రవ్యాల వినియోగం ద్వారా కలిగే నష్టాలను, వీటి వలన వచ్చే అనర్థాలను ప్రతి విద్యార్థి తప్పనిసరిగా తెలుసుకోవాలని సూచించారు. ఈ సదస్సుకు ఏఎస్‌ఐ సత్యం, హెడ్‌ కానిస్టేబుల్‌ వెంకటేశ్వర్లు, ఐటీసీ ఎంఎస్‌కే ప్రథమ్‌ వొకేషనల్‌ సెంటర్‌ భద్రాచలం క్లస్టర్‌ హెడ్‌ నరేష్‌కుమార్‌, ఉపాధ్యాయులు, ఎలక్ట్రికల్‌ సెంటర్‌ విద్యార్థులు పాల్గొన్నారు.

ఆరు గ్యారెంటీ హామీలను వెంటనే అమలు చేయాలి



నవతెలంగాణ -చర్ల

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను వెంటనే అమలు చేయాలని చర్ల తహసీల్దార్‌కి సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో మెమోరాండం ఇచ్చారు. అనంతరం సీపీఐ(ఎం) మండల కార్యదర్శి మచ్చ రామారావు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. మహిళలకు నెలకి 2500 పింఛను, గ్యాస్ సిలిండర్ రూ.500, అదే విధంగా అర్హులైన నిరుపేదలకు రేషన్ కార్డుల పంపిణీ చేయాలని, ఇల్లు లేని వాళ్లకు ఇళ్ల స్థలాలు,స్థలం ఉన్న వారికి ఐదు లక్షల రూపాయలు వెంటనే అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు బందెల చంటి, పార్టీ సభ్యులు కర్ల నాగేశ్వరరావు, ఆనంద్ కాలనీ గ్రామస్తులు పాల్గొన్నారు.



నేడే జాతీయ జెండా ఎగురవేసిన ధీరుడు హరికిషన్ సింగ్ సూర్జిత్

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు లిక్కి బాలరాజు

నవతెలంగాణ-కొత్తగూడెం

12 సంవత్సరాల వయస్సులో బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా పోరాటం చేసి, లాఠీల దెబ్బలు, బుల్లెట్ల మోతల మధ్య బ్రిటిష్ జెండాను తొలిగించి జాతీయ జెండాను ఎగరేసిన ధీరుడు హరికిషన్ సింగ్ సుర్జీత్ అని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు లిక్కి బాలరాజు అన్నారు. గురువారం స్థానిక మంచికంటి భవన్‌లో సుర్జిత్ వర్ధంతి కార్యక్రమం జరిగింది. ముందుగా సూర్జిత్ చిత్ర పటానికి సీనియర్ నాయకులు జూనుమాల నగేష్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాలరాజు మాట్లాడుతూ సూర్జిత్ కమ్యూనిస్ట్ నవరత్నాలలో ఒకరని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు రేపాకుల శ్రీనివాస్, టౌన్ కమిటీ సభ్యురాలు సందకూరి లక్ష్మి, నాయకులు మంద నాగకృష్ణ, విజయమోహన్ సింగ్, సతీష్, సలీం, రాజేశ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి బొగ్గు బ్లాకుల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా అసెంబ్లీలో తీర్మానం చేయాలి

నవతెలంగాణ-కొత్తగూడెం

సింగరేణి బొగ్గు బ్లాక్‌ల ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేసి పార్లమెంటుకు పంపించాలని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ బ్రాంచ్ వైస్ ప్రెసిడెంట్ వై.వెంకటేశ్వరావు డిమాండ్ చేశారు. గురువారం సింగరేణి కార్పోరేట్ పరిధిలోని ప్రాజెక్టు ప్లానింగ్, ఇఆర్‌పి కార్యాలయాలలో కరపత్రాలను పంచి, సింగరేణి ప్రధాన ఆసుపత్రిలో ఉద్యోగస్తులను ఉద్దేశించి మాట్లాడుతూ సీపీఐ(ఎం) చేపట్టిన బస్సు యాత్రను జయప్రదం చేయాలని కోరారు. ప్రధాన డిమాండ్లతో బస్సుయాత్ర కొన సాగుతుందని కేంద్ర ప్రభుత్వం బొగ్గు వేలం పాటల కొనసాగింపును ఉపసమరించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బ్రాంచి అధ్యక్షులు గాజుల రాజారావు, ఎం.వెంకటేశ్వర్లు, కూరపాటి సమ్మయ్య పాల్గొన్నారు.



సీఎం రేవంత్ రెడ్డి.. నోరు అదుపులో పెట్టుకో...

- మున్సిపల్ చైర్ పర్సన్ కాపు సీతాలక్ష్మి

నవతెలంగాణ-కొత్తగూడెం

సీఎం రేవంత్‌రెడ్డికి మహిళలు అంటే గౌరవం లేదని, నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడకపోతే ప్రజాక్షేత్రంలో తగినమూల్యం చెల్లించుకోక తప్పదని, తెలంగాణ ఆడబిడ్డల పట్ల ఏ మాత్రం గౌరవం లేదని, అధికారం, అహంకారంతో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడారని.. ఆ వ్యాఖ్యలను సమాజమంతా ముక్తకంఠంతో ఖండించాల్సిన అవసరం ఉందని కొత్తగూడెం మున్సిపల్ చైర్ పర్సన్ కాపు సీతాలక్ష్మి అన్నారు. బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు కాపు సీతాలక్ష్మి ఆధ్వర్యంలో ఎల్ఐసి ఆఫీస్ దగ్గర నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలకు పెద్ద పీట వేస్తామని, కాంగ్రెస్ పార్టీ నాయకత్వంలో సముచిత స్థానం కల్పిస్తామని కల్లబొల్లి మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలకు అసెంబ్లీలో ఇచ్చే గౌరవం ఇదేనా అని ప్రశ్నించారు. సీఎం వెంటనే తన వ్యాఖ్యలను ఉపసంహరించుకొని అసెంబ్లీ సాక్షిగా తెలంగాణ ఆడబిడ్డలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ దామోదర్ యాదవ్. చుంచుపల్లి ఎంపీపీ బాదవత్ శాంతి. ఎంపీటీసీ సంఘం జిల్లా అధ్యక్షురాలు కొల్లు పద్మ, కౌన్సిలర్స్ వేముల ప్రసాద్, అంబుల వేణు,. కో-ఆప్షన్ సభ్యులు దూడల బుచ్చయ్య, బిఆర్ఎస్ లక్ష్మీదేవి పల్లి మండల అధ్యక్షులు కొట్టి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు ఆనాడే చంద్రబాబు మద్దతు

- ఎస్.కె అజీమ్

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

ఎస్సీ వర్గీకరణపై ఆనాడే చంద్రబాబు మద్దతు తెలిపారని టీడీపీ మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి ఎస్.కె అజీమ్ తెలిపారు. రాజకీయ ప్రత్యర్థులు మాలలను రెచ్చగొట్టి రాజకీయ పబ్బం గడుపుకున్నా మొక్కవోని ఆత్మస్థైర్యంతో తను తీసుకున్న వర్గీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకుండా రాజకీయంగా నష్టం జరిగినా కూడా అదే మాట మీద నిలబడ్డ నిజాయితీ కలిగిన నాయకుడు చంద్రబాబు నాయుడు అని గుర్తు చేశారు. ఎస్సీ వర్గీకరణ అంశం ఈ ఘనత తెలుగుదేశం పార్టీకి నారా చంద్రబాబు నాయుడికి దక్కుతుందని చెప్పారు. ఈ ప్రకటన తెలిపిన వారిలో నాయకులు కొడాలి శ్రీనివాస్, కుంచాల రాజారాం, అభినేని శ్రీనివాసరావు పాల్గొన్నారు.

జీవో నెంబర్ 22ను గెజిట్ చేసి సింగరేణి కాంట్రాక్టు కార్మికుల వేతనాలను పెంచాలి

నవతెలంగాణ-కొత్తగూడెం

సింగరేణి కాంట్రాక్టు కార్మికుల వేతనాలకు జీవో నెంబర్ 22ను గెజిట్ చేసి పెంచాలని, ప్రభుత్వం సింగరేణి కాంట్రాక్టు కార్మికుల వేతనాలపై నిర్ణయం తీసుకోవాలని ఐఎఫ్‌టీయూ, పీఎస్‌సీడబ్ల్యూయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.సతీష్ డిమాండ్ చేశారు. సింగరేణి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఇఫ్ట్యూ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా కొత్తగూడెం రైటర్ బస్తీ. బాబు క్యాంప్ తదితరలో వివిధ సింగరేణి కాంట్రాక్టు సెక్షన్లలో గేట్ మీటింగ్‌లు జరిగాయి. ఈ మీటింగ్ పి.సతీష్ హాజరై మాట్లాడుతూ తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి నెలలు గడుస్తున్నా సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలపై ఇంతవరకు నిర్ణయం తీసుకోలేదని విమర్శించారు. రు. ఈ సమావేశాలలో ఐఎఫ్‌టియూ జిల్లా సహాయ కార్యదర్శి వై.గోపాలరావు. ప్రగతిశీల సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ బ్రాంచ్ నాయకులు. సంధ్యా, కరణ, భగవాన్, కృష్ణ, నరసింహ, పద్మ, నాగలక్ష్మి, రామకృష్ణ, కాంట్రాక్ట్ కార్మికులు ఉన్నారు.

నవతెలంగాణ
నమ్మిక తెలుగు దినపత్రిక
8
భద్రాద్రి కొత్తగూడెం
శుక్రవారం | ఆగస్టు 02 2024 | www.navatelangana.com

పేదల పక్షపాతి కామ్రేడ్ కృష్ణమూర్తి

వృకాస జిల్లా ప్రధాన కార్యదర్శి రేపాకుల శ్రీనివాస్



నవతెలంగాణ-కొత్తగూడెం

నిరుపేదల పక్షపాతిగా అనేక పోరాటాలు నిర్వహించిన కామ్రేడ్ కాచం కృష్ణమూర్తి ఆశయాల సాధనకు కృషి చేద్దామని వృకాస జిల్లా ప్రధాన కార్యదర్శి రేపాకుల శ్రీనివాస్ పిలుపు నిచ్చారు. గురువారం సంఘం కార్యాలయంలో కాచం కృష్ణమూర్తి 18వ వర్ధంతి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్యూడల్ భూస్వాముల దురాగతాలకు, దేశ్ ముఖుల పెత్తందారి తనానికి వ్యతిరేకంగా నిజాం ప్రాంతంలోని గ్రామాలలో ప్రజల్ని చైతన్యపరిచి భూమి కోసం భుక్తి కోసం వెట్టి చాకిరి విముక్తి కోసం పోరాడిన ప్రజా నాయకుడని తెలిపారు. అడవుల్లో దళాలను నడిపి భూ పోరాటాలు నిర్వహించి, సంఘాన్ని గ్రామ గ్రామాల్లో నిర్మించి పదివేల గ్రామాలకు విముక్తి కలిగించడంలో, పది లక్షల ఎకరాల భూమిని పంచడంలో కృషిచేసిన తెలంగాణ సాయుధ పోరాట యోధుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో విజయ్, సలీం, సతీష్, రాజ్ కుమార్, చంటి తదితరులు పాల్గొన్నారు.

అనుకున్న లక్ష్యానికి వర్షం అంతరాయం

- బొగ్గు ఉత్పత్తిలో 92 శాతం నమోదు
- విలేకర్ల సమావేశంలో ఏరియా జీఎం షాలేం రాజు

నవతెలంగాణ-కొత్తగూడెం

కొత్తగూడెం ఏరియా 2024-25 ఆర్థిక సంవత్సరం జులై నెలకు కొత్తగూడెం ఏరియాకు నిర్దేశించబడిన 9.98 లక్షల టన్నుల ఉత్పత్తి లక్ష్యానికి గాను 9.18 లక్షల టన్నులు ఉత్పత్తి చేసి 92 శాతం ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించామనిఏరియా జీఎం షాలేం రాజు అన్నారు. ఏప్రిల్ నుండి జులై వరకు 45.11లక్షల టన్నులకు గాను 41.76లక్షల టన్నులు ఉత్పత్తి చేసి 93 శాతం ఉత్పత్తి లక్ష్యం సాధించామని తెలిపారు. గురవారం రుద్రంపూర్ జీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన వివరాలు తెలిపారు. సాధించన బొగ్గు ఉత్పత్తిని నిర్ణిత సమయానికి వినియోగ దారులకు చేరవేశారని చెప్పారు. రోడ్డు, రైల్ మార్గం ద్వారా 10.91 లక్షల టన్నుల బొగ్గు రవాణా జరిగిందన్నారు. ఏప్రిల్ నుండి జులై వరకు 48.25 లక్షల టన్నుల బొగ్గు రవాణా జరిగినట్లు తెలిపారు. ఈ నెలలో జెవిఆర్‌ఓసి నందు 350 ఎంఎం, కిష్టారం ఓసి నందు 521 ఎంఎం వర్షపాతం నమోదు అయినందు వలన కొత్తగూడెం ఏరియాకు నిర్దేశించిన లక్ష్యాన్ని సాధించలేక పోయామని జీఎం ఎం. షాలేం రాజు తెలిపారు.

కారుణ్యనియామకాలు...

ఏరియాలో కారుణ్య నియామకాల కింద ఇప్పటి వరకు 582 వారసులకు ఉద్యోగ అవకాశాలు కల్పించామన్నారు. 64 మందికి ఉద్యోగం బదులు ఏక మొత్తం చెల్లించామన్నారు. కొత్తగూడెం ఏరియాలో రూ.10 లక్షల వరకు ఇంటి రుణంపై వడ్డీని హౌస్ బిల్డింగ్ లోన్ కింద దరఖాస్తు చేసుకున్న 291 మందికి గాను 230 మంది 2024-25 సంవత్సరానికి చెల్లింపు జరిగిందని, ఇంకా 61 మందికి త్వరలో చెల్లిస్తామన్నారు. సీఎంపిఎఫ్ అమౌంట్ అందరికీ 176 చెల్లించామన్నారు. విడో పెన్షన్ 48 క్లైమ్స్ అన్ని క్లియర్ చేశామని తెలిపారు.

బీమా సౌకర్యం...

కాంట్రాక్ట్ వర్క్ మెన్‌కు ప్రమాద బీమా వర్తించే విధంగా హెచ్‌డిఎఫ్‌సీ బ్యాంకుతో సింగరేణి వారు ఎంఓయూ చేసుకోవడం ద్వారా బ్యాంకులో నెలసరి జీతం ఖాతా కలిగి ఉన్న ప్రతి ఒక్క కాంట్రాక్ట్ కార్మికులకు రూ.30 లక్షల ప్రమాద బీమా వర్తిస్తుందని చెప్పారు. ప్రతి కాంట్రాక్టు కార్మికుడు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటు జీఎం జీవి.కోటి



మాట్లాడుతున్న షాలేం రాజు

రెడ్డి, ఏజీఎం (సివిల్) సిహెచ్.రామకృష్ణ, ఏజీఎం(ఫైనాన్స్) కె.హేన సుమలత, డిజీఎం (పర్సనల్) బి.శివ కేశవ రావు, డిజీఎం (ఐఈడి) ఎన్. యోహన్, ఏజెంట్ పివికే.5ఇంక్లైన్ బి. రవీందర్, ప్రాజెక్టు ఆఫీసర్ జికేఓసి శ్రీరమేష్, ఏరియా వర్క్ షాప్ డిజీఎం (ఈఅండ్ఎం) టి. శ్రీకాంత్, సీనియర్ పిఓ మజ్జి మురళి, సీనియర్ ఎస్టేట్ ఆఫీసర్ బి. తౌర్య, సింగరేణి సేవ సమితి కో-ఆర్డినేటర్ సాగర్, పర్సనల్ డిపార్ట్మెంట్ సిబ్బంది పాల్గొన్నారు.

హరికిషన్ సింగ్ సూర్జిత్, కృష్ణమూర్తులకు సీపీఐ(ఎం) నివాళి

నవతెలంగాణ-ఇల్లందు

సీపీఐ(ఎం) తొలి పొలిట్ బ్యూరో సభ్యులు, స్వాతంత్ర్య సమరయోధులు హరికిషన్ సింగ్ సూర్జిత్, వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధులు కృష్ణమూర్తిల వర్ధంతి నిర్వహించారు.ఈ సందర్భంగా గురువారం ఏలూరి భవన్లో జరిగిన కార్యక్రమంలో వారి చిత్ర పటాలకు పార్టీ నాయకులు పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో అబ్దుల్ నబి మాట్లాడుతూ స్వాతంత్ర్య సంగ్రామంలో హరికిషన్ సింగ్ సూర్జిత్, తెలంగాణ రాచరిక పాలన కొనసాగుతున్న రోజుల్లో కష్టాల కొలిమిలో మండిన అగ్ని రవ్వల సాయుధ పోరాటానికి వేగుచుక్కలుగా కృష్ణమూర్తిల విప్లవ ఆశయ సాధనలో అలుపెరుగని పోరు సలిపిన నేతలు అని కొనియాడారు. వారి స్ఫూర్తితో నేడు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై ఉద్యమించాలని పిలుపునిచ్చారు. మన్యం మోహన్ రావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో తాళ్లూరి కృష్ణ, ఎండీ అబ్బాస్, కామ నాగరాజు, కామ కోటేశ్వరరావు, సత్యనారాయణ కోరి, లక్ష్మణ్ పాసి, వై.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నవతెలంగాణ-ఇల్లందు

మండలంలోని 11 కేవీ రామాలయం ఫీడర్ మరమ్మతు నేపథ్యంలో శుక్రవారం పట్టణంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ రాము తెలిపారు. ఆజాద్ నగర్, సుభాష్ నగర్(ఖమ్మం రోడ్), జగదాంబగుంపు, పాత నర్సాపురం ఏరియాలలో ఉదయం 8:00 గంటల నుండి మధ్యాహ్నం 01:00 గంట వరకు విద్యుత్ నిలిపివేయనున్నట్లు తెలిపారు.

గ్రామాల్లో పేరుకుపోయిన సమస్యలను పరిష్కరించండి

నవతెలంగాణ- టేకులపల్లి

మండలంలోని 36 గ్రామపంచాయతీలోని పేరుకుపోయిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని బేతంపూడి సొసైటీ అధ్యక్షుడు లక్కినేని సురేందర్ రావు ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు ఎంపీడీవో రవీందర్ రావుకు వినతి పత్రం అందజేశారు. ఆయా పంచాయతీ కార్యదర్శులకు గురువారం వినతిపత్రాలు అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి బోడ బాలు నాయక్, యూత్ అధ్యక్షుడు శివకృష్ణ, బాలకృష్ణ, జలాది అప్పారావు, కో ఆప్షన్ సభ్యులు మౌలాన్ , ఉద్యమ నాయకులు పాల్గొన్నారు.

గ్రామాలలో తల్లిపాల వారోత్సవాలు

నవతెలంగాణ -టేకులపల్లి

మండలంలోని సులానగర్ గ్రామంలో గల అంగన్వాడీ 1, 2, 3 కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవ కార్యక్రమాన్ని సెక్టర్ సూపర్వైజర్ బి.నిర్మల గురువారం ప్రారంభించారు. హాజరైన బాలింతలు, తల్లులకు ముర్రు పాలు విశిష్టత, పసిపిల్లలకు, ఏ ఆహారం ఇవ్వాలి, ఆహారం ఎలా తినిపించాలనే విషయాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ ఎం.తార, సెక్టర్ సూపర్వైజర్ బి. నిర్మల, ప్రైమరీ స్కూల్ ప్రిన్సిపల్ జోస్పిన్, అంగన్వాడీ టీచర్స్ జి.మంగతాయారు, పి.రాజేశ్వరి, పి.పద్మ, ఆయా నరసమ్మ పాల్గొన్నారు.



కొత్త దంతెనం జీపీ కార్యదర్శికి పితృవియోగం

- వారం రోజుల వ్యవధిలోనే తల్లీతండ్రి మృతి

నవతెలంగాణ-దుమ్ముగూడెం

మండలంలోని కొత్త దంతెనం జీపి కార్యదర్శి బెక్కంటి మాధవి తండ్రి బెక్కంటి శ్రీనివాసరావు (రిటైర్డ్ ఎంపీడీవో) గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ గురువారం భద్రాచలం పట్టణంలోని వారి స్వగృహం నందు మృతి చెందారు. మాధవి తల్లి పద్మావతి గత వారం రోజుల క్రితమే మృతి చెందారు. తల్లిదండ్రులు ఇద్దరు వారం రోజుల వ్యవధిలోనే మృతి చెందడంతో కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి. బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు అన్నె సత్యనారాయణమూర్తి, పంచాయతీరాజ్ ఉద్యోగులు సాయిబాబుతో పాటు పలువురు శ్రీనివాసరావు మృతదేహానికి నివాళులు అర్పించారు.

ప్రముఖ న్యాయవాది వట్టికొండ సురేష్ బాబు మృతి



నవతెలంగాణ-కొత్తగూడెం

కొత్తగూడెంలో సీనియర్ న్యాయవాది వట్టి కొండ సురేష్ బాబు(85) గురువారం రాత్రి మృతి చెందారు. తీవ్ర అనారోగ్యంతో కొత్తగూడెంలోని ప్రయివేటు అసుపత్రిలో చేరి, చికిత్స పొందుతూ మృతి చెందారు. ఖమ్మం జిల్లా మధిర తాలూకా అల్లినగరం గ్రామానికి చెందిన వట్టికొండ నాగేశ్వరరావు వెంకట నరసమ్మ దంపతులకు 1939లో సురేష్ బాబు జన్మించారు. ఖమ్మంలోని ఎస్ఆర్ బీజీ ఎన్ఆర్ కాలేజీలో డిగ్రీ పూర్తి చేసి హైదరాబాద్ ఉస్మానియా లా కళాశాల నుండి లా పట్టా పొందారు. విద్యార్థి దశలోనే విద్యార్థి సంఘ నాయకుడుగా పనిచేశారు. ఆయన తండ్రి స్వాతంత్ర్య సమరయోధులు తెలంగాణ సాయుధ పోరాట నాయకులు వట్టి కొండ నాగేశ్వరరావు బాటలో విద్యార్థి ఉద్యమాల్లో పాల్గొన్నారు. కాలేజీ విద్యార్థి సంఘ అధ్యక్షుడుగా పనిచేశారు. పువ్వాడ నాగేశ్వరరావు, చేకూరి కాశయ్య, కోనేరు నాగేశ్వరరావు వీరి సమకాలీకులు చెబుతుంటారు. 1960లో కొత్తగూడెంలో సివిల్ న్యాయవాదిగా,పేద ప్రజలు కార్మిక వర్గం పక్షాన కక్షిదారుల కేసులు వాదించి పేరు ప్రఖ్యాతులు సంపాదించారు. ఖమ్మం, నల్గొండ, వరంగల్ జిల్లా గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేశారు. సింగరేణి కాలరీస్, నావభారత్ వంటి ప్రముఖ పారిశ్రామిక సంస్థలకు లీగల్ అడ్వైజరగా పనిచేశారు.

కొత్తగూడెం బార్ సోసియేషన్ అధ్యక్షుడిగా పలు సార్లు పని చేయడంతో పాటు, గవర్నమెంట్ ప్లీడర్ గా కూడా సేవలందించారు. రాష్ట్ర వ్యాప్తంగా మంచి గుర్తింపు సంపాదించారు. పుచ్చలపల్లి సుందరయ్య, బోడెపూడి వెంకటేశ్వరరావు, చంద్ర రాజేశ్వరరావు, నల్లమల గిరిప్రసాద్, కేవీఎల్ నరసింహారావు వంటి కమ్యూనిస్టు నేతల బాటలో పయనిస్తూ, కొత్తగూడెం ప్రాంతంలో పేద ప్రజలకు తనకు శక్తి మేరకు సాయం అందించారు. కొత్తగూడెం బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా పనిచేశారు. కొత్తగూడెం క్లబ్ ఏర్పాటులో కీలక భూమిక పోషించారు. ఆయనకి భార్య రాజ్యలక్ష్మి కుమారులు విజయకుమార్ జయశ్రీ అమెరికాలో స్థిరపడ్డారు. ప్రజా సందర్శనార్థం కొత్తగూడెం భజన మందిరం, జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి వెనుకగల ఆయన స్వగృహంలో భౌతిక కాయాన్ని ప్రజల సందర్శనార్థం ఉదయం 9 గంటల నుంచి సందర్శనార్థం ఉంచారు. శుక్రవార మధ్యాహ్నం అంత్యక్రియలు నిర్వహించడం జరుగుతుందని కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన మరణం పట్ల పలు రాజకీయ పార్టీల నాయకులు, మేధావులు, న్యాయమూర్తులు, న్యాయవాదులు సంతాపం తెలిపారు.

ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ సంతాపం

సీనియర్ న్యాయవాది సురేష్ బాబు మృతి కొత్తగూడెం బార్ అసోసియేషన్‌కు, ఏఐఎల్‌యుకు తీరని లోటు అని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీ ఒక ప్రకటనలో సంతాపం ప్రకటించింది.

మున్సిపాల్టీ ఎదుట మాజీ ఎమ్మెల్యే హరిప్రియ ధర్నా

- పారిశుధ్య, డ్రయినేజీ, వీధిలైట్ల సమస్యలు పరిష్కరించాలని బైఠాయింపు

నవతెలంగాణ-ఇల్లందు

వార్డులలో నెలకొన్న డ్రయినేజీ, వీధిలైట్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గురువారం మున్సిపల్ కార్యాలయం ఎదుట మాజీ ఎమ్మెల్యే హరిప్రియ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు, కౌన్సిలర్లు బైఠాయించి ధర్నా నిర్వహించారు. వార్డులలో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను మున్సిపల్ కమిషనర్ కు తెలియజేస్తూ వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని తక్షణమే సమస్యల పరిష్కార దిశగా కృషి చేయాలని డిమాండ్ చేశారు. మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్ సహకారంతో ఆనాడు మునిసిపాలిటీ, అటు గ్రామపంచాయతీలలోనూ మెరుగైన పరిపాలన అందించడమే కాకుండా స్వచ్ఛ మున్సిపాలిటీలను తీర్చిదిద్దడం కోసం ఎన్నో కోట్ల రూపాయలను వెచ్చించారని అన్నారు.

ఎక్కడా కూడా పారిశుధ్య సమస్య అనేది కంటికి



కనిపించకుండా పరిష్కార దిశగా పని చేసిందని, కానీ నేటి కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం అందుకు భిన్నంగా వార్డులలో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న విధంగా ప్రజారోగ్యాన్ని గాలికి వదిలేసి డ్రయినేజీ, వీధిలైట్ల సమస్యలను కనీసం వార్డులలో బ్లీచింగ్ చేయకుండా మిషన్ భగీరథ నీళ్ల అందించకుండా ప్రజలను నానా విధాలుగా ఇబ్బందుల గురి చేస్తున్నారని మండిపడ్డారు.

బీఆర్ఎస్ నాయకుల రాస్తారోకో

నవతెలంగాణ-దమ్మపేట

బీఆర్ఎస్ పార్టీ సీనియర్ మహిళా ఎమ్మెల్యే సబిత ఇంద్రారెడ్డి, సునీత లక్ష్మారెడ్డిలపైన సీఎం రేవంత్ రెడ్డి చేసిన నీచమైన వ్యాఖలను ఖండిస్తూ గురువారం మండల ఆ పార్టీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ మేరకు మండలంలోని మందలపల్లి రింగు సెంటర్ వద్ద హైవే రోడ్‌పై రాస్తారోకో చేపట్టారు. అనంతరం పార్టీ జిల్లా అధ్యక్షులు రేగా కాంతారావు, మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావుల ఆదేశాలతో మండలంలోని అన్ని గ్రామాల్లో పట్టణాల్లో పారిశుధ్య పనులు చేపట్టాలని, అలాగే పంచాయతీలకు రావాలిసిన నిధులను వెంటనే విడుదల చేయాలని, కార్మికులకు పెండింగ్‌లో ఉన్న జీతాలు విడుదల చేయాలని కోరుతూ ఎంపీడీఓకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రైతు బంధు సమితి మాజీ అధ్యక్షులు రావు జోగేశ్వరరావు, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి దొడ్డా రమేష్, వైస్ ఎంపీపీ ధారా మల్లిఖార్జునరావు, నియోజకవర్గ నాయకులు సోయం వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.

ప్రిన్సిపల్‌గా బాధ్యతలు చేపట్టిన సులోచన రాణి

నవతెలంగాణ -టేకులపల్లి



టేకులపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా బి.సులోచన రాణి గురువారం పదవి బాధ్యతలు చేపట్టారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారిణిగా చేస్తూ బదిలీపై టేకులపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా వచ్చారు. నేటి వరకు కళాశాలగా ప్రిన్సిపాల్ గా పనిచేస్తున్న ఎస్.కల్పన ములకలపల్లి బదిలీపై వెళుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు బసవమ్మ, సత్యవతి, ముంతాజ్ అలీ, వేణుగోపాల్, శ్రీనివాసరావు, యాఖుబు, పాల్గొన్నారు.



అందుబాటులోకి వరద రక్షణ సామగ్రి

- తహసీల్దార్ వి.క్రిష్ణ ప్రసాద్

నవతెలంగాణ-అశ్వారావుపేట

వానలతో సంభవించే వరదల్లో చిక్కుకున్న ముంపు ప్రభావిత నిర్వాసితులను తక్షణమే కాపాడేందుకు జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టింది. ఇందుకు గాను ప్రతీ నియోజక వర్గం కేంద్రంలోనూ వరద రక్షణ సామగ్రి అందుబాటులోకి తెచ్చారు. పెద్దవాగు గండి పడి వరద పోటెత్తిన క్రమంలో వరదలో ఇరుక్కున్న 41 మందిని కలెక్టర్ జితేష్ వి.పాటిల్, ఎస్పీ రోహిత్ రాజులు స్వీయ పర్యవేక్షణలో హెలికాప్టర్ సహాయంతో ఎయిర్ లిఫ్టింగ్ చేసిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో భవిష్యత్‌లో వరదలు సంభవిస్తే వరద సహాయక చర్యలు నిమిత్తం లైఫ్ జాకెట్‌లు 10, లైఫ్ బోయ్‌లు 10, 25 మీటర్లు పొడవు గల రోప్ (తాడు) రక్షణ సామగ్రిని కొనుగోలు చేసి ప్రతీ నియోజక వర్గం కేంద్రానికి సరఫరా చేశారు. ఈ సామగ్రి ప్రస్తుతం అశ్వారావుపేట తహసీల్దార్ కార్యాలయంలో అందుబాటులో ఉంచినట్లు తహసీల్దార్ క్రిష్ణ ప్రసాద్ గురువారం తెలిపారు.

జూనియర్ అసిస్టెంట్ వెంకన్న మృతి

- మున్సిపాలిటీ చైర్మెన్ డీవీ, సీపీఐ(ఎం) నేతలు నివాళి
- మున్సిపాలిటీ నుండి రూ.20 వేలు అందజేత

నవతెలంగాణ-ఇల్లందు

21వ వార్డు వాస్తవ్యులు మున్సిపాలిటీ జూనియర్ అసిస్టెంట్ బచ్చల వెంకన్న(50) అనారోగ్యంతో బుధవారం రాత్రి కన్నుమూశారు. అతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్మెన్ దమ్మలపాటి వెంకటేశ్వరరావు, సీపీఐ(ఎం) మండల కార్యదర్శి అబ్దుల్ నబి, నాయకులు కృష్ణ, కిరణ్, మోహన్రావు వారి స్వగృహానికి వెళ్లి మృతదేహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అంత్రక్రియల నిమిత్తం ఇల్లందు పురపాలక సంఘం నుండి 20వేలు నగదు అందజేశారు. అతనికి రావాల్సిన బెనిఫిట్స్ త్వరగా అందజేయాలని సీపీఐ(ఎం) నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక మున్సిపల్ కౌన్సిలర్ అంకెపాక నవీన్ కుమార్, మున్సిపల్ మేనేజర్ అంకు షావలి, జూనియర్ అసిస్టెంట్ సుధీర్ మున్సిపల్ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆర్లపెంట ఉపసర్పంచ్‌కు ఆర్థిక సాయం

నవతెలంగాణ-దమ్మపేట

మండల పరిధిలోని ఆర్లపెంట పంచాయతీ ఉప సర్పంచ్ మల్లేష్‌కు గురువారం మండల నాయకులు ఆర్థిక సహాయం చేశారు. మల్లేష్ చిన్న కుమారుడు ప్రమాదవశాత్తు ఇటీవల మరణించగా పరామర్శించిన కాంగ్రెస్ నాయకులు రూ.10వేల ఆర్థిక సహాయం చేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు ఎల్లిన రాఘవరావు, కొయ్యల అచ్యుతరావు, కెవి సత్యనారాయణ, రావు గంగాధర్‌రావు, బొల్లికొండ నాగేశ్వరావు, రాధయ్య బడే, వంక బాబూరావు, తాండ్ర ముత్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

నవతెలంగాణ-దమ్మపేట

యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఎస్ఐ సాయి కిషోర్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో మత్తుపదార్థాలపై యువతకు అవగాహన కల్పించారు. డీవైఎఫ్ఐ రూపొందించిన పోస్టర్‌ను ఎస్ఐ సాయి కిషోర్ రెడ్డి చేతులమీదుగా ఆవిష్కరింపజేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ యువత చెడు మార్గంలో పయనించకుండా మత్తు పదార్థాలు, గంజాయి, డ్రగ్స్ వాడకుండా మంచి మార్గంలో ప్రయాణించాలని అన్నారు. తమవంతుగా డీవైఎఫ్ఐ యూత్ కోరుతూ కరపత్రాలు రూపొందించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో దాట్ల అశోక్, నారపోగు అనిల్‌కుమార్, భోగ్యం నర్సింహారావు, మోరంపూడి శ్రీనివాసరావు, దొడ్డ లక్ష్మినారాయణ, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మ్యానిఫెస్టోలో పెట్టిన హామీలను అమలు చేయాలి

నవతెలంగాణ-దమ్మపేట

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మానిఫెస్టోలో పెట్టిన హామీలను తక్షణం అమలు చేయాలని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అమర్లపూడి రాము డిమాండ్ చేశారు. గురువారం సంబంధిత డిమాండ్‌పై దమ్మపేట జయలక్ష్మి థియేటర్ నుండి తహసీల్దార్ కార్యాలయం వరకూ ప్రదర్శన నిర్వహించి తహసీల్దార్‌కు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అమర్లపూడి రాము మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకురాలు తోడం దుర్గమ్మ, మండల నాయకులు బండి ఆదినారాయణ, కేసరి వెంకటేష్, ఏఐకేఎంఎస్ మండల కార్యదర్శి పండూరి వీరబాబు పాల్గొన్నారు.



ప్రమాదాల నివారణ ప్రతి ఒక్క ఉద్యోగి బాధ్యత

- ప్రాజెక్ట్ ఆఫీసర్ బొల్లం

నవతెలంగాణ-ఇల్లందు

సింగరేణి సంస్థ నందు ప్రమాదాలు నివారించడం ప్రతి ఒక్క ఉద్యోగి బాధ్యత అని ప్రాజెక్ట్ ఆఫీసర్ బొల్లం వెంకటేశ్వర్లు అన్నారు. ఏరియాలోని జెకె ఉపరితల గనిలో ప్రమాదాల నివారణపై గురువారం ప్రత్యేక భద్రత అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదాలు జరగకుండా అధికారుల, సూపర్వైజర్ల ఆజ్ఞలు పాటించాలని, విధులలో అప్రమత్తంగా ఉండాలని, యంత్రాల పనిగంటలు పెంచాలని, అలాగే వీధులకు వచ్చేటప్పుడు వెళ్లేటప్పుడు జాగ్రత్తగా ప్రయాణం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ పూర్ణ చందర్, సేఫ్టీ ఆఫీసర్ శివ ప్రసాద్, సీనియర్ పర్సనల్ అధికారి సుధాకర్, గని గుర్తింపు సంఘం పిట్ సంజీవ చారి, ప్రాతినిధ్య సంఘం పిట్ కార్యదర్శి నవీన్ ఇతర అధికారులు మరియు ఉద్యోగులు పాల్గొనారు.

కేజీబీవీలో సమస్యలు పరిష్కరించాలి

నవతెలంగాణ-ములకలపల్లి

ములకలపల్లి కేజీబీవీ హాస్టల్ సమస్యల నిలయంగా మారిందని అఖిల భారత విద్యార్థి సమైక్య ఏఐఎస్ఎఫ్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి వరక అజిత్ గురువారం తహసీల్దార్‌కు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేసారు. కేజీబీవీలో విద్యార్థులు అనేక సమస్యలతో సతమాతం అవుతున్నారని, వర్షాలకు సరైన మౌలిక సదుపాయాలు, పరిసరాలు పారిశుధ్యం సరిగా లేక విద్యార్థులకు విష జ్వరాలు వచ్చి హాస్పిటల్ పాలవుతున్నారని అజిత్ అన్నారు. అదేవిధంగా హాస్టల్లో విద్యార్థుల సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజు, రవి తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

అశ్వాపురం : మండలంలోని అమ్మగారిపల్లి సమీపంలోని గోదావరి నదిలో గురువారం ఓ గుర్తు తెలియని మగవాని మృతదేహం లభ్యమయింది. గోదావరి వరదకు కొట్టుకు వచ్చి ఉండవచ్చని స్థానికులు తెలిపారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించారు. అయితే మృతదేహంకు కేవలం పాయింట్ మాత్రమే ఉందన్నారు. అతని వయసు సుమారు 45 నుండి 50 సంవత్సరాల లోపు ఉండొచ్చు అన్నారు. మృతదేహం కుడి చేతిపై హిందీలో సత్యనారాయణ అని రాసి ఉండటంతో పాటు అదే చేయి పై భాగంలో హెూమ్ అనే గుర్తుందన్నారు. మృతదేహాన్ని ఎవరైనా గుర్తుపట్టినట్లయితే అశ్వాపురం పోలీస్ స్టేషన్‌కు 8712682093, 8712682095 ఫోన్ చేయాలని ఈ సందర్భంగా పోలీసులు కోరారు. అనంతరం మృతదేహాన్ని ఖననం చేశారు.

ప్రభుత్వ పథకాలు వినియోగించుకోవాలి

బూర్గంపాడు : తెలంగాణ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ ముజాహిద్, ఎంపీడీవో జమలా రెడ్డిలు పేర్కొ న్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో భద్రాచలం ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో నిర్వహించిన వికలాంగుల బస్సు పాస్ మేళా కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా మండలంలోని 31 మందికి బస్సు పాసులు అందజేశారు. కార్యక్రమంలో బస్సు విలేజ్ ఆఫీసర్లు సీహెచ్ రమేష్, బీఆర్కే రెడ్డి, సీనియర్ పాత్రికేయులు తోకల మోహన్ రావు, పాత్రికేయులు రామకృష్ణ, మల్లారెడ్డి, వెంకటరెడ్డి, జోష్, రాము తదితరులు పాల్గొన్నారు.

నాటిన ప్రతి మొక్క జీవవైవిధ్యాన్ని కాపాడుతుంది

- ఎంపీడీవో పి.ముత్యాలరావు

దుమ్ముగూడెం : నాటిన ప్రతి మొక్క జీవవైవిధ్యాన్ని కాపాడడంతో పాటు పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు అని ఎంపీడీవో పి.ముత్యాలరావు అన్నారు. గురువారం ఐటీసీ ఎంఎస్‌కె (బంగారు భవిష్యత్) వారి సహకారంతో మైరాడ సంస్థ ఆధ్వర్యంలో ములకపాడు గ్రామంలో బయోడేవర్సి అనే మొక్కలను ఎంపీడీవో చేతుల మీదుగా నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బయోడేవర్సి మొక్కలు జీవవైవిధ్యాన్ని కాపాడతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఐటీసీ ఎంఎస్ కే ప్రాజెక్ట్ ఆఫీసర్స్ గీత, అజయ్, ఈజీఎస్ ఏపీఓ సుకన్య, మైరాడ సోషల్ మొబలైజర్ రాజు, నవీన్, మురళి, పంచాయతీ కార్యదర్శి సాహితీ తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థినికి ఆర్థిక సాయం

- ట్రస్టు సేవలు అభినందనీయం : ఎంపీడీఓ

బూర్గంపాడు : మండల పరిధిలోని నాగినేని ప్రోలు రెడ్డిపాలెం గ్రామంలో బీటెక్ చదువుతున్న పేద విద్యార్థినీ ఎడమ కంటి యామిని ఉన్నత చదువుల నిమిత్తం మోరంపల్లి బంజరు గ్రామానికి చెందిన చేయూత ట్రస్ట్ రూ.8000 ఆర్థిక సహాయం అందించి మానవత్వం చాటుకున్నారు. ఈ నగదును మండల అభివృద్ధి అధికారి జమలా రెడ్డి చేతుల మీదుగా ఆ విద్యార్థినికి గురువారం అందించారు. ఈ సందర్భంగా జమలారెడ్డి మాట్లాడుతూ గత ఏడాదిన్నరగా చేయూత ట్రస్ట్ చేస్తున్న సేవలు అభినందనీయమని ప్రశంసించారు. ట్రస్ట్‌లో పనిచేస్తున్న ప్రతి ఒక్కరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మెన్ కైపు లక్ష్మీ నారాయణ రెడ్డి, ఉపాధ్యక్షుడు కైపు నాగిరెడ్డి, ప్రధాన కార్యదర్శి జక్కిరెడ్డి మల్లారెడ్డి, కోశాధికారి గాదె నర్సి రెడ్డి, గౌరవ అధ్యక్షులు కే వెంకటేశ్వర్లు, సభ్యులు శనగ మల్లేశ్వరరావు, తమ్మినేని శ్రీనివాసరావు, పాల్వంచ ఎంపీడీవో తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి ఉద్యోగి కుమారుడుకి ప్రోత్సాహక పురస్కారం

మణుగూరు : సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలో ఏరియా హాస్పిటల్‌లో సీనియర్ ఫార్మసిస్ట్‌గా విధులు నిర్వర్తిస్తున్న సిహెచ్ బొర్రయ్య కుమారుడు సిహెచ్ విజయ్ ఐఐఎం కాశీపూర్ నందు ఎంబీఏ (ఎనాలసిస్) మొదటి సంవత్సరం చదువుతున్నందుకుగాను ఏరియా జనరల్ మేనేజర్ దుర్గం రాంచందర్ వారికి ప్రోత్సాహకంగా ఒక లక్ష నలభై ఎనిమిది వేల నగదు పురస్కారం అందజేశారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ...తల్లిదండ్రులు పిల్లల్ని చదువులో ఎంతగా ప్రోత్సహిస్తే, అంతగా తమ మేధా సంపత్తి, పట్టుదలతో ఎన్నో ఉన్నత శిఖరాలు అధిరోహించగలరనడానికి సిహెచ్ విజయ్ ఓ చక్కని ఉదాహరణ అంటూ అభినందించారు. ఈ కార్యక్రమంలో డీజీఎం(పర్సనల్) అండ్ అధికార ప్రతినిధి సలగల రమేశ్, ఎస్ఓటు జీఎం శ్యామ్ సుందర్ ఏజీఎం (సివిల్) డి. వెంకటేశ్వర్లు, డీజీఎం (ఐడీ) శ్రీ వెంకట్ రావు, అధికార ప్రతినిధి డీజీఎం (పర్సనల్) రమేష్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన గ్రామాల్లో వైద్య శిబిరాలు

అశ్వారావుపేట : అశ్వారావుపేట (వినాయక పురం) ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని మారుమూల గిరిజన గ్రామాలైన రెడ్డిగూడెం, బండారి గుంపు ల్లో వైద్యాధికారి రాందాస్ నాయక్ పర్యవేక్షణలో గురువారం సిబ్బంది వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామాల్లో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు గృహ సందర్శన చేపట్టారు. ప్రతీ ఇంటి పరిసరాల్లో నిల్వ ఉన్న నీటిని గుర్తించి తొలిగించేసారు. అనంతరం ఆయా గ్రామాలలో వైద్య శిబిరం నిర్వహించి పలురకాల కాలానుగుణంగా వ్యాప్తి చెందే రుగ్మతలకు ఉచితంగా మందులు అందజేశారు. జ్వరంతో ఉన్న వారికి మలేరియా నిర్ధారణ పరీక్షలు చేసారు. ఇందులో ఎవరికీ మలేరియా నిర్ధారణ కాలేదు. ఈ వైద్య శిబిరంలో హెల్త్ అసిస్టెంట్ ప్రసాద్, రవి, సత్యనారాయణ, సతీష్, ఏఎన్ఎం బీబీ నాంచారి, ఆయా గ్రామాల ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

నవతెలంగాణ-ముదిగొండ

మండలపరిధిలో న్యూలక్ష్మీపురం గ్రామానికి చెందిన గండు యశోద అనారోగ్య కారణాలతో సీఎంఆర్ఎఫ్ దరఖాస్తు చేసుకోగా, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు గ్రామ మాజీ సర్పంచ్ మహమ్మద్ అజ్గర్ సిఫారస్ మేరకు రూ.22,500 మంజూరు కాగా గురువారం బాధితురాలు యశోదకు, ఆచెక్కును మాజీ సర్పంచ్‌లు మహమ్మద్ అజ్గర్, వాకదాని కన్నయ్య అందజేశారు. సీఎం సహాయ నిధి పేదలకు ఎంతో మేలున్నారు. ఈ కార్యక్రమంలో సేవాదళ్ మాజీ మండల అధ్యక్షులు ఊరుకొండ రాజు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పోతురాజు పురుషోత్తం, మారుతి వీరయ్య, మళ్ల నరసింహారావు, సిహెచ్.నాగేశ్వరరావు, గండు వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ఫలించిన ఎంఆర్‌పీఎస్ సుదీర్ఘ పోరాటం

నవతెలంగాణ-బోనకల్

సుప్రీంకోర్టు తీర్పుతో 30 సంవత్సరాల ఎమ్మార్పీఎస్ పోరాటానికి ఫలితం దక్కిందని ఎంఆర్పిఎస్ నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు స్థానిక ఖమ్మం బస్టాండ్ సెంటర్లో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. బాణసంచ కాలుస్తూ ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎంఆర్పిఎస్ రాష్ట్ర కార్యదర్శి చిలక నాగరాజు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా సీనియర్ నాయకులు తాటికొండ వెంకటరత్నం, కోట హనుమంతరావు మాదిగ, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు తోటపల్లి చిన్న సైదులు మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రచార కార్యదర్శి బలవంతపు నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

తల్లాడ : ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తూ ఎమ్మార్పీఎస్ మండల నాయకులు గురువారం భారీ ర్యాలీ నిర్వహించి, మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపూరి, వెంకటేశ్వరరావు, టిఆర్ఎస్ నాయకులు, జీవిఆర్, సంఘసాని శ్రీను, గంజాయి శివ, తెళ్లూరి, రఘు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌డీఆర్ఎఫ్ బృందం ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహనా సదస్సు

నవతెలంగాణ-అశ్వాపురం :



మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం ప్రకృతి వైపరీత్యాలు, అత్యవసర పరిస్థితుల్లో బాధితుల్ని రక్షించటంపై ఇండియన్ ఎన్‌డీఆర్ఎఫ్ ఆధ్వర్యంలో అవగాహనా సదస్సు నిర్వహించారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల జరిగే విపత్తుల సమయంలో అందించే సహాయ చర్యలపై దృష్టి ఎలా పెట్టాలన్న అంశంపై విద్యార్థులకు కళ్ళకు కట్టినట్లు చూపించారు. ఎక్కడైనా ప్రకృతి విపత్తులు సంభవిస్తే వెంటనే ఆ ప్రాంతాలకు వెళ్లి బాధితులను రక్షించే మెళకువలతో పాటు భవనాలు కూలినప్పుడు, వరదల్లో గ్రామాలు నీటిలో నీటిలో మునిగిపోయి ప్రజలు వరదలలో చిక్కుకున్న వారిని ఎలా రక్షించాలన్న సహాయక చర్యలపై వివరించారు. ఈ కార్యక్రమంలో ఎన్డిఆర్ఎఫ్ సిబ్బందితోపాటు తహశీల్దార్ స్వర్ణ, ఎంపీడీవో వరప్రసాద్, సీఐ అశోక్ రెడ్డి, ఎస్ఐ సురేష్ కుమార్, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సత్య ప్రకాష్, ఆర్ఐలు రాజేశ్వరరావు, నాగమణి వివిధ సేవా సంస్థల సంఘాలు జూనియర్ కళాశాల విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

తల్లిపాల వారోత్సవాలను విజయవంతం చేయండి

- పోస్టర్ ఆవిష్కరణలో కలెక్టర్

నవతెలంగాణ-పాల్వంచ



తల్లిపాల వారోత్సవాలను విజయవంతం చేయాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ కోరారు. స్థానిక సమీకృత కలెక్టరేట్ నందు జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ తల్లిపాల వారోత్సవాల పోస్టర్‌ను కలెక్టర్ గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...జిల్లాలోని ప్రభుత్వ, ప్రయివేటు ఆసుపత్రిలో ప్రసవించే తల్లులకు తల్లిపాల ప్రాముఖ్యత వివరించి ఆరోగ్య తెలంగాణ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని తెలిపారు. అదేవిధంగా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆరోగ్య శాఖ సమన్వయంతో తల్లిపాల సంస్కృతి వలన తల్లులు, పిల్లలకు కలిగే ప్రయోజనాలపై అవగాహన కలిగించాలని, బిడ్డ పుట్టిన మొదటి గంటలోనే తల్లిపాలు ప్రారంభించడం, మొదటి ఆరు నెలలు వయసు వరకు తల్లిపాలు మాత్రమే ఇప్పించడం, ఆరు నెలల మీదట అనుబంధ కుటుంబ ఆహారం అదనంగా ప్రారంభించాలన్నారు. తల్లిపాలు రెండేండ్ల వయసు వరకు లేదా వీలైనంత ఎక్కువ కాలం ఇప్పించడం, సరైన పోషణ విధానంపై వారికి వివరించాలని పేర్కొన్నారు. ఆగస్టు మొదటి వారంలో నిర్వహించే ఈ అంతర్జాతీయ తల్లిపాల వారోత్సవాలను క్షేత్రస్థాయిలో షెడ్యూల్ ప్రకారం నిర్వహించి మెరుగైన ఫలితాలు రాబట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారిని వేల్పుల విజేత, పోషణ అభియాన్ జిల్లా సమన్వయకర్త పొనుగోటి సంపత్, జిల్లా ప్రాజెక్ట్ అసోసియేట్ బి.రాము, ప్రాజెక్ట్ స్థాయి కోఆర్డినేటర్లు రామకృష్ణ, శ్రీకాంత్, సోనీ తదితరులు పాల్గొన్నారు.

టీఎంపీడీవో అసోసియేట్ ప్రెసిడెంట్‌గా ఎంపీడీఓ ఎన్నిక

- ఘనంగా ఆత్మీయ సన్మానం

నవతెలంగాణ-ఇల్లందు



తెలంగాణ రాష్ట మండల పరిషత్ అభివృద్ధి అధికారుల సంఘం (టీఎంపీడీవో) అసోసియేట్ ప్రెసిడెంట్ ఇల్లందుకు చెందిన ఎంపీడీఓ ధన్ సింగ్ ఎన్నికైయ్యారు. ఈ సందర్భంగా మండల ప్రజా పరిషత్ కార్యాల యంలో ఎంపీపీ చీమల నాగరత్నమ్మ అధ్యక్షతన గురువారం ఎంపీడీఓ ధన్ సింగ్‌కు ఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీవో చిరంజీవి మాట్లాడుతూ ధన్‌సింగ్ భవిష్యత్‌లో మరెన్నో ఉన్నంత పదవులు అధిరోహించాలని కోరుకున్నట్టు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సూపరిండెంట్ ప్రవీణ్ కుమార్, మండల ప్రజా పరిషత్ సిబ్బంది, 29 గ్రామ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఏకలవ్య పాఠశాలలో ఏం జరుగుతోంది...

- ఆందోళనకు దిగిన విద్యార్థుల తల్లిదండ్రులు

నవతెలంగాణ-దుమ్ముగూడెం :



మండలంలోని లక్ష్మీనరం గ్రామంలో గల ఏకలవ్య గురుకుల పాఠశాలలో ఏం జరుగుతోంది. పాఠశాలలో చదివే విద్యార్థులు తల్లిదండ్రులు గురువారం ఎందుకు ఆందోళన దిగారు. కో ఎడ్యుకేషన్‌లో భాగంగానే వార్డెన్ వర్మ విద్యార్థులను గట్టిగా మందలిస్తున్నారా... అదే కారణం చేత వార్డెన్ పై కక్ష పెంచుకున్న విద్యార్థులు దాడికి యత్నించారా... దీంతో పాఠశాల యాజమాన్యం కొంతమంది విద్యార్థులను హెూమ్ సిక్ పేరుతో ఇంటికి పంపేందుకు సిద్ధమయ్యారా.. విషయం తెలిసిన కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారా...అంటే వీటన్నిటికీ అవుననే సమాధానాలు వినిపిస్తున్నాయి. గత 4 రోజుల క్రితం పాఠశాలలో చదివే విద్యార్థులను బయటకు పంపించడం లేదని తల్లింద్రులు వాచ్మెన్లతో ఘర్షణకు దిగారు. ఆ ఘటన మరువక ముందే ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదివే మా పిల్లలను అకారణంతో హెూమ్ సిక్ అంటూ కావాలని ఉపాధ్యాయులు ఇంటికి పంపించే ప్రయత్నం చేస్తున్నారని, ఇట్టి విషయంపై స్పష్టత ఇవ్వడం లేదని కొందరు విద్యార్థుల తల్లిదండ్రులు వసతి గృహం వద్ద గురువారం ఆందోళన చేపట్టారు. పాఠశాలలో ఉండే ఒకరిద్దరు ఉపాధ్యాయులు అర్ధరాత్రి వేళలో విద్యార్థుల వద్దకు వెళ్లి నిద్ర లేపి ఇబ్బందులకు గురి చేస్తున్నారని విద్యార్థులు తల్లిదండ్రులు ఆరోపించారు.

ఆ సమయంలో అక్కడికి వెళ్లిన పాత్రికేయులతో ప్రిన్సిపాల్ సురేఖ మాట్లాడుతూ...ఏకలవ్య పాఠశాలలో విద్యార్థుల క్రమశిక్షణ పై ప్రత్యేక దృష్టి పెడుతున్నామని, ఈ క్రమంలో కొందరు విద్యార్థుల ప్రవర్తన గాడి తప్పుతున్నట్లుగా కనబడింది అన్నారు. పర్యవేక్షణలో భాగంగా ఉపాధ్యాయులు రాత్రి వేళలో కూడా విద్యార్థుల పై ప్రత్యేక నిఘా ఉంచడం జరుగుతుందన్నారు. ప్రవర్తన బాగా లేని విద్యార్థులను మందలించి, కౌన్సిలింగ్ ఇవ్వడమే కాకుండా తల్లిదండ్రులకు కూడా సమాచారం ఇస్తున్నామని తెలిపారు. విద్యార్థుల ప్రవర్తనలో మార్పు వచ్చేవరకు విద్యార్థుల తల్లిదండ్రుల వద్ద ఉంచి మార్పు తీసుకు వచ్చేందుకు ప్రయత్నం చేద్దాం అనుకున్నామని, విద్యార్థులపై ఎటువంటి దురుద్దేశం యాజమాన్యానికి లేదన్నారు. విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఇచ్చే బాధ్యత అటు తల్లిదండ్రులు ఇటు ఉపాధ్యాయులపై ఉందన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కారం చేయాలి

- బీఆర్ఎస్ నియోజకవర్గ నాయకులు రామకృష్ణ

నవతెలంగాణ-భద్రాచలం రూరల్



గ్రామ పంచాయతీ పరిధిలోని ప్రజా సమస్యలు పరిష్కరించాలని బీఆర్ఎస్ నియోజకవర్గ నాయకులు మానే రామకృష్ణ అన్నారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు రేగా కాంతారావు పిలుపుమేరకు గ్రామపంచాయతీలో పేరుకుపోయిన సమస్యలు పరిష్కారం చేయాలని, వివిధ డిమాండ్లను పరిష్కరించాలని వారి ఆధ్వర్యంలో భద్రాచలం గ్రామపంచాయతీ కార్యనిర్వహణ అధికారి శ్రీనివాసరావుకి గురువారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో గ్రామాలు గ్రామపంచాయతీలు అద్భుతంగా ఉన్నాయని, నేటి పాలనలో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉందని, గ్రామపంచాయతీ నిధులు విడుదల చేయటంలో ప్రభుత్వం విఫలమైనని ఆరోపించారు. వినతిపత్రం అందజేసిన వారిలో పార్టీ మండల నాయకులు ఆకోజు సునీల్ కుమార్, బత్తుల నర్సింహులు, కాపుల సూరిబాబు, దానియేలు ప్రదీప్, ఐనాల రామకృష్ణ, కావూరి సీతామహాలక్ష్మీ, కర్రకృష్ణ, చిట్టిమల్ల అనిల్, యువరాజు, శివప్రసాద్, బడిశా నాగరాజు, మాచర్ల రంజిత్, గోసుల శ్రీనివాస్, నర్సమ్మ, తదితరులు పాల్గొన్నారు.

దుమ్ముగూడెం : రాష్ట్రంలో ఏడు నెలల క్రితం ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామ పంచాయతీల పాలనను నిర్వీర్యం చేస్తుందని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు అన్నె సత్యనారాయణమూర్తి ఆరోపించారు. గురువారం తూరుబాక గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి, స్థానిక జీపీ కార్యదర్శులకు సమస్యలతో కూడిన వినతి పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి కణితి రాముడు, మండల ఉపాధ్యక్షులు తునికి కామేష్, పీఏసీఎస్ డైరెక్టర్ బొల్లి వెంకట్రావు, పార్టీ ప్రచార కమిటీ అధ్యక్షులు దామెర్ల శ్రీనివాసరావు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

చంద్రుగొండ : గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని, వీధిలైట్లు లేక గ్రామాల్లో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని బీఆర్ఎస్ మండల కమిటీ ఆరోపించింది. బీఆర్ఎస్ మండల కమిటీ ఆధ్వర్యంలో మండల పరిషత్ కార్యాలయం ఎదుట గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ ధర్నా చేపట్టి, సమస్యలతో కూడిన వినతిని ఎంపీడీఓ అశోకుకు అందజేశారు. ఈ నిరసన కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు దార వెంకటేశ్వరరావు, గుంపెన సోసైటీ వైస్ చైర్మెన్ నల్లమోతు వెంకటనారాయణ, సోసైటి డైరక్టర్ ఉన్నం నాగరాజు పాల్గొన్నారు.

మణుగూరు : గ్రామపంచాయతీ, మున్సిపాలిటీలలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని జడ్పీటీసీ పోశం నరసింహారావు డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సమితి సింగారం గ్రామపంచాయతీ ఎదుట ఆందోళన చేపట్టి, అధికారులకు వినతి పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో దొండేటి మోహన్ రావు, చెన్నకేశవులు, రామిరెడ్డి, నరసింహారావు, వెంకన్న ప్రసాద్, రాజ్ కుమార్, బీరమ్మ, వెంకన్న పాల్గొన్నారు.

ములకలపల్లి : అన్ని పంచాయతీల్లో శానిటేషన్ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు మోరంపూడి అప్పారావు ఆధ్వర్యంలో జడ్పీటీసీ సున్నం నాగమణి ఎంపీడీవో కార్యాలయం వద్ద బీఆర్ఎస్ నాయకులతో నిరసన తెలిపారు. అనంతరం ఎంపీడీవో కె.మహాలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ శెనగపాటి మెహరామణి, శెనగపాటి సీతారాములు, కొమరయ్య, చంద్రావు, హనుమంతు, నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటమే 'ఎలిగినేని'కి నివాళి

సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు మాచర్ల భారతి

నవతెలంగాణ-వేంసూరు



ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటమే ఎలిగినేని నారాయణకు ఇచ్చే నివాళి అని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు మాచర్ల భారతి అన్నారు. గురువారం మండల పరిధిలోని చిన్న మల్లెల గ్రామంలో నారాయణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సంతాప సభలో మాట్లాడుతూ పార్టీ విధానాలకు కట్టుబడి పనిచేసిన నారాయణ కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని అన్నారు. పాలక పక్షాలు ఒత్తిడిలు ఎన్ని ఉన్నా పార్టీ విధానాలకు నిబద్ధతతో పనిచేసిన వారికి గుర్తింపు ఉంటుందని అన్నారు. నేడు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరిక విధానాలను ప్రజలలోకి తీసుకెళ్లి చైతన్యవంతం చేయవలసిన అవసరం ఉందన్నారు. జిల్లా కమిటీ సభ్యులు బొంతు రాంబాబు. చలమాల విఠల్‌రావులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ విధానాలపై పోరాటానికి యువతను సిద్ధం చేయాలని, సింగరేణి రక్షణకై పార్టీ చేసే బస్సుయాత్ర ఐదున సత్తుపల్లికి చేరుకుంటుందని, ఈ కార్యక్రమాన్ని కార్మిక వర్గాలు అధిక సంఖ్యలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. తొలుత వెలిగినేని నారాయణ స్థూపాన్ని మాచర్ల భారతి, బొంతు రాంబాబు ఆవిష్కరించారు. సీనియర్ నాయకులు అరవపల్లి గోపాలరావు అధ్యక్షతన జరిగిన సంతాప సభలో జిల్లా కమిటీ సభ్యులు పాండురంగారావు, జాజిరి శ్రీనివాసరావు, రాజబాబు, మల్లూరు చంద్రశేఖర్, మండల కార్యదర్శి జగన్ మోహన్ రావు, మొరంపూడి వెంకటేశ్వరరావు, కొత్త సత్యనారాయణ, నరసింహారావు, గాయం తిరుపతిరావు, మధు, నాగేశ్వరరావు, జగన్, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఎంపీపీ పాలకవర్గానికి సన్మానం

నవతెలంగాణ-ముదిగొండ

ఐదేళ్లపాటు పదవీకాలంలో మండల అభివృద్ధిలో పాలుపంచుకోవడం సంతృప్తిని చ్చిందని ఎంపీపీ సామినేని హరిప్రసాద్ అన్నారు. ఎంపీపీ పాలకవర్గం 5 ఏండ్ల పదవీకాలం ముగిసిన సందర్భంగా గురువారం మండల పరిషత్ కార్యాలయంలో సన్మాన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల ప్రజలు, అధికారులు, ప్రజాప్రతినిధులు, పాత్రికేయుల సహకారం మరువలేనిదన్నారు. జడ్పీటిసి సభ్యురాలు పసుపులేటి దుర్గ మాట్లాడుతూ పదవిలో ఉన్న లేకున్నా మండల ప్రజలు అందుబాటులో ఉండే సహకారం అందిస్తామన్నారు. వైస్ ఎంపీపీ మంకెన దామోదర్ మాట్లాడుతూ ఐదేళ్ల పదవీకాలంలో సహకరించిన అధికారులు ప్రజలందరికీ కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఎంపీపీ పాలకవర్గాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులు, ఉద్యోగస్తులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ తిరుమల కరుణాకర్ రెడ్డి, ఎంపీడీవో ఎస్ శ్రీధర్ స్వామి, ఎంఈఓ బివి రామాచారి, ముదిగొండ సొసైటీ చైర్మన్ తుపాకుల యలకొండస్వామి, ఏఓ మందుల రాధ, ఏపీఎం సిహెచ్ కల్పన, ఏపీవో ఏ.రంగనాయకమ్మ, పిహెచ్సి వైద్యాధికారులు అంకం అరుణాదేవి, కె ధర్మేంద్ర, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ విజయరాజు, విద్యుత్ శాఖ ఏడి భీమ్ సింగ్, ఏఈలు మేకపోతుల శ్రీనివాసరావు, వి నారాయణ, సిపిఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు వాసిరెడ్డి ప్రసాద్, మండల కార్యదర్శి బట్టు పురుషోత్తం, నాయకులు మందరపు వెంకన్న, కోలేటి ఉపేందర్, అరుణ, వేల్పుల భద్రయ్య, టీఎస్ కళ్యాణ్, బట్టు రాజు, ఇరుకు నాగేశ్వరరావు, పుచ్చకాయల లక్ష్మయ్య, మెట్టెల సతీష్, గోవర్ధనగిరి శ్రీనివాసరావు, బిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సబితపై అనుచిత వ్యాఖ్యలు హేయం

- బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎమ్మెల్యే సండ్ర

నవతెలంగాణ-సత్తుపల్లి

మాజీమంత్రి సబితారెడ్డి ఇంద్రారెడ్డిపై సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క అనుచిత వ్యాఖ్యలు చేయడం హేయమని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య తీవ్రంగా ఖండించారు. అధికార గర్వంతో మదమెక్కిన కాంగ్రెస్ నేతలు అసెంబ్లీ సాక్షిగా మహిళా ఎమ్మెల్యే అని కూడా చూడకుండా నోరు పారేసుకోవడం గర్హనీయమన్నారు. సభా నాయకుడి స్థానంలో ఉన్నానన్న సోయిమరిచి స్వయంగా ముఖ్యమంత్రి ఈ వ్యాఖ్యలు చేయగా ఉప ముఖ్యమంత్రి వంత పాడటం సిగ్గుచేటని సండ్ర విమర్శించారు.

ఎస్సీ, ఎస్టీ ఉప వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు చారిత్రాత్మకమని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు సండ్ర వెంకటవీరయ్య అన్నారు. మంద కృష్ణమాదిగ చేసిన 30యేండ్ల పోరాటానికి న్యాయం జరిగిందన్నారు. కృష్ణమాదిగ చేపట్టిన ఉద్యమానికి మద్దతు పలికిన ప్రతి ఒక్కరి కల నెరవేరిందని సండ్ర అన్నారు.

ప్రజలకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలి

నవతెలంగాణ-ఖమ్మంరూరల్

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ తక్షణమే అమలు చేయాలని సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ డివిజన్ కార్యదర్శి బందెల వెంకయ్య డిమాడ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఖమ్మంలోని కాల్వొడ్డు నుంచి మండల తహసీల్దారు కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దారు కార్యాలయం ఎదుట గురువారం ధర్నా నిర్వహించారు. సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దారు రాంప్రసాద్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు మలీదు నాగేశ్వరరావు, అశోక్, ఝాన్సీ, శిరోమణి, మండల కార్యదర్శి మల్లయ్య, నాయకులు వెంకటప్పారావు, యాదగిరి, నాగార్జున, బందెలు లలిత, ఉపేందర్ నాగేశ్వరరావు, సత్యం, రాందాస్, వెంకటేశ్ పాల్గొన్నారు.

తల్లాడ : ఎన్నికల ముందు రాష్ట్ర ప్రభుత్వ ఇచ్చిన 6 గ్యారంటీలను వెంటనే అమలు చేయాలని సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ జిల్లా కార్యవర్గ సభ్యులు షేక్ లాల్ మియా డిమాండ్ చేశారు. గురువారం తహసీల్దార్ రవికుమార్‌కు వినతి పత్రం అందజేశారు. హామీలు అమలు చేయాలని సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ మండల కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సహాయ కార్యదర్శి డీ. శ్రీనివాసరావు, మండల కమిటీ సభ్యులు జీ.పుల్లమ్మ, జానీ, రమణ, రాఘవ, వెంకటేశ్వర్లు, ప్రవీణ తదితరులు పాల్గొన్నారు.

కల్లూరు : తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ భుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సిపిఐ ఎంఎల్ మాస్ లయన్ కల్లూరు డివిజన్ కార్యదర్శి ఏ.వెంకన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో తాసిల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ బాబ్జి ప్రసాద్‌కు వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ నాయకులు జె .మాల్యాద్రి, కే.పుల్లారావు, ఎస్.మంగయ్య, జె.పరిమళ, ఏ.సరోజిని, వెంకటి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను వెంటనే పరిష్కరించాలి

నవతెలంగాణ-కామేపల్లి

గ్రామాలలో పేరుకుపోయిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని, గ్రామపంచాయతీలకు నిధులు కేటాయించాలని బిఆర్ఎస్ పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో ఎంపీడీవో రవీందర్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. ఆధ్వర్యంలో ఎంపిడిఓ రవిందర్ కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మాజీ మండల అధ్యక్షులుఅంతోటి అచ్చయ్య, బిఆర్ఎస్ పార్టీ మండల ఉపాధ్యక్షులు మల్లేంపాటి శ్రీనివాసరావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి నేటికీ ఎనిమిది నెలలు గడిచినప్పటికీ గ్రామాల్లో అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉన్నదన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు వడియాల కృష్ణారెడ్డి, మూడ్ కృష్ణప్రసాద్, కన్నమాల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

వాహనం ఢీ కొని వ్యక్తికి గాయాలు

నవతెలంగాణ-కామేపల్లి

ఖమ్మం టు ఇల్లందు ప్రధాన రహదారిపై గుర్తుతెలియని వాహనం ఢీ కొని యువకుడికి తీవ్రగాయాలైన సంఘటన గురువారం చోటుచేసుకుంది. మండల పరిధిలోని రామకిష్టాపురం గ్రామానికి చెందిన ఆంగోతు దినేష్ మోటర్ సైకిల్ పై ఖమ్మం నుండి ఇంటికి వస్తుండగా తాళ్ళగూడెం సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టింది. దీంతో దినేష్‌కి తీవ్రగాయాలైనాయి. వెంటనే వారిని చికిత్స నిమిత్తం ఖమ్మం తరలించారు.

పెయింటింగ్ వర్కర్స్ యూనియన్ ఎన్నిక ఏకగ్రీవం

నవతెలంగాణ-ఖమ్మంకార్పొరేషన్

కాల్వడ్డులోని పెయింటింగ్ వర్కర్స్ యూనియన్ కార్యాలయంలో గాంధీ చౌక్ అడ్డా పెయింటింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సమావేశానికి యూనియన్ గౌరవ అధ్యక్షులు ఎస్‌కె సలీం అధ్యక్షత వహించారు. సమావేశం అనంతరం ఎన్నిక జరగగా అధ్యక్షుడిగా పావురాల నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా చచ్చు లక్ష్మి నారాయణ, ప్రధాన కార్యదర్శిగా జంగం నగేష్, సహాయ కార్యదర్శిగా పాశం కృష్ణారెడ్డి, కోశాధికారిగా కాకులారం కిట్టు, సలహాదారుగా బండి శ్రీను ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో దండి శ్రీను, నెలూరి సుధాకర్, సూర్యాపేట రాములు, ఎస్‌కె ఫరీద్, ఎస్‌కె యాకూబ్, ఉషాబాబు, ఏసు, జి.ఉపేందర్, నహీమ్, సతీష్, తుపాకుల వెంకటేశ్వర్లు, లక్ష్మణ్, బి.రామకృష్ణ, ఎర్ర భాస్కర్, పూల్ చందు, వెంకట్రావ్, రాము, శివ తదితరులు పాల్గొన్నారు.

మాదిగ అమరుల త్యాగాలకు సుప్రీంకోర్టు తీర్పు అంకితం

నవతెలంగాణ-ముదిగొండ

ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ కోసం తన జీవితాన్నే త్యాగం చేసిన మందకృష్ణ మాదిగ త్యాగ ఫలితమే నేడు వర్గీకరణ తీర్పు అని ఎంఆర్పిఎస్, ఎంఎస్పి మండల ఇంచార్జీ నూకల నాగేశ్వరరావు అన్నారు. ఎస్సీ ఎస్టీ వర్గీకరణ అవసరమని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును హర్షిస్తూ ముదిగొండలో గురువారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించి టపాసులు కాల్చారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల ఇన్చార్జి ఎల్ వీరభద్రం, ఎంఎస్పి మండల అధ్యక్షులు పడిశాల నాగేశ్వరరావు, నాయకులు నారపొంగు కిరణ్, బొడ్డు అనిల్, ఎంఈఎఫ్ మండల నాయకులు ఎల్.వెంకటేశ్వర్లు, ఎంజెఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి : తహశీల్దార్

నవతెలంగాణ-కూసుమంచి

ప్రతి ఒక్కరూ బాధ్యతతో మొక్కలు నాటాలని తాసిల్దార్ సురేష్ కుమార్ కోరారు. గురువారం మండల కేంద్రంలోని తాసిల్దార్, ఎంపీడీవో కార్యాలయాల్లో ఎంపీడీవో వేణుగోపాల్ రెడ్డితో కలిసి ఆయన మొక్కలను నాటారు. కార్యక్రమంలో ఎంపీడీవో, తహశీల్దార్ కార్యాలయాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు సంక్షేమ పథకాలు వర్తింపచేయాలి

నవతెలంగాణ-కారేపల్లి

ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీల హామీ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ఆధ్వర్యంలో గురువారం కారేపల్లిలోని కొమరం భీమ్ సెంటర్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ధర్నా చేశారు. ఈసందర్భంగా మాస్‌లైన్ కారేపల్లి, కామేపల్లి మండలాల సంయుక్త కార్యదర్శి గుమ్మడి సందీప్, ఖమ్మం డివిజన్ కార్యదర్శి వర్గ సభ్యులు గుగులోత్ తేజానాయక్, ఎన్వీ రాకేష్‌లు మాట్లాడారు.

ఎముకల మిల్లులో లోకాయుక్త అధికారుల తనిఖీ

- దుర్వాసనపై ఫిర్యాదుతో పరిశీలన



నవతెలంగాణ-కోదాడరూరల్

సూర్యాపేట జిల్లా అనంతగిరి మండల పరిధిలోని శాంతినగర్ గ్రామ శివారులో ఉన్న ఎముకల మిల్లులో లోకాయుక్త అధికారులు గురువారం తనిఖీ నిర్వహించారు. దుర్వాసన వెదజల్లడం.. కార్మికులకు మౌలిక సదుపాయాలు కల్పించలేదంటూ అందిన ఫిర్యాదులతో లోకాయుక్త అధికారులు తనిఖీలు చేపట్టారు. కర్మాగారంలో పనిచేస్తున్న కూలీలను వివరాలు అడిగి తెలుసుకున్నారు. సుమారు 50 మందికి పైగా పనిచేస్తున్నారని, ఇతర రాష్ట్రాలకు చెందిన కార్మికులు కూడా పనిచేస్తున్నారని తెలిపారు. కార్మికుల ఆరోగ్య పరిస్థితి గురించి ఆరా తీశారు. ఎముకల పొడిని ఏ విధంగా తయారు చేస్తారో పరిశీలించారు. వాటిని దేనికి వాడతారని యజమానిని ప్రశ్నించారు. వివరాలను పైఅధికారుల దృష్టికి తీసుకెళ్తామని లోకాయుక్త అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో లోకాయుక్త అధికారులు మోతీ కోసియా, ఎమ్మార్వో హిమ బిందు, డిటి శ్రీధర్, ఇన్‌చార్జి ఆర్ఐ జానకి రామిరెడ్డి తదితర అధికారులు ఉన్నారు.

గర్శకుర్తిలో నేత కార్మికుల వంటావార్పు

- 8వ రోజు కొనసాగిన రిలే నిరాహార దీక్ష

నవతెలంగాణ - గంగాధర

కరీంనగర్ జిల్లా గంగాధర మండలం గర్శకుర్తి గ్రామంలో గురు వారం నేతకార్మికులు వంటావార్పు కార్యక్రమం చేపట్టారు. పవర్‌లూమ్స్ వస్త్ర పరిశ్రమకు వస్త్రోత్పత్తి ఆర్డర్లు అందించి ఉపాధి కల్పించాలని కోరుతూ నేతకార్మికులు చేపట్టిన రిలే నిరాహార దీక్ష 8వ రోజు కొనసాగింది. అందులో భాగంగా గ్రామంలోని బీటీ చౌరస్తాపై నేతకార్మికులు వంటావార్పు చేపట్టి రోడ్డుపై బైటాయించి.. అక్కడే భోజనం చేశారు. వస్త్ర పరిశ్రమపై ఆధారపడి బతికిన తాము 8 నెలలుగా పనులు లేక ఇబ్బంది పడుతున్నామని ఆవేదన చెందారు. గత ప్రభుత్వం అందించిన బతుకమ్మ చీరల ఆర్డర్లను ప్రస్తుత ప్రభుత్వం రద్దు చేసిందని, ప్రత్యామ్నాయంగా ఏదేని గుడ్డ ఉత్పత్తి ఆర్డర్లు కల్పించకపోవడంతో బతుకుదెరువు దినదిన గండంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. పదేండ్ల కిందటి పరిస్థితులు మళ్లీ పునరావృతం కాకుండా రాష్ట్ర ప్రభుత్వం పవర్‌లూమ్స్ వస్త్ర పరిశ్రమకు గుడ్డ ఉత్పత్తి ఆర్డర్లు కల్పించి వెన్నుదన్నుగా నిలవాలని కార్మికులు డిమాండ్ చేశారు.

అంకెల గారడీ !

ప్రాధాన్యతా రంగాలకు పెరగని కేటాయింపులు

- వ్యయ లక్ష్యాలపై గొప్పలు
- కేటాయింపులు లేకున్నా పథకాల ప్రకటన
- బడ్జెటరీ నిధులనూ ఖర్చు చేయని శాఖలు
- కేంద్ర బడ్జెట్‌పై ఆర్థిక నిపుణుల పెదవి విరుపు



న్యూఢిల్లీ : ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంటుకు సమర్పించిన కేంద్ర బడ్జెట్‌పై కార్పొరేట్ రంగం, ప్రభుత్వ అనుకూల మీడియా సంతోషాన్ని వ్యక్తం చేశాయి. ఎవరైనా ఎన్ని వరాలైనా కోరుకోవచ్చు. కానీ ఎవరి మనసునూ నొప్పించకపోతే అదే పెద్ద ఉపశమనం. సార్వత్రిక ఎన్నికల్లో ఎదురు దెబ్బలు తిన్న బీజేపీ, దాని నేతృత్వంలోని ప్రభుత్వం అసంతృప్తులను మచ్చిక చేసుకునే చర్యలను బడ్జెట్‌లో ప్రకటిస్తుందని అందరూ ఆశించారు. ప్రభుత్వ మనగడకు కీలకంగా ఉన్న రెండు మిత్రపక్షాలు...అంటే తెలుగుదేశం, జేడీయూ కూడా తమ రాష్ట్రాలకు భారీ ప్యాకేజీలు కోరాయి. వీరందరినీ సంతృప్తి పరిచేందుకు తీసుకునే చర్యలు తమపై అదనపు పన్నుల భారం మోపుతాయని, తద్వారా తమ లాభాలను తగ్గిస్తాయని కార్పొరేట్ రంగం భయపడింది. ఇప్పటికే దూరమైన మధ్య తరగతి ప్రజలపై ఎలాగూ అదనపు పన్నులు వేయలేదు. ఒక్క మాటలో చెప్పాలంటే సంఘటిత రంగం నుండి అదనపు ఆదాయాన్ని పొందుతారని అంచనా వేశారు. ఎందుకంటే ఎప్పుడైనా ఈ రంగమే ఎక్కువ పన్నులు చెల్లిస్తుంది. ప్రభుత్వానికి పన్నుయేతర వనరులు అందిస్తుంది. అదీకాక కోవిడ్ అనంతరం సంఘటిత రంగం వేగంగా అభివృద్ధి చెందుతోంది. ఆర్థిక వ్యవస్థలో దాని ఆదాయ వాటా పెరిగింది. మరిన్ని పన్నులు చెల్లించే సామర్థ్యం ఇప్పుడు ఆ రంగానికి ఉంది.

వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకొని గతంలో ప్రవేశపెట్టిన బడ్జెట్ల కంటే ఎన్నికల తర్వాత సమర్పించిన బడ్జెట్ భిన్నంగా ఉంటుందని ఆర్థికవేత్తలు ఆశించారు. నూతన ప్రాధాన్యతలకు చోటు కల్పించాలంటే బడ్జెట్ పరిమాణాన్ని పెంచాల్సిన అవసరం ఉంటుంది. అయితే ఈ పెరుగుదల కేవలం ఒక శాతం మాత్రమే ఉంది. గత సంవత్సరపు బడ్జెట్ పరిమాణం రూ.47.66 లక్షల కోట్లు కాగా ప్రస్తుత బడ్జెట్ పరిమాణం రూ.48.20 కోట్లు. ద్రవ్య లోటు పెరగకుండా ఉండేందుకు ఇలా చేశారని అనుకోండాం. అలాంటప్పుడు ప్రాధాన్యతలను మార్చుకోవాల్సి ఉంటుంది. ప్రాధాన్యతా రంగాలకు కేటాయింపులు పెంచి, ఇతర వ్యయాలను తగ్గించుకోవాలి. కానీ అలా జరగలేదు.

లక్ష్యాలు ఘనం

బడ్జెట్‌లో పెద్దగా మార్పులు లేకపోయినా అవి భారీగానే ఉన్నాయని చెప్పుకున్నారు. ప్రస్తుత బడ్జెట్‌లో స్వల్ప మొత్తాన్ని కేటాయించి, ఐదు సంవత్సరాల వ్యయ లక్ష్యాన్ని ప్రకటించారు. ఉదాహరణకు కోటి మంది యువతకు ఐదు వందల బడా కంపెనీలు ఇంటర్న్‌షిప్ అందిస్తాయని చెప్పారు. మాటలు ఘనంగానే విన్పించాయి కానీ అవి ఐదు సంవత్సరాలకు ఉద్దేశించిన లక్ష్యాలు. ఈ పథకాన్ని ఇంకా రూపొందించనే లేదు. కాబట్టి ప్రస్తుత బడ్జెట్‌లో నిధులు కేటాయించాల్సిన అవసరం ఉండదు. ఉపాధి కల్పనకు రూ. 10,000 కోట్లు కేటాయించామని ఘనంగా చెప్పుకొచ్చారు.

నిధుల ఊసు లేకున్నా పథకాల ప్రకటన

బడ్జెట్‌లో నిధులు కేటా యించకుండా పథకాలు ప్రకటించడం మరో ఎత్తుగడ. ఆర్థిక సంస్థల నుండి రుణాలు తీసుకొని ఈ పథకాలకు నిధులు సమకూరుస్తారు. ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతికి రూ.15,000 కోట్లు ప్రకటించడం ఈ కోవలోకే వస్తుంది. కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన సంస్థల నుండి రుణాలు తీసుకుంటారు. కాబట్టి బడ్జెట్‌లో ఎలాంటి కేటాయింపులు జరపాల్సిన అవసరం ఉండదు. అదే విధంగా ఆంధ్రప్రదేశ్, బీహార్ రాష్ట్రాల్లో మౌలిక సదుపాయాల కల్పన కోసం చేసిన భారీ ప్రకటనలకు సైతం ఇప్పుడు పెద్దగా డబ్బు అవసరం లేదు.

'రాష్ట్రాలకు బదిలీ' పద్దులో వాస్తవాలు

సంఘటిత రంగం నుండి అదనపు ఆదాయం వస్తుందని అంచనా వేశారు. ఆ రంగంలో పనులు ప్రారంభించడానికి పథకాలు రూపొందించాలి. కానీ అవి పూర్తికావడానికి సంవత్సరాల సమయం పడుతుంది. కాబట్టి నిధులు తర్వాత కేటాయించవచ్చు. వాస్తవానికి గతంలో ప్రకటించిన కొన్ని పథకాలు నత్తనడక నడుస్తున్నాయి. భవిష్యత్తులో కూడా అలాగే నడవవచ్చు. ఏపీ, బీహార్ రాష్ట్రాలకు ప్రస్తుత బడ్జెట్‌లో 'రాష్ట్రాలకు బదిలీ' అనే పద్దు కింద కేటాయింపులు జరిపారు. అయితే ఆ పద్దు కింద జరిపిన కేటాయింపుల్లో పెరుగుదల కన్పించడం లేదు. 2022-23 బడ్జెట్‌లో రూ.2,73,393 కోట్లు కేటాయించగా 2023-24 బడ్జెట్‌లో అది రూ.3,24,641కి పెరిగింది. ఖర్చును రూ. 2,73,985 కోట్లుగా చూపారు. అంటే అంతముందు సంవత్సరంలో ఎంత ఖర్చు పెట్టారో గత సంవత్సరంలోనూ అంతే చూపారు. ద్రవ్యోల్బణాన్ని సర్దుబాటు చేస్తే వాస్తవానికి ఈ పద్దు కింద ఖర్చు ఐదు నుండి ఆరు శాతం తగ్గింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో గత ఏడాది కంటే తక్కువగా అంటే రూ.3,22,787 కోట్లు కేటాయించారు.

బీహార్, ఏపీకి కొద్దో గొప్పో కేటాయింపులు జరిపి ఇతర రాష్ట్రాలపై వివక్ష చూపారన్న విమర్శలు వచ్చాయి. అదే సమయంలో అధికార పార్టీ పంచన చేరినందుకు తమకు కేటాయింపులు బాగానే జరిగాయని ఏపీ, బీహార్ సంబరపడుతున్నాయి.

కేటాయింపులు ఘనం.. ఖర్చు స్వల్పం

ద్రవోల్బణాన్ని అదుపులో ఉంచామని చెప్పుకోవడానికి కీలక పద్దులకు కేటాయింపులు పెంచారు. వ్యవసాయం, దాని అనుబంధ రంగాలకు కేటాయింపులను రూ. 1,44,214 కోట్ల నుండి రూ.1,51,851 కోట్లకు పెంచారు. అనేక రంగాలకు మాత్రం ద్రవ్యోల్బణానికి సర్దుబాటు చేస్తూ కేటాయింపులు తగ్గించారు. గ్రామీణ ఉపాధి హామీ పథకానికి గత సంవత్సరం మాదిరిగానే రూ.86,000 కోట్లు కేటాయించారు. అయితే వాస్తవంగా చూస్తే ఐదు శాతం తక్కువ. కొన్ని రంగాలకు నిధులు కేటాయించిన ప్పటికీ ఖర్చు మాత్రం తక్కువగానే చేస్తారు. ఆరోగ్య రంగాన్నే తీసుకుంటే 2023-24లో రూ.88,956 కోట్లు కేటాయించినా రూ.79,221 కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. ప్రస్తుత సంవత్సరంలో రూ.89,287 కోట్లు కేటాయించారు. ఖర్చు కంటే 12 శాతం పెరిగినట్లు కన్పించినా కేటాయింపుల పరంగా 0.03 శాతం మాత్రమే పెరిగింది. అణగారిన వర్గాల వారి కోసం ఉద్దేశించిన పలు పథకాలకు కేటాయింపులు తగ్గించడం గమనార్హం. ఆహారం, ఎరువుల సబ్సిడీలో సైతం రూ.35,000 కోట్ల కోత విధించారు.

మొత్తంగా చూస్తే కేంద్ర బడ్జెట్ దేశ ఆర్థిక వ్యవస్థ ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం చూపాల్సింది పోయి అంతర్జాతీయ సంస్థలు, సంఘటిత రంగాన్ని సంతృప్తి పరచేలా ఉన్నదని ఆర్థిక నిపుణులు పెదవి విరిచారు.

నేడే జాబ్ క్యాలెండర్

ఆరోగ్యశ్రీ, రేషన్‌కార్డులకు విడివిడిగా కార్డుల జారీ

- గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా కోదండరాం,అమీర్ అలీ
- మళ్లీ గవర్నర్‌కు ప్రతిపాదన
- క్రీడాకారులకు ఇండ్లస్థలాలు, ఉద్యోగాలు

(మొదటిపేజీ తరువాయి)

తెలంగాణ క్యాబినెట్ సంతాప తీర్మానం ఆమోదించింది. మృతుల కుటుంబాలకు సానుభూతి తెలియజేసింది. ప్రభుత్వం తరఫున అవసరమైన సహాయక చర్యలందించేందుకు నిర్ణయం చేసింది.

2. నిరుద్యోగులకు ఇచ్చిన మాట ప్రకారం ప్రతి ఏడాది నిర్దిష్టమైన కాల వ్యవధిలో ఉద్యోగ నియామకాలు చేపట్టేందుకు జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేయాలని మంత్రివర్గం తీర్మానించింది. శుక్రవారం అసెంబ్లీలో సీఎం రేవంత్ జాబ్ క్యాలెండర్ షెడ్యూల్‌ను ప్రకటిస్తారు.

3. రేషన్ కార్డుల జారీతో పాటు రాష్ట్ర ప్రజలందరి హెల్త్ ప్రొఫైల్‌తో హెల్త్ కార్డులను జారీ చేసేందుకు క్యాబినెట్ చర్చించింది. దీనికి సంబంధిం చిన విధి విధానాలను ఖరారు చేసేందుకు రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ్మ సభ్యులుగా పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చైర్మెన్‌గా మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఇక నుంచి రేషన్, ఆరోగ్యశ్రీ కార్డులను విడివిడిగా ఇవ్వాలని క్యాబినెట్ తీర్మానం చేసింది.

4. క్రీడాకారిణి ఈషా సింగ్, బాక్సర్ నిఖత్ జరీన్, క్రికెటర్ మహమ్మద్ సిరాజ్‌కు హైదరాబాద్‌లో ఒక్కొక్కరికి 600 చదరపు గజాల ఇంటి స్థలం కేటాయించేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. నిఖత్ జరీన్‌కు, సిరాజ్‌కు గ్రూప్ 1 స్థాయి ఉద్యోగాలు ఇవ్వాలని నిర్ణయించింది.

5. విధి నిర్వహణలో మరణించిన ఇంటెలిజెన్స్ డీజీ రాజీవ్ రతన్ కుమారుడు హరిరతన్‌కు మున్సిపల్ కమిషనర్(గ్రూప్-1) ఉద్యోగం ఇవ్వాలని మంత్రివర్గం తీర్మానించింది.

6 ఇటీవల విధి నిర్వహణలో చనిపోయిన అదనపు డీజీ పి.మురళి కుమారుడికి డిప్యూటీ తహసీల్దార్ ఉద్యోగం ఇవ్వాలని నిర్ణయం తీసుకుంది.

7. మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ నియోజకవర్గం హుస్నాబాద్‌లోని గౌరవెల్లి ప్రాజెక్టు పరిధిలో అసంపూర్తిగా నిలిచిపోయిన కుడి, ఎడమ కాల్వలు పూర్తి చేసేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. దాదాపు రెండు వేల ఎకరాల భూసేకరణ చేపట్టేందుకు అవసరమయ్యే నిధులతో సవరణ అంచనాలను రూపొందించాలని నిర్ణయం తీసుకుంది. ఇందుకు రూ.437 కోట్లను విడుదల చేసింది.

8.ఇటీవల రాష్ట్ర గవర్నర్ ప్రభుత్వానికి తిరిగి పంపించిన ఎమ్మెల్సీల నియామకానికి సంబంధించి క్యాబినెట్ చర్చించింది. కోదండరాం, అమేర్ అలీ ఖాన్ ల పేర్లను తిరిగి కొత్త గవర్నర్ ఆమోదానికి పంపించాలని నిర్ణయం తీసుకుంది.

9 నిజాం షుగర్ ఫ్యాక్టరీ పునరుద్ధరణకు తగిన చర్యలు చేపట్టాలని మంత్రివర్గం నిర్ణయించింది. రెండో విడతగా చెల్లించాల్సిన బకాయిల చెల్లింపులకు ఆమోదం తెలిపింది. అవసరమైతే ఇథనాల్, విద్యుత్తు ఉత్పత్తికి అక్కడి ఫ్యాక్టరీల్లో ఉన్న సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని భావించింది. పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు అధ్వర్యంలో ఇప్పటికే ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉపసంఘానికి ఆ బాధ్యతలు అప్పగించింది.

10. మల్లన్నసాగర్ నుంచి గోదావరి నీటితో శామీర్‌పేట చెర్వు నింపి, అక్కడి నుంచి హైదరాబాద్‌లో ఉన్న జంట జలాశయాలు ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్‌కు తరలించేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. మొత్తం 15 టీఎంసీలను తరలించి, అందులో 10 టీఎంసీలతో చెర్వులు నింపి, మిగతా నీటిని హైదరాబాద్ తాగునీటి అవసరాలకు వినియోగించాలని మంత్రివర్గం నిర్ణయించింది.

11. ధరణి పోర్టల్ పేరును భూమాతగా మారుస్తూ రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. ఈమేరకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీచేసింది. రైతు భరోసా అమలుకు విధివిధానాలు ఖరారు చేసినట్టు సమాచారం.

12. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్(జీహెచ్ఎంసీ) పరిధిలోకి ఔటర్ గ్రామాలు, శివారు మున్సిపాల్టీలు, మున్సిపల్ కార్పొరేషన్ల విలీనానికి మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. మంత్రులు డి. శ్రీధర్‌బాబు అధ్యక్షతన ధనసరి అనసూయ సీతక్క, పొన్నం ప్రభాకర్ గౌడ్ సభ్యులుగా ఉపసంఘాన్ని నియమించింది.

ప్రస్తుత నోటిఫికేషన్లలోనూ ఎస్సీ వర్గీకరణ అమలు చేస్తాం

- అవసరమైతే ప్రత్యేక ఆర్డినెన్స్ తీసుకొస్తాం
- ఎస్సీ వర్గీకరణపై తెలంగాణ ప్రభుత్వ కృషి ఫలించింది : సీఎం రేవంత్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీం కోర్టు తీర్పునిచ్చిన నేపథ్యంలో రాష్ట్రంలో ప్రస్తుతం విడుదల చేసిన నోటిఫికేషన్లలోనూ ఎస్సీ వర్గీకరణ అమలు చేసేందుకు ప్రయత్నిస్తామనీ, అవసరమైతే ప్రత్యేక ఆర్డినెన్స్ తీసుకొచ్చి ముందుకెళ్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఎస్సీ వర్గీకరణ అమలు చేసే అధికారం రాష్ట్రాలకే ఉందంటూ ఏడుగురు జడ్జీలతో కూడిన సుప్రీం కోర్టు బెంచ్ తీర్పునివ్వడాన్ని స్వాగతిస్తూ బుధవారం అసెంబ్లీలో ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గతంలో మాదిగ, మాదిగ ఉపకులాల వర్గీకరణపై అసెంబ్లీలో వాయిదా తీర్మానం ఇస్తే తనతో పాటు సంపత్‌కుమార్‌ను బీఆర్ఎస్ ప్రభుత్వం అసెంబ్లీ నుంచి సస్పెండ్ చేసిందని గుర్తుచేశారు. ఎస్సీ వర్గీకరణ కోసం ప్రధాని వద్దకు అఖిలపక్షాన్ని తీసుకెళ్తానని చెప్పి అప్పటి సీఎం కేసీఆర్ మాటతప్పారని విమర్శించారు. ఎస్సీవర్గీకరణకు కట్టుబడి ఉన్న తాము అధికారంలోకి రాగానే 2023 డిసెంబర్ 23న డిప్యూటీ సీఎం మల్లుభట్టి విక్రమార్క సూచనతో మంత్రి దామోదర రాజనర్సింహ, అడ్వకేట్ జనరల్‌ను సుప్రీం కోర్టుకు పంపామని చెప్పారు. వర్గీకరణపై సుప్రీంకోర్టులో న్యాయ నిపుణులతో వాదనలు వినిపించారన్నారు. ఈ విషయంలో తెలం గాణ ప్రభుత్వం చేసిన కృషి ఫలించిందన్నారు. వర్గీకరణపై సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తీర్పునకు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు చెబుతు న్నట్టు తెలిపారు. ఈ తీర్పునకు అనుగుణంగా దేశంలోనే ముందు వరుసలో ఎస్సీ రిజర్వేషన్లలో ఏబీసీడీ వర్గీకరణకు తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం తీసు కుంటుందని ప్రకటించారు. ప్రస్తుతం రాష్ట్రంలో విడుదల చేసి నోటిఫి కేషన్లలో కూడా మాదిగ, మాదిగ ఉపకులాలకు రిజర్వే షన్లు అమలు చేసేం దుకు చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు. సుప్రీం తీర్పును స్వాగతిస్తూ బీఆర్ఎస్ సభ్యులు హరీశ్‌రావు, బీజేపీ సభ్యులు ఏలేటి మహే శ్వర్‌రెడ్డి, మంత్రులు దామోదర రాజనర్సింహ్మ, విప్ అడ్లూరి లక్ష్మణ్, కాంగ్రెస్ సభ్యు లు ఎం.సామేలు, కవ్వంపల్లి సత్యనారాయణ, వేముల వీరేశం మాట్లాడారు.

15 మంది చిన్నారులపై వీధి కుక్కల దాడి

బాలానగర్ : వీధి కుక్కలు కాలనీల్లో స్వైర విహారం చేస్తూ 15 మంది చిన్నారులపై దాడి చేశాయి. ఈ ఘటనలు హైదరాబాద్ బాలనగర్‌లో జరిగాయి. గాయ పడిన వారిలో మూడేండ్ల చిన్నారి కూడా ఉంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం బాలానగర్‌లో నడుచుకుంటూ వెళ్తున్న ఓ బాలుడిపై కుక్క దాడి చేసింది. గమనించిన స్థానికులు అతన్ని కాపాడి ఆస్పత్రికి తరలిం చారు. ఆ తర్వాత సాయినగర్, వినాయక్ నగర్, రాజు కాలనీల్లో కుక్కలు మరో 14 మంది చిన్నారులపై దాడి చేశాయి. వారిలో ఏడాదిన్నర వయస్సు నుంచి 16 ఏండ్ల వయస్సు చిన్నారులు ఉన్నారు. వారిని చికిత్స నిమిత్తం స్థానిక ఆస్పత్రికి తరలించారు. కాలనీ వాసుల ఫిర్యాదుతో డాగ్‌స్క్వాడ్ సిబ్బంది కుక్కలను పట్టుకుంది. ఏడాది కిందట ఇదే ప్రాంతంలో ఓ కుక్క 10 మందిపై దాడి చేసింది. వరుస ఘటనలతో స్థానికులు ఇంటి నుంచి బయటకు రావాలంటే భయాందోళనకు గురవుతున్నారు.

డెంగ్యూతో గర్భిణీ మృతి

శాయంపేట : డెంగీ జ్వరంతో బాధపడుతున్న ఎనిమిది నెలల గర్భిణీ చికిత్సపొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందింది. గర్భంలోని శిశువులను దక్కించుకోవడానికి శస్త్ర చికిత్స చేసినా కవల పిల్లలు అప్పటికే మరణించడంతో కుటుంబసభ్యుల రోదనలు మిన్నంటాయి. ఈ ఘటన హన్మకొండ జిల్లా శాయంపేట మండలంలోని గట్లకానీపర్తి గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గట్లకానీపర్తి గ్రామానికి చెందిన బొమ్మకంటి రాజేందర్‌కు.. పరకాల మండలం మల్లక్కపేట గ్రామానికి చెందిన దొమ్మాటి శిరీషను రెండేండ్ల క్రితం జులై 31న వివాహం జరిగింది. ప్రస్తుతం ఆమె ఎనిమిది నెలల గర్భవతి కాగా ఆదివారం జ్వరం రావడంతో సోమవారం హన్మకొండలోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తీసుకెళ్లారు.



తేనెటీగల పెంపకంతో...



దృఢత్వానికి, కృషికి అసలైన చిహ్నం రైతు. ఎలాంటి వాతావరణ పరిస్థితులనైనా తట్టుకొని అవిశ్రాంత కృషి చేస్తారు. సాంప్రదాయ వ్యవసాయానికి అతీతంగా.. పశుపోషణ, చేపల పెంపకం, తేనెటీగల పెంపకం వంటి రంగాల్లోనూ రైతులు నేడు ముందుకు సాగుతున్నారు. అందులో మహిళా రైతులది ప్రత్యేక పాత్ర. ఇటు కుటుంబ బాధ్యతలు.. అటు వ్యవసాయ పనులు సమతుల్యం చేసుకుంటూ విభిన్న పాత్రలను పోషిస్తుంటారు. బీబీ అమర్‌జిత్ కౌర్ చాందీదీ అదే కోవ. అంకితభావం, నూతన ఆవిష్కరణ ద్వారా తన జీవితాన్నే కాదు.. అనేక మంది జీవితాలను మార్చిన స్ఫూర్తిదాయకమైన మహిళా రైతు గురించి పరిచయం నేటి మానవిలో...



పంజాబ్‌లోని కపుర్తలా జిల్లా, బూల్‌పూర్ గ్రామంలో స్థిరపడిన చాందీ కుటుంబంలోని వ్యక్తితో బీబీ అమర్‌జిత్ కౌర్ వివాహం 1993లో జరిగింది. తరతరాలుగా వ్యవసాయంలో నిమగ్నమైన కుటుంబం చాందీలది. కానీ వాతావరణ పరిస్థితులు, ప్రకృతి వైపరీత్యాలు... ఎప్పుడూ నష్టాలే. కాగా, సంగీతంలో పోస్ట్ గ్రాడ్యుయేట్ డిగ్రీ చేసిన అమర్‌జీత్... ఆ రంగంలో ఉద్యోగావకాశాలు సరిగా లేక ఇంటిపట్టునే ఉండాల్సి వచ్చింది.

ప్రారంభం ఇలా..

సవాళ్లు ఎదురవుతున్నా... వ్యవసాయాన్ని మరింత లాభదాయకంగా మార్చేందుకు అమర్‌జిత్ మార్గాలను అన్వేషించడం ప్రారంభించింది. ఈ క్రమంలో తేనెటీగల పెంపకంలో సాధ్యాసాధ్యాలను, లాభనష్టాలను పరిశీలించింది. చేయగలనన్న నమ్మకం, విశ్వాసం ఆమెలో కలిగాయి. ఇంట్లో ఒప్పించి తేనెటీగల పెంపక క్షేత్రాన్ని ప్రారంభించాలనుకుంది. దానికి చాందీ ఫామ్‌గా నామకరణం కూడా చేయాలని నిర్ణయించుకుంది.

తేనెటీగల ప్రపంచంలోకి..

అమర్‌జిత్ 1995 మార్చిలో తేనెటీగల పెంపక ప్రపంచంలోకి తొలి అడుగు వేసింది. 'వ్యవసాయంలో నష్టాలను ఎదుర్కొంటున్న నేను కొత్తగా ఈ రంగంలోకి అడుగుపెట్టాలంటే తొలుత భయపడ్డాను. కానీ, భర్త ప్రోత్సాహం, సహకారంతో ముందుకు సాగాను. కేవీకే, కపుర్తలాలో నిర్వహించిన వివిధ శిక్షణా కార్యక్రమాల ద్వారా తేనెటీగల పెంపకంపై మంచి అవగాహన వచ్చింది. 1995 ఏప్రిల్‌లో ప్రత్యక్ష కార్యాచరణకు దిగాను. మొదట్లో 50 కాలనీలతో ప్రారంభించాను' అని అమర్‌జిత్ గుర్తుచేసుకున్నారు. చాందీ కుటుంబం అప్పటికే పొద్దుతిరుగుడు, ఆవాల సాగులో నిమగ్నమై ఉంది. 'నాకంటూ ఓ ప్రత్యేకతను చాటుకోవాలనుకున్నాను. అందుకే ఈ తేనెటీగల పెంపకాన్ని ఎంచుకున్నాను..' అని ఆమె చెప్పింది.

హనీ ప్రాసెసింగ్ ప్లాంట్ టెక్నాలజీ

2013లో.. పంజాబ్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో 'హనీ ప్రాసెసింగ్ ప్లాంట్ టెక్నాలజీని ఇన్‌స్టాల్ చేసారు. ఇది వీరు ఉత్పత్తి చేసిన తేనె నాణ్యత, మార్కెట్‌ను గణనీయంగా పెంచింది. దీంతో ఆమె తన ప్లాంట్‌ను మరింత విస్తరించింది. రాణి తేనెటీగల ఉత్పత్తి, రాయల్ జెల్లీ, తేనెటీగల పుప్పొడిలో ప్రత్యేక శిక్షణ తీసుకున్నారు. వారి ఆదాయాన్ని మరింత పెంచడంలో ఇది ఎంతో తోడ్పడింది. అంతేకాదు.. ఇతర రైతులను సైతం ప్రోత్సహించారు. వీటి పెంపకంలో మెళకువలను వారికి అందించారు. నేడు, వారి తేనెటీగల పెంపక వెంచర్ 400 కాలనీలకు పెరిగింది.

> **గుర్తింపులు, అవార్డులు**
>
> మార్చి 2008లో పంజాబ్ అగ్రికల్చరల్ యూనివర్శిటీలో జరిగిన కిసాన్ మేళాలో ముఖ్యమంత్రి అవార్డు, నవంబర్ 2018లో న్యూఢిల్లీలోని డీడీ కిసాన్ ఛానెల్ ద్వారా 'మహిళా కిసాన్ అవార్డు'లు ఆమెను వరించాయి. దీంతో ఆమెకు మంచి గుర్తింపు వచ్చింది.

స్వయం సహాయక బృందాల ఏర్పాటు

1996లో ఆమె స్వయం సహాయక బృందం 'చండీ ఉద్యోగ సమితి'ని స్థాపించింది. ఆ తర్వాత 2005లో బేబే నాంకి అనే మరో స్వయం సహాయక బృందాన్ని ఏర్పాటుచేసింది. ఈ గ్రూపులు అనేక మందికి ఉపాధి అవకాశాలను అందించాయి. 'స్వయం-సహాయక గ్రూపు(ఎస్‌హెచ్‌జీ)లను ఏర్పాటుచేయడం కేవలం వ్యాపారానికే కాదు. ఇది సమాజాన్ని నిర్మించడం, ఉపాధి కల్పించడం, పరస్పర సహకారం కోసం' అని అమర్‌జిత్ అభిప్రాయం. 1996లో మొదటిగా ఎస్‌హెచ్‌జీని స్థాపించిన తర్వాత.. అమర్‌జిత్ ఇతర రంగాలపైనా దృష్టిసారించింది. ఊరగాయ తయారీలో శిక్షణ పొందడం ద్వారా తన వ్యాపారాన్ని వైవిధ్యభరితంగా మార్చుకుంది. ఊరగాయలతోపాటు.. పసుపు ఉత్పత్తి, పొడి విక్రయాలనూ మొదలుపెట్టింది. ఇది వారి ఆదాయాన్ని మరింత పెంచింది.

ఇతర రైతులకూ శిక్షణ

అమర్‌జిత్ ఇప్పటివరకూ దాదాపు 900 మంది రైతులకు తేనెటీగల పెంపకం, సంబంధిత కార్యకలాపాల్లో శిక్షణ ఇచ్చింది. మా విజయాల్లో రైతులకు శిక్షణ ముఖ్యమైనది. మనం సంపాదించిన జ్ఞానాన్ని ప్రతి ఒక్కరికీ పంచాలి. అప్పుడే సమాజం అభివృద్ధి పథంలో నడుస్తుంది' అని అమర్‌జిత్ అంటోంది. కృషి విజ్ఞాన కేంద్రం, కపుర్తలా, వ్యవసాయ శాఖ సహకారంతో ఆరు వందలకుపైగా కిసాన్ గోష్ఠిలు, శిక్షణా శిబిరాలను ఆమె నిర్వహించింది.


ఓ వైపు జీవ వైవిధ్యాన్ని, పర్యావరణాన్ని కాపాడుతూ తన కుటుంబానికి ఆదాయం సమకూర్చటమే కాదు.. పంటలకు ప్రాణం పోస్తూ ఆదర్శంగా నిలుస్తున్నది. బీబీ అమర్‌జిత్ కౌర్ చాందీ అంకితభావం అనేకమందికి స్ఫూర్తిదాయం. పట్టుదల కృషి ఉంటే సాధించలేనిదేదీ లేదని ఆమె ప్రయాణం మరోసారి రుజువు చేస్తున్నది.

- కె లలిత



మీరు డేంజర్‌లో ఉన్నట్లే..!

ప్రస్తుత కాలంలో ప్రతి ఒక్కరి చేతిలో మొబైల్ ఫోన్ తప్పనిసరి అయింది. ప్రజలు ఎక్కువ సమయం మొబైల్‌లోనే గడుపుతున్నారు. అయితే చాలా మంది నిద్ర లేవగానే పక్కనే ఉన్న ఫోన్ పట్టుకుంటారు. అలా చేయడం వల్ల చాలా ప్రమాదాలు ఉన్నాయి. మరి అవేంటో తెలుసుకుందామా..!



మీరు ఉదయం నిద్రలేచిన వెంటనే మీ మొబైల్ ఫోన్ ఉపయోగిస్తుంటే, అది మీ మెదడుపై చెడు ప్రభావం చూపుతుంది. ఫోన్ ఎక్కువగా వాడిన తర్వాత డిప్రెషన్ వస్తుందని చాలా నివేదికల్లో వెల్లడైంది.

ఉదయం లేవగానే మొబైల్ ఫోన్‌లో స్క్రోలింగ్ చూస్తుంటే మనశ్శాంతి దెబ్బతింటుంది. దీని వల్ల మెదడు ఒత్తిడికి గురవుతుంది. ఇది రోజువారి జీవితంపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతుంది.

ఎక్కువగా మొబైల్ వాడకం చికాకుకు దారితీస్తుంది. తెల్లవారుజామున నిద్రలేచి ఎక్కువసేపు మొబైల్ ఫోన్లలో గడిపే వారికి ఎక్కువగా కోపం వస్తుంది.

ఉదయం లేవగానే ఫోన్ ఉపయోగించడం వల్ల మీ ఏకాగ్రత తగ్గుతుంది. దీనితో పాటు, మీ ఉత్పాదకతా తగ్గుతుంది.

ఉదయం పూట ఫోన్ వాడే అలవాటు వల్ల కొందరికి ఎక్కువ ఆకలి వేస్తుంది. ఇది ఆహారానికి సంబంధించిన సమస్యలను కూడా కలిగిస్తుంది.

జూరాల 46 గేట్లు ఎత్తివేత

కొనసాగుతున్న విద్యుదుత్పత్తి

శ్రీశైలంలోకి భారీగా ప్రవాహం



నవతెలంగాణ- ధరూరు

జోగులాంబ గద్వాల జిల్లా ధరూర్ మండల పరిధిలోని ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు 46 గేట్లు ఎత్తి శ్రీశైలం ప్రాజెక్టులోకి వదిలారు. ఎగువన నారాయణపూర్ డ్యాం నుంచి 3 లక్షల 12వేల క్యూసెక్కుల నీరు జూరాలకు వస్తోంది. జూరాల 46గేట్ల ద్వారా 2 లక్షల 98వేల 827క్యూసెక్కుల నీటిని శ్రీశైలం జలాశయంలోకి వదులుతున్నట్టు పీజేపీ అధికారులు తెలిపారు. జూరాల ప్రాజెక్టులో 317.680 అడుగుల నీటిమట్టం ఉంది. నెట్టెంపాడుకు 750 క్యూసెక్కుల నీరు, కోయిలసాగర్‌కు 630 క్యూసెక్కుల నీరు, లెఫ్ట్ కెనాల్ కాల్వకు 820 క్యూసెక్కుల నీరు, రైట్ కెనాల్‌కు 658 ఫైనల్ కాల్వకు 850 క్యూసెక్కుల నీరు, భీమా లిఫ్ట్-2కు 750 క్యూసెక్కుల నీరు వదులుతున్నారు. జూరాల ప్రాజెక్టు నుంచి మొత్తం దిగువకు 3 లక్షల 20వేల 392 క్యూసెక్కుల నీటిని శ్రీశైలంలోకి వదులుతున్నట్టు అధికారులు తెలిపారు.

ఒంటరైన వారి కోసం ప్రత్యేక శిబిరాలు

వారి సమాచారాన్ని గోప్యంగా ఉంచుతాం

- శిబిరాలకు ఉపాధ్యాయులను పంపుతాం
- వాయనాడ్‌లో పినరయి పర్యటన
- అధికారులతో భేటీ... పార్టీలతో అఖిలపక్ష సమావేశం
- బాధిత ప్రాంతాల్లో రాహుల్, ప్రియాంక పర్యటన





వాయనాడ్ : కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ గురువారం వాయనాడ్‌లో పర్యటించారు. కొండచరియలు విరిగిపడిన ప్రాంతాల్లో ఏరియల్ సర్వే జరిపారు. జరిగిన విధ్వంసాన్ని పరిశీలించారు. సహాయ కార్యక్రమాలను పర్యవేక్షించారు. అనంతరం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో తన క్యాబినెట్ సహచరులతో కలిసి అధికారులతో ఉన్నత స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. సహాయ, పునరావాస చర్యలపై ఆరా తీశారు.

ఆ తర్వాత అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ కుటుంబసభ్యులందరినీ కోల్పోయి ఏకాకులుగా మిగిలిన వారి కోసం వాయనాడ్‌లో ప్రత్యేకంగా సహాయ శిబిరాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. శిబిరాలలో ఉన్న వారి ప్రశాంతతను కాపాడేందుకు ప్రవేశాలపై ఆంక్షలు విధిస్తామని చెప్పారు. 'సందర్శకుల పేర్లను నమోదు చేసేందుకు జిల్లా అధికారులు రిసెప్షన్ డెస్కులు ఏర్పాటు చేస్తారు. సమావేశాలు, ఇంటర్వ్యూలకు ఉమ్మడి ప్రదేశం ఉంటుంది. శిబిరాలలోకి కెమేరాలను అనుమతించం' అని తెలిపారు. కుటుంబసభ్యులు, బంధువులు, నివాసాలు, జీవనోపాధి...వీటన్నింటినీ కోల్పోయిన వారి కోసం ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేస్తామని వివరించారు. జరిగిన విధ్వంసం నుండి తేరుకునేందుకు, మానసిక ఆరోగ్యం కుదుటపడేందుకు బాధితులకు కౌన్సిలింగ్ ఇప్పిస్తామని, వారి సమాచారాన్ని గోప్యంగా ఉంచుతామని చెప్పారు. బయట నుండి శిబిరాలలోకి ఆహారం, దుస్తులు, ఇతర సామగ్రిని అనుమతించబోమని స్పష్టం చేశారు. అవన్నీ జిల్లా అధికారుల ద్వారానే బాధితులకు అందుతాయని తెలిపారు. సహాయ శిబిరాలకు ఉపాధ్యాయులను పంపి, విద్యార్థుల చదువులు దెబ్బతినకుండా చూస్తామని పినరయి చెప్పారు. బాధిత ప్రాంతాలలో అంటువ్యాధులు ప్రబలకుండా చూడడమే తన ప్రభుత్వ ప్రాధాన్యత అని అన్నారు. చలియార్ నదిలో ఇంకా మృతదేహాలు కొట్టుకువస్తూనే ఉన్నాయని తెలిపారు. ఇరువజంజిపుజా నదిపై ఉన్న బ్రిడ్జి కూలిపోవడంతో సహాయక చర్యలకు ఆటంకం ఏర్పడిందని, అయితే నదిపై బెయిలీ బ్రిడ్జిని సైనికులు నిర్మించడంతో పరిస్థితి చక్కబడిందని చెప్పారు. శిథిలాలను తొలగించే పని పూర్తి కావడానికి వారాలు లేదా నెలలు పట్టవచ్చునని అన్నారు. గాలింపు చర్యలు పూర్తయిన తర్వాత బాధితులకు పునరావాస పథకాన్ని ఖరారు చేస్తామని తెలిపారు. వాయనాడ్‌లో కార్యక్రమాలను క్యాబినెట్ సబ్ కమిటీ పర్యవేక్షిస్తుందని పినరయి ప్రకటించారు.

కాగా ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఆయన సోదరి ప్రియాంక గాంధీ కూడా వాయనాడ్‌లోని చూరల్‌మాల ప్రాంతాన్ని సందర్శించారు. బాధిత కుటుంబాలతో ముచ్చటించారు.

పార్లమెంట్ లాబీలో వర్షపు నీరు

వందలకోట్లు బూడిదలో పోసిన పన్నీరే

- బయటేమో పేపర్ లీకేజీ...లోపలేమో వాటర్ లీకేజీ.
- నూతన భవన నిర్మాణంపై ప్రతిపక్షాలు ఆగ్రహం
- పాత భవనంలోనే సమావేశాలు నిర్వహించాలని అఖిలేశ్ సూచన



న్యూఢిల్లీ : వందేండ్లు దాటిన పాత పార్లమెంట్ భవనం ఇప్పటికీ చెక్కుచెదర్లేదు. ఎన్డీఏ సర్కార్ వందలకోట్లు ఖర్చుపెట్టి హడావుడిగా కట్టిన నూతన పార్లమెంట్ భవనం లాబీలో వర్షపు నీరు కారుతోంది. సిబ్బంది బకెట్ పెట్టి .. ఆ నీటిని పారేస్తున్నారు. ఇప్పుడు వర్షపు నీరే కారుతోంది. మున్ముందు సమావేశమందిరాలు కాస్త స్విమ్మింగ్ పూల్స్‌గా మారటం ఖాయమన్న చర్చ నడుస్తోంది.

లీకేజీ వీడియో హల్‌చల్

పార్లమెంట్ లాబీలో నీరు లీకేజీ అవడం పాలక ఎన్డీఏను ఇబ్బంది పెడుతోంది. రాజధానిలో భారీ వర్షాలు పడుతుండడంతో పార్లమెంట్ లాబీలో నీరు చేరింది. దీనికి సంబంధించిన వీడియోను ప్రతిపక్ష కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీల ఎంపీలు సామాజిక మాధ్యమంలో షేర్ చేశారు. ఈ అంశంపై కాంగ్రెస్ ఎంపీ మాణిక్‌రామ్ ఠాకూర్ లోక్‌సభలో వాయిదా తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. నూతన పార్లమెంట్ భవనం నిర్మాణం కోసం బీజేపీ ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు చేసిందని, ఇప్పుడేమో వర్షపు నీరు పడుతోందని సమాజ్‌వాదీ పార్టీ నేత అఖిలేశ్ యాదవ్ మండిపడ్డారు. సమావేశాలను పాత భవనంలోనే నిర్వహించాలని కోరారు.

బయటేమో పేపర్ లీకేజీ... లోపలేమో వాటర్ లీకేజీ

'బయటేమో పేపర్ లీకేజీ...లోపలేమో వాటర్ లీకేజీ. రాష్ట్రపతి ఉపయోగించిన పార్లమెంట్ లాబీలో వర్షపు నీరు లీక్ కావడం చూస్తుంటే కొత్త భవనంలో వాతావరణ సంబంధమైన సమస్యలు ఉన్నాయని అర్థమవుతోంది. నూతన భవనం ప్రారంభించి కేవలం సంవత్సరం మాత్రమే అయింది' అని మాణిక్‌రామ్ ఠాకూర్ సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్ట్ చేశారు. సమాజ్‌వాదీ పార్టీ అధినేత, ఎంపీ అఖిలేష్ యాదవ్ మరో అడుగు ముందుకు వేసి మిగిలిపోయిన వర్షాకాల సమావేశాలను పాత భవనంలో నిర్వహించాలని ప్రభుత్వాన్ని కోరారు. 'దీని కంటే పాత పార్లమెంటే బాగుంది. అక్కడికి మాజీ ఎంపీలు కూడా వచ్చి కలిసేవారు. కోట్లాది రూపాయలు ఖర్చు చేసి కట్టిన నూతన భవనంలో నీరు కారడం ఆగేంతవరకూ మనం పాత పార్లమెంటుకు ఎందుకు వెళ్లకూడదు?' అని ట్వీట్ చేశారు. బీజేపీ ప్రభుత్వ హయాంలో నిర్మించిన ప్రతి కొత్త పైకప్పు నుండి ఇలా నీరు కారడం వారి అద్భుతమైన ఆలోచనల రూపకల్పనలో భాగమేనా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారని చమత్కరించారు.

రాజధానిలో గత 24 గంటల్లో 108 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. గత 14 సంవత్సరాల్లో జూలై నెలలో ఒక రోజు ఈ స్థాయిలో వర్షపాతం నమోదు కావడం ఇదే మొదటిసారి. భారీ వర్షం కారణంగా జనజీవనం స్తంభించింది. తొమ్మిది మంది ప్రాణాలు కోల్పోయారు. నివాస ప్రాంతాల్లోకి వర్షపు నీరు వచ్చి చేరింది.

ఇరవై వేల కోట్ల రూపాయల సెంట్రల్ విస్టా పునరభివృద్ధి ప్రాజెక్టులో భాగంగా నూతన పార్లమెంట్ భవనాన్ని నిర్మించారు. దీనిని గత సంవత్సరం మే 28న ప్రధాని నరేంద్ర మోడీ ప్రారంభించారు. దీని నిర్మాణానికి రూ.862 కోట్లు ఖర్చయ్యాయి. నూతన భవన ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని కాంగ్రెస్ సహా పలు ప్రతిపక్ష పార్టీలు బహిష్కరించిన విషయం తెలిసిందే.

వర్గీకరణకు ఓకే

(మొదటి పేజీ తరువాయి)

సూచించారు. ఎస్సీ, ఎస్టీలలోని కొన్ని తరగతుల వారు శతాబ్దాల తరబడి అణచివేతకు గురవుతున్నారని గుర్తు చేశారు. కాగా రాష్ట్రాలు తమ వద్ద ఉన్న కులాల సమాచారం ఆధారంగా వర్గీకరణ జరపాలని, అంతే తప్ప తమ ఇష్టాను సారం నిర్ణయం తీసుకోరాదని న్యాయస్థానం తన తీర్పులో తెలిపింది. వివక్ష కారణంగా ఎస్సీ, ఎస్టీలు అభివృద్ధికి నోచుకోవడం లేదని చెప్పింది.

కేంద్రం సమర్థన

ఎస్సీ, ఎస్టీల ఉపవర్గీకరణను కేంద్ర ప్రభుత్వం సమర్థించింది. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల వర్గీకరణ ద్వారానే సామాజిక న్యాయం సాధ్యపడుతుందని కేంద్ర ప్రభుత్వం ఫిబ్రవరిలో సుప్రీంకోర్టుకు తెలియజేసింది. అందరికీ సమానా వకాశాలు కల్పించాలన్న లక్ష్యం ఉపవర్గీకరణ ద్వారా మాత్రమే సాధ్యపడుతుందని కేంద్రం తరఫున వాదనలు వినిపించిన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా తెలిపారు. వాదనలు విన్న అనంతరం ధర్మాసనం ఫిబ్రవరిలో తన తీర్పును రిజర్వ్ చేసింది.

ఏమిటీ కేసు?

వాల్మీకులు, మఝాబీ సిక్కులకు 50 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ పంజాబ్ ప్రభుత్వం తీసుకొచ్చిన నిబంధనను 2010లో పంజాబ్-హర్యానా హైకోర్టు కొట్టివేసింది. దీనిని సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో 23 పిటిషన్లు దాఖలయ్యాయి. హైకోర్టు నిర్ణయంపై పంజాబ్ ప్రభుత్వం 2011లో సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఎస్సీ వర్గీకరణ కోసం మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎంఆర్‌పీఎస్) కూడా చాలా కాలం నుండి న్యాయ పోరాటం చేస్తోంది. అంతకుముందే... ఎస్సీ కోటాలో ఉప వర్గీకరణ రాజ్యాంగంలోని ఆర్టికల్ 14కు విరుద్ధమని ఈవీ చిన్నయ్య వర్సెస్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కేసులో 2004లో సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది. 2020లో ఐదుగురు సభ్యుల సుప్రీం బెంచ్ ఈ తీర్పును తప్పుపట్టింది. దీనిపై పునఃసమీక్ష కోసం కేసును ఏడుగురు సభ్యుల ధర్మాసనానికి నివేదించింది. తాజాగా ఉప వర్గీకరణపై ఆ ధర్మాసనం తుది తీర్పు వెలువరించింది.

ఇక రాష్ట్ర ప్రభుత్వాలదే బాధ్యత

(మొదటి పేజీ తరువాయి)

సదుపాయాలు అందేలా చూసేందుకు అవసరమైన చర్యలను ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వాలు తప్పనిసరిగా తీసుకోవాల్సి వుందని పేర్కొంది. ఎస్సీల్లోని వెనుకబడిన వర్గాలను నిర్ణయాత్మక చర్యల పరిధిలోకి తీసుకువచ్చేలా తగు చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ఇక రాష్ట్ర ప్రభుత్వాలదేనని అందుకు తగినట్లు రాష్ట్ర ప్రభుత్వాలు కసరత్తు చేయాల్సి వుందని పొలిట్‌బ్యూరో పేర్కొంది.

మార్గదర్శకాలు వచ్చే వరకు ఉద్యోగ నియామకం చేయొద్దు

తెలుగు రాష్ట్రాలు సుప్రీం తీర్పును అమలు చేయాలి : ఎంఆర్‌పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ

ఎస్‌సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పుకు అనుగుణంగా మార్గదర్శకాలు వచ్చే వరకు తెలుగు రాష్ట్రాల్లో ఉద్యోగాల నియామకం చేయొద్దని ఎంఆర్‌పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ డిమాండ్ చేశారు. ఎస్‌సీ, ఎస్‌టీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చిన నేపథ్యంలో గురువారం నాడిక్కడ మందకృష్ణ మాదిగ మీడియాతో మాట్లాడారు. సుప్రీంకోర్టు తాజా తీర్పును తెలుగు రాష్ట్రాల్లో విద్యా, ఉద్యోగ నియామకాల్లో అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వాల దగ్గర ఎస్‌సీ, ఎస్‌టీ జనాభా లెక్కలు ఉన్నాయని, కాబట్టి ప్రస్తుతం ఉన్న ఉద్యోగ నియామకాల్లో కూడా అమలు చేయాలని డిమాడ్ చేశారు. ఇది మాదిగల విజయమని, మాలల విజయం కాదని తాను చెప్పలేనని అన్నారు. సుప్రీంకోర్టు న్యాయం వైపు తీర్పు చెప్పిందని, ధర్మమే గెలిచిందని పేర్కొన్నారు.

సుప్రీం తీర్పును సమర్థిస్తున్నాం : ఎఐఎడబ్ల్యుయు ప్రధాన కార్యదర్శి బి.వెంకట్

ఎస్‌సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పును సమర్థిస్తున్నామని ఎఐఎడబ్ల్యుయు ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ తెలిపారు. గురువారం నాడిక్కడ ఏపీ, తెలంగాణ భవన్‌లో బి. వెంకట్ మీడియాతో మాట్లాడారు. దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్నటువంటి ఉప కులాల వర్గీకరణ సమస్యపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును సమర్థిస్తున్నామని అన్నారు. ఎస్‌సీ వర్గీకరణ జరిగినప్పుడు గతంలో తాము మద్దతు ఇచ్చామని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలు సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలను అమలుపరిచేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని, జాప్యం చేయొద్దని కోరుతున్నామని అన్నారు. ఉప కులాల్లో ఉన్న సమస్యలు అన్నదమ్ముల లాంటివని, వర్గ వైరుధ్యాలు కాదని పేర్కొన్నారు. వాటిని సామరస్యంగా పరిష్కరం చేసుకోవాలని తొలి నుంచి తాము చెబుతున్నామని చెప్పారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు అమలు జరగాలంటే కేంద్ర ప్రభుత్వం తక్షణం ప్రయివేట్ రంగంలో రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు.

> **ఎస్‌సీ వర్గీకరణను స్వాగతిస్తున్నాం : సీపీఐ జాతీయ కార్యదర్శి కె. నారాయణ**
>
> ఎస్‌సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ అన్నారు. గురువారం నాడిక్కడ స్థానిక ఏపీ, తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. మాదిగలకు అన్యాయం జరిగిందనేది వాస్తవమని అన్నారు. సుప్రీంకోర్టు తీర్పును రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు.

నవచిత్రం



అశ్విన్‌బాబు

మెడికో థ్రిల్లర్‌లో అశ్విన్‌బాబు

డిఫరెంట్ సబ్జెక్ట్స్‌తో ప్రేక్షకులను అలరిస్తున్న హీరో అశ్విన్ బాబు మరో ఎగ్జైటింగ్ ప్రాజెక్ట్‌తో రాబోతున్నారు. మెడికో థ్రిల్లర్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రానికి మామిడాల ఎం.ఆర్.కృష్ణ దర్శకత్వం వహిస్తున్నారు. అరుణ శ్రీ ఎంటర్టైన్మెంట్స్ ప్రొడక్షన్ నెంబర్.3గా రూపొందుతున్న ఈ చిత్రాన్ని నిర్మాత టి. గణపతి రెడ్డి లావిష్‌గా నిర్మిస్తున్నారు.

గురువారం అశ్విన్ బాబు పుట్టిన రోజు సందర్భంగా చిత్ర యూనిట్ ఆయనకి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియచేస్తూ స్పెషల్ పోస్టర్ రిలీజ్ చేసింది. సినిమాపై ఈ పోస్టర్ చాలా క్యూరియాసిటీని పెంచింది.

ఈ చిత్రంలో అశ్విన్ బాబుకి జోడిగా రియా సుమన్ నటిస్తుండగా అయేషా ఖాన్, మురళీ శర్మ, సచిన్ ఖడేకర్, అజయ్, గణేష్, యెష్నా చౌదరి, సుదర్శన్, శకలక శంకర్, రాఘవ కీలక పాత్రలు పోషిస్తున్నారు.

ఈ చిత్రం హైదరాబాద్, వైజాగ్, కొడయ్ కేనాల్‌ల్లో 75% షూటింగ్ పూర్తి చేసుకుంది. ఈ సంవత్సరం చివరిలో ప్రేక్షకులు ముందుకి రాబోతుంది.

ఈ చిత్రానికి స్టోరీ - స్క్రీన్ ప్లే - డైరెక్షన్ : మామిడాల ఎం.ఆర్.కృష్ణ, నిర్మాత : టి. గణపతి రెడ్డి, లైన్ ప్రొడ్యూసర్ : బద్రి నాథ్ రెడ్డి, డీవోపీ : ఎం.ఎన్.బాల్‌రెడ్డి, మ్యూజిక్ : గౌర హరి, ఎడిటర్ : విప్లవ్ నైషదం, ఫైట్స్ : పృథ్వి, ఆర్ట్ : సురేష్ (బేబీ సురేష్), ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ : దుర్గేష్.

ఆ కామెంట్స్‌కి సినిమానే సమాధానమిస్తుంది



వరుణ్ సందేశ్

మహా మూవీస్, ఎమ్ 3 మీడియా పతాకంపై వరుణ్ సందేశ్ ప్రధాన పాత్రలో ఆద్యంత్ హర్ష దర్శకత్వంలో మహేంద్ర నాథ్ కూండ్ల నిర్మించిన చిత్రం 'విరాజి'.

ఈ చిత్రం నేడు (శుక్రవారం) విడుదల కానుంది. ఈ నేపథ్యంలో హీరో వరుణ్ సందేశ్ మీడియాతో పలు విశేషాలను షేర్ చేసుకున్నారు.

- ఈ మూవీలో నా లుక్ కొత్తగా ఉండేలా మా డైరెక్టర్ ఆద్యంత్ హర్ష డిజైన్ చేశారు. రెండు డిఫరెంట్ కలర్స్‌లో వెరైటీగా హెయిర్ స్టైల్, ముక్కు పుడక, టాటూస్‌తో ఒక కొత్త మేకోవర్ చేయించారు. నాకు కథ కంటే ముందు నేను ఈ సినిమాలో చేసిన ఆండీ క్యారెక్టర్ లుక్ ఎలా ఉంటుందో డైరెక్టర్ వివరించారు. అది నాకెంతో బాగా నచ్చింది.
- ఇదొక మంచి సస్పెన్స్ థ్రిల్లర్ మూవీ. మెంటల్ ఆస్పత్రి దగ్గర కొద్దిమంది ఉంటారు. వారి దగ్గరకు ఆండీ వస్తాడు. అతను వచ్చాక గందరగోళం మొదలవుతుంది. అదేంటి అనేది తెరపై చూడాలి. ఈ కథలో అంతర్లీనంగా సోషల్ మెసేజ్ ఉంటుంది. ఈ సినిమాలో నా లుక్ చూసి రకరకాల కామెంట్స్ చేస్తున్నారు. సోషల్ మీడియాలో కూడా కామెంట్స్ వచ్చాయి. కానీ వాటికి ఈ సినిమానే సమాధానం చెబుతుంది. ఈ సినిమా చూశాక నేను ఎందుకు ఈ మేకోవర్‌లో ఉన్నానని తెలుసుకుంటారు. ఈ సినిమా చూశాక ఆండీ క్యారెక్టర్ పట్ల గర్వపడతారు.
- ఈ కథలో చాలా టిస్టులు, టర్న్‌ ఉంటాయి. ఒక మంచి మూవీ చేశామని మేమంతా కాన్ఫిడెంట్‌గా ఉన్నాం. ఈ సినిమా చూశాక చాలా ఎమోషనల్ అయ్యాను. చివరలో హార్ట్ టచింగ్‌గా అనిపించింది. నా వైఫ్ వితిక కూడా సినిమా చూసి అలాగే ఫీలయ్యింది. ఈ సినిమాలో సగం తెలుగు, సగం ఇంగ్లీష్ మాట్లాడుతుంటా. ఇది నా బాడీలాంగ్వేజ్‌కు కంఫర్ట్‌గా అనిపించింది.
- ఈ మూవీ కోసం ఒక ప్రమోషనల్ సాంగ్ చేశాం. ఆ పాటకు మంచి రెస్పాన్స్ వస్తోంది. ఎబనెజర్ పాల్ ఈ చిత్రానికి అద్భుతమైన బీజీఎం ఇచ్చాడు. సినిమాను మరో స్థాయికి తీసుకెళ్లాడు. థియేటర్లలో ఆ అనుభూతి కొత్తగా ఉంటుంది. ఆయన ఇప్పుడు మరో మూడు బిగ్ బడ్జెట్ ప్రాజెక్ట్స్ సైన్ చేయటం హ్యాపీగా ఉంది.
- ఏపీలో టూర్ చేశాం. ఆ టూర్‌కు మంచి రెస్పాన్స్ వచ్చింది. ఆ టూర్ విశేషాలు ఇన్‌స్టాలో షేర్ చేసుకున్నా. చీకట్లో ఉన్న వారికి వెలుగు పంచే వాడు విరాజి. ఇదే టైటిల్ జస్టిఫికేషన్. సస్పెన్స్, థ్రిల్లర్, హారర్ ఎలిమెంట్స్, డ్రామా, ఎమోషన్ వంటి అన్ని అంశాలు కథలో కలిపి రూపొందించారు దర్శకుడు ఆద్యంత్ హర్ష.
- మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్ ద్వారా మా మూవీ రిలీజ్ కావడం సంతోషంగా ఉంది. ఈ వారం దాదాపు పన్నెండు సినిమాలు రిలీజ్‌కు వస్తున్నాయి. వాటిలో మా మూవీ కనిపిస్తుందంటే దానికి మా ప్రొడ్యూసర్ మహేంద్రనాథ్ కూండ్ల చేయిస్తున్న ప్రమోషనే కారణం. ఈ కథను అలాంటి ప్రొడ్యూసర్ మాత్రమే నిర్మించగలరు.

అందరికీ కనెక్ట్ అయ్యే సినిమా



కృష్ణ వంశీ

కృష్ణ వంశీ, మోక్ష లీడ్ రోల్స్‌లో నటించిన లవ్ ఎంటర్‌టైనర్ 'అలనాటి రామచంద్రుడు'. చిలుకూరి ఆకాష్ రెడ్డి దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని హైనివా క్రియేషన్స్ బ్యానర్ పై హైమావతి, శ్రీరామ్ జడపోలు నిర్మించారు. ప్రముఖ ప్రొడక్షన్, డిస్ట్రిబ్యూషన్ సంస్థ శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ ఈ చిత్రాన్ని నేడు (శుక్రవారం) గ్రాండ్‌గా విడుదల చేయనుంది.

ఈ నేపథ్యంలో హీరో కృష్ణ వంశీ మీడియాతో మాట్లాడుతూ, 'మాది కడప. చిన్నప్పటి నుంచి సినిమాలంటే ప్యాషన్. కాలేజ్‌లో ఉన్నప్పుడు ఒక షార్ట్ ఫిల్మ్‌లో నటించాను. కోవిడ్ సమయంలో సత్యానంద్ దగ్గర నటనలో శిక్షణ తీసుకున్నాను. హైదరాబాద్ వచ్చి సినిమా ప్రయత్నాలు చేశాను. ఈ క్రమంలో డైరెక్టర్ ఆకాష్‌ని కలిశాను. నా ఆడిషన్ ఆయనకి నచ్చి ఈ సినిమా చేశాను. ఇది నా అదృష్టం. డైరెక్టర్ ఆకాష్ చాలా అద్భుతమైన కథ చెప్పారు. ఆయన చెప్పినపుడే మంచి సినిమా చూసిన అనుభూతి కలిగింది. ఇందులో నా పాత్ర పేరు సిద్ధు. తనది ఇంట్రోవర్ట్ క్యారెక్టర్. చాలా కాంప్లెక్స్ క్యారెక్టర్. చాలా సెటిల్‌గా పెర్ఫార్మ్ చేసే రోల్. అలాగే ఈ కథలో మంచి ఎమోషనల్ జర్నీ ఉంది. యూత్ 1000% కనెక్ట్ అవుతారు. అలాగే ఫ్యామిలీ కూడా కనెక్ట్ అవుతుంది. ఇందులో ఫాదర్- డాటర్ ఎమోషన్, మదర్- సన్ ఎమోషన్ కూడా ఆకట్టుకునేలా ఉంటాయి. సముద్రంలో చాలా అలజడులు వుంటాయి. నా పాత్ర కూడా అలాంటిదే. ఇందులో హీరోయిన్ పాత్ర పేరు ధరణి. సముద్రం, భూమి ఎలా కలుస్తారనేది చాలా పొయిటిక్‌గా ప్రజెంట్ చేశారు' అని చెప్పారు.

సరికొత్త అనుభూతినిచ్చే బడ్డీ



అల్లు శిరీష్

అల్లు శిరీష్ హీరోగా నటించిన లేటెస్ట్ మూవీ 'బడ్డీ'. గాయత్రి భరద్వాజ్, ప్రిషా రాజేశ్ సింగ్ హీరోయిన్లుగా నటించారు. ఈ చిత్రాన్ని స్టూడియో గ్రీన్ ఫిలింస్ బ్యానర్ పై కేఈ జ్ఞానవేల్ రాజా, అధన జ్ఞానవేల్ రాజా నిర్మించారు. శామ్ ఆంటోన్ దర్శకత్వం వహించారు. నేహ జ్ఞానవేల్ రాజా కో ప్రొడ్యూసర్‌గా వ్యవహించిన ఈ అడ్వెంచరస్ యాక్షన్ ఎంటర్‌టైనర్ నేడు (శుక్రవారం) గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. ఈ సందర్భంగా గురువారం హీరో అల్లు శిరీష్ మీడియాతో సంభాషించారు.

'ఈ సినిమాలో 3 వేలకు పైగా సీజీ షాట్స్ ఉన్నాయి. బడ్డీ ఫేస్‌ను యానిమేట్ చేయాలి. వాటిని పర్ఫెక్ట్‌గా చేయాలంటే డబ్బుతో పాటు ఆర్టిస్టులకు టైమ్ ఇవ్వాలి. దాంతో లేట్ అయ్యింది. సమ్మర్ అనుకున్నది ఆగస్టుకు పోస్ట్ పోన్ అయ్యింది. బొమ్మకు ప్రాణం వస్తే ఎలా ఉంటుందనే కీ పాయింట్ మీదే సినిమా ఉంటుంది కాబట్టి ఇంటర్నేషనల్ స్టాండర్డ్స్‌కు తగ్గకుండా సీజీ వచ్చింది. డైరెక్టర్ శామ్ ఆంటోనీ ఈ కథతో నా దగ్గరకు వచ్చి టెడ్డీ బేర్ పాయింట్‌తో ఉంటుందని చెప్పారు. హీరోయిన్‌కు, విలన్‌కు ఉండే కాన్‌ఫ్లిక్ట్, హీరో క్యారెక్టరైజేషన్, కథకు ఇచ్చిన జస్టిఫికేషన్స్ అన్నీ బాగా స్క్రిప్టింగ్ చేశాడు. ఈ కథ వింటున్నప్పుడు కొత్తగా అనిపించింది. నేను ఫస్ట్ టైమ్ పైలట్‌గా కనిపించబోతున్నా. నా క్యారెక్టర్ ఇంటెన్స్‌గా ఉంటుంది. ఈ సినిమా పోస్టర్ రిలీజ్ నుంచి ఇది రీమేక్ కదా అని కామెంట్స్ వచ్చాయి. కాదు స్ట్రైట్ ఫిల్మ్ అని చెప్పడమే మాకు పెద్ద సవాల్‌గా మారింది. అందరికీ అందుబాటు ధరల్లో మా సినిమాను థియేటర్స్‌లోకి తీసుకొస్తున్నాం. ఎప్పటికప్పుడు సరికొత్త కథలతో ప్రేక్షకులను అలరించాలని ప్రయత్నం చేస్తున్నాను. ఇకపై కూడా అలాగే చేస్తాను'.

వారసత్వ పన్నుపై చర్చ జరగాలి

(మొదటిపేజీ తరువాయి)

అర్థమవుతుందని చెప్పారు. దీనిపై దృష్టి సారించాల్సిన మీడియా ఆ బాధ్యతను విస్మరించిందని ఆక్షేపించారు. అంబానీ కొడుకు పెండ్లి ఖర్చును తెలంగాణ ప్రభుత్వానికి ఇచ్చి ఉంటే సగం దరిద్రం తీరి ఉండేదని వ్యాఖ్యానించారు. ఢిల్లీలో వరదల కారణంగా రావూస్ అకాడమీ లైబ్రరీలో ముగ్గురు విద్యార్థులు మరణించడం వెనుక లాభాపేక్ష కాకుండా, ఇంకేం కారణాలు ఉన్నాయని అడిగారు. లక్షల రూపాయలు ఫీజులు వసూలు చేస్తూ, సరైన వసతులు కల్పించకపోవడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని చెప్పారు. ప్రజాధనాన్ని ఏకపక్షంగా లూటీ చేస్తున్న వారి నుంచి వారసత్వ పన్ను విధిస్తే తప్పు ఏంటని ప్రశ్నించారు. 1980కి ముందు పత్రికలు సేవాభావంతో ప్రజల పక్షాన పనిచేసేవని చెప్పారు. విద్య, వైద్యరంగాల్లో దాతలు విరాళాలు ఇస్తే, దాన్ని సమాజసేవకు ఇస్తున్నట్టు భావించేవారనీ, పత్రికా రంగం కూడా ఇదే కోవలో ఉండేదని విశ్లేషించారు. 1985లో రాజీవ్‌గాంధీ నేతృత్వంలోని కేంద్రప్రభుత్వం సరళీకృత ఆర్థిక విధానాలను అమల్లోకి తెచ్చాక, అప్పటి వరకు వ్యాపారానికి మినహాయింపుగా ఉన్న రంగాలను పెట్టుబడిదారులు ఆక్రమించి, లాభాల కోసం తాపత్రయ పడటం ప్రారంభమైందన్నారు. పత్రికా రంగంలో వార్తల్ని అమ్ముకొని కూడా వ్యాపారం చేసుకోవచ్చని నిరూపించారని చెప్పారు. కానీ ప్రజాశక్తి, నవతెలంగాణ పత్రికలు ఏనాడు ఆ దిశగా ఆలోచన చేయలేదనీ, అవి ఎప్పుడూ ప్రజలు, కష్టజీవుల పక్షానే నిలిచి, సమాజ మార్పుకోసం పనిచేస్తున్నాయని చెప్పారు. పత్రికలు, ఛానల్స్‌లో నిజం దొరకడం కష్టంగా మారిందనీ, నాలుగు పత్రికలు చదివాక, ప్రజాశక్తి, నవతెలంగాణ పేపర్లు చదివి వాస్తవాలను ధృవీకరించుకొనే పరిస్థితులు ఏర్పడ్డాయని అన్నారు. వార్తల్ని కప్పిపెట్టి, మభ్యపెట్టి, వాస్తవాలను దాచిపెట్టి, అసలు ఏం జరిగిందో అర్థం కాకుండా ప్రజల్ని గందరగోళపరిచేలా ప్రచురిస్తూ, ప్రసారాలు చేసేలా ఓ వర్గం మీడియా తయారయ్యిందనీ, దానికి లాభాపేక్ష తప్ప, ప్రజా సంక్షేమం ఎక్కడిదని ప్రశ్నించారు. కానీ 'నవతెలంగాణ' మాత్రం వార్తల్ని విప్పిచెప్పి, వాటివెనుక ఉన్న ఉద్దేశ్యాలను ప్రజలకు వివరించేలా కృషి చేస్తుందని తెలిపారు. దూరదర్శన్‌ను పూర్తిగా మర్చిపోయే పరిస్థితులు ఏర్పడ్డాయనీ, మీడియా స్వభావమే పూర్తిగా మారిపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. న్యూస్‌క్లిక్ వంటి నిష్పాక్షిక మీడియా సంస్థలపై ఆంక్షలు, నిర్బంధాలు, నిషేధాలు కొనసాగుతూనే ఉన్నాయనీ, ఆ సంస్థ ఎడిటర్ ప్రబీర్ పుర్కాయస్థకు కనీసం బెయిల్ కూడా ఇవ్వొద్దని కేంద్రం చెప్పడం వెనుక అంతరార్థాలు తెలుసుకోలేనివేం కావన్నారు. పత్రికల్లో ఆన్‌లైన్ రీడర్ల సంఖ్య పెరుగుతున్నదనీ, నవతెలంగాణ ఆ దిశగా ప్రయత్నాలు కొనసాగించాలని సూచించారు. కేంద్రంలో మోడీ సర్కారు నియంతృత్వానికి తాత్కాలిక బ్రేక్ మాత్రమే పడిందనీ, కానీ ఆ వర్గ స్వభావంలో ఎలాంటి మార్పు లేదని విశ్లేషించారు. ఏ సినిమాలు తీయాలి? ఎలాంటి ఉపన్యాసాలు చేయాలి? అనేది కూడా వారే నిర్దేశిస్తున్నారని విమర్శించారు. పారిశ్రామికరంగంలో పెట్టుబడులు తగ్గుతున్నాయని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్వయంగా చెప్తున్నాయనీ, దీనివల్ల రాబోయే రోజుల్లో ప్రజల కష్టాలు, బాధలు పెరుగుతాయని హెచ్చరించారు. భారత ఆర్థిక వ్యవస్థ అంతర్జాతీయ పరిణామాలపై ఆధారపడి ఉన్నదనే వాస్తవాలను విస్మరించొద్దని అన్నారు. ప్రజలకు ఆధార్ కార్డు ఇచ్చినట్టే వ్యవసాయ భూములకు కూడా నెంబర్లు కేటాయించి, పేర్లు మాత్రం మరొకరివి చేర్చి, భూములు కబ్జా చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయనీ, ఇలాంటి వాటిని వెలికితీసి, ప్రజలకు అండగా నిలబడేందుకు ప్రజాశక్తి, నవతెలంగాణ పత్రికలు ముందు వరుసలో ఉండాలని దిశానిర్దేశం చేశారు. నవతెలంగాణ చీఫ్ జనరల్ మేనేజర్ పీ ప్రభాకర్ మాట్లాడుతూ పేదల పక్షపాతులం అని ప్రకటించి తాము పత్రికను నడుపుతున్నామని అన్నారు. అణగారిన,అట్టడుగువర్గాల హక్కుల సాధనలో పోరాటపటిమ, ఉద్యమస్ఫూర్తికి అండగా నిలవడమే తమ పత్రిక లక్ష్యమని వివరించారు. వామపక్ష పత్రికగా వేర్వేరు పేర్లతో సాగిన ప్రస్థానంలో అనేకమంది ఆస్తుల్ని పత్రిక కోసం త్యాగం చేశారని గుర్తుచేసుకున్నారు. ఆ పునాదుల మీదే 'నవతెలంగాణ' నిలబడి ఉందని స్పష్టంచేశారు. సిద్ధాంతం, రాజకీయం, నాయకత్వబలం, విలేకరులు, సిబ్బంది త్యాగాలు, శ్రేయోభిలాషుల సహకారమే పత్రికను కష్టకాలంలో నిలబెట్టాయని కొనియాడారు. ఆగస్టు 1 నుంచి 20వ తేదీ వరకు 'నవతెలంగాణ' సర్క్యులేషన్ క్యాంపెయిన్ నిర్వహిస్తున్నామనీ, దీనికి అందరూ సహకరించాలని కోరారు. నవతెలంగాణ న్యూస్ ఎడిటర్ రాంపల్లి రమేష్ మాట్లాడుతూ వివిధ పేర్లతో 82 ఏండ్ల సుదీర్ఘ పత్రికా ప్రస్థానంలో నిటారుగా నిలబడిన పత్రిక నవతెలంగాణ అని చెప్పారు. పత్రికారంగంలో వస్తున్న మార్పుల్ని అందిపుచ్చుకుంటూ, ఆన్‌లైన్ వీక్షకుల్ని పెంచుకుంటూ, నిజాన్ని నిజంగా నిర్భయంగా చెప్పగలుగుతున్నామని అన్నారు. ఈ గొప్పతనం 'నవతెలంగాణ' ప్రజల్ని చూసే దృక్పథంలోనే ఉందనీ, దానికితోడు సైద్ధాంతిక అవగాహన కలిగిన విలేకరులు, సిబ్బంది వల్లే ఇది సాధ్యమవుతున్నదని చెప్పారు. దాన్ని కొనసాగిస్తూనే, ప్రజల్ని మరింత ప్రభావితం చేసేలా వార్తా రచనలు జరగాలని కర్తవ్య నిర్వహణపై దిశానిర్దేశం చేశారు. నవతెలంగాణ మఫిషిల్ ఇంచార్జి జీ వేణుమాధవరావు, జనరల్ మేనేజర్లు భరత్, వెంకటేష్, రఘు, వాసు, నరేందర్‌రెడ్డి, లింగారెడ్డి, శశి తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న రాఘవులు



సర్క్యులేషన్ పోస్టర్ ఆవిష్కరణ

నవతెలంగాణ దినపత్రిక 9వ వార్షికోత్సవం సందర్భంగా ఆగస్టు 1 నుంచి 20వ తేదీ వరకు సర్క్యులేషన్ క్యాంపెయిన్ నిర్వహిస్తున్నారు. సంస్థ చీఫ్ జనరల్ మేనేజర్ పీ ప్రభాకర్ ఈ విషయం ప్రకటించారు. సర్క్యులేషన్ క్యాంపెయిన్‌కు చెందిన పోస్టర్‌ను వార్షికోత్సవ వేదికపై సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు ఆవిష్కరించారు. ఈ క్యాంపెయిన్‌కు సంస్థ ఉద్యోగులు, ప్రజలు సహాయ సహకారాలు అందించాలని సీజీఎం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు.

ఉత్తమ జర్నలిస్టులకు సత్కారం



ఉత్తమ జర్నలిస్టుగా ఊరగొండ మల్లేష్, ఎస్ఎస్ఆర్ శాస్త్రి శ్రీకాంత్,శ్రీనివాసరెడ్డి

నవతెలంగాణ దినపత్రిక 9వ వార్షికోత్సవం సందర్భంగా సంస్థలో పనిచేస్తున్న నలుగురిని ఉత్తమ జర్నలిస్టులుగా ప్రకటించారు. స్టేట్ బ్యూరో నుంచి మొదటి ఉత్తమ జర్నలిస్టుగా ఊరగొండ మల్లేష్, రెండో ఉత్తమ జర్నలిస్టుగా ఎస్-ఎస్ఆర్ శాస్త్రి ఎంపికయ్యారు. మఫిషిల్ నుంచి కరీంనగర్ స్టాఫ్ రిపోర్టర్ మొదటి ఉత్తమ జర్నలిస్టుగా శ్రీకాంత్, ఖమ్మం స్టాఫర్ శ్రీనివాసరెడ్డి రెండో ఉత్తమ జర్నలిస్టుగా ఎంపికయ్యారు. మఫిషిల్ ఇంచార్జి వేణుమాధవ్ వీరిని వార్షికోత్సవ వేదికపైకి ఆహ్వానించగా, సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు, నవతెలంగాణ చీఫ్ జనరల్ మేనేజర్ పీ ప్రభాకర్ సత్కరించారు. ఉత్తమ జర్నలిస్టులకు పుష్పగుచ్ఛం అందించి, పుస్తకాలను బహుమతులుగా ఇచ్చారు.

బొగ్గు బ్లాక్‌ల వేలాన్ని ఆపాలి

శ్రావణపల్లి బ్లాక్‌ను సింగరేణికి కేటాయించాలి

ఓసీపీ-2 సమావేశంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వీరయ్య



నవతెలంగాణ-రామగిరి

తెలంగాణలోని బొగ్గు బ్లాక్‌లను సింగరేణికే కేటాయించాలని, కేంద్ర బీజేపీ ప్రభుత్వం బొగ్గు గనుల వేలం ఆపాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య డిమాండ్ చేశారు. జులై 29న ప్రారంభమైన సింగరేణి పరిరక్షణ యాత్ర గురువారం పెద్దపల్లి జిల్లాలోని రామగుండం సింగరేణి ఆర్‌జీ-3 ఏరియాలో సాగింది. ఈ సందర్భంగా ఓసీపీ-2లో సమావేశం నిర్వహించారు. సమావేశానికి సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఎర్రవెల్లి ముత్యంరావు అధ్యక్షత వహించగా.. వీరయ్య మాట్లాడారు. తెలంగాణ బిడ్డ అని కిషన్‌రెడ్డిని నమ్మి ఓటు వేస్తే నట్టేట ముంచుతున్నారని విమర్శించారు. హైదరాబాద్‌లోనే బొగ్గు బ్లాకుల వేలం ప్రక్రియ నిర్వహించారని, ఈ వేలం కార్యక్రమానికి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెళ్లారని చెప్పారు. సింగరేణిని ప్రయివేటుపరం చేయడానికి గత బీఆర్ఎస్ ప్రభుత్వంతోపాటు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మొగ్గు చూపుతున్నాయన్నారు. మంచిర్యాల జిల్లాలోని శ్రావణపల్లిలో కూడా సింగరేణి సంస్థ బొగ్గు తవ్వకాలు చేపట్టాలని, కానీ, వేలంలోనే దక్కించుకోవాలని కేంద్రం చెప్పడం సరికాదన్నారు. గతంలో ఇలాగే నాలుగు బొగ్గు బ్లాగులను బీఆర్ఎస్ పాలనలో మోడీ ప్రభుత్వం ప్రయివేటు సంస్థలకు అప్పగించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

యాత్ర సభ్యులు, సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు భూపాల్ మాట్లాడుతూ.. రాష్ట్ర ఆర్థిక అభివృద్ధిలో నిరుద్యోగ సమస్య పరిష్కారంలో సింగరేణి తనవంతు పాత్రను పోషిస్తోందని చెప్పారు. సింగరేణి వల్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు డివిడెంట్లు, పన్నుల రూపంలో ప్రతి సంవత్సరం వేల కోట్లు వస్తున్నాయని తెలిపారు. అదేవిధంగా.. విద్య, వైద్యం, రోడ్లు, మంచినీరు ఇతర మౌలిక సదుపాయాల కోసం వేలకోట్ల నిధులను ఇతర ప్రాంతాలకు అందిస్తోందన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చేస్తున్న అన్యాయాన్ని అడ్డుకోవాల్సిన రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం విజ్ఞప్తులతో సరిపెడుతోందని విమర్శించారు. యాత్ర మరో సభ్యులు, సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు పి.ఆశయ్య మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కూడా కేంద్రంతో పోరాడకుండా సింగరేణికి గనులు దక్కకుండా చేసిందని విమర్శించారు. ఫలితంగా కోయగూడెం బ్లాక్-3, సత్తుపల్లి బ్లాక్-3ను ప్రయివేటు కంపెనీలు దక్కించుకున్నాయని చెప్పారు. తెలంగాణ బిడ్డలకు అన్యాయం జరగకుండా ఉండాలంటే శ్రావణపల్లి బొగ్గు బ్లాక్‌లను సింగరేణికి కేటాయించాలని, గతంలో ప్రయివేటు సంస్థలకు ఇచ్చిన రెండు బ్లాకులను తక్షణమే సింగరేణి అప్పగించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అఖిలపక్షాన్ని కలుపుకొని కేంద్రం మీద ఒత్తిడి తేవాలని సూచించారు. సింగరేణిని ప్రయివేట్‌పరం చేయడాన్ని వ్యతిరేకిస్తూ రాష్ట్ర శాసనసభలో తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సీపీఐ(ఎం) తరఫున సింగరేణి వ్యాప్తంగా అన్ని యూనియన్లు, కాంట్రాక్ట్ కార్మికులను కార్మికులు, ఉద్యోగులను పెద్దఎత్తున పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు పి.రాజారావు, సీపీఐ(ఎం) నాయకులు వై.యాకయ్య, ఎర్రవెల్లి ముత్యంరావు, జ్యోతి, సీఐటీయూ నాయకులు దొమ్మటి కొమురయ్య, ఎం.ప్రభాకర్, ఈ కుమార్, ఎండీ అహ్మద్ పాషా, జి.గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

Printed and Published by Nandayla Narsimha Reddy on behalf of Navatelangana Printers Private Limited, Printed at Navatelangana Printers Private Limited Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Telangana State, Published at Navatelangana Printers Private Limited, Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60886